
ఆంధ్ర సచిత్ర వార
పత్రిక
24-2-67



40 పైసలు

శౌర్య సాహస ప్రజ్ఞాశీలురైన మహావీరులు 'వీరపూజ'లందుకుంటూ
వస్తున్నారు!



విజయ సారథి ప్రొడక్షన్స్
వారి

వీరపూజ

డైరెక్షన్
ఆమంచర్ల శేషగిరిరావు

నిర్మాత - పోలవరపు కేశవులు చౌదరి



పాటలు.. సముద్రాల. కొసరాజు. ఆరుద్ర. దాశరథి వేటూరి మాటలు.. వేటూరి సంగీతం.. ఘంటసాల
ఛాయ.. జె సత్యనారాయణ కళ. కె.ఎస్. ఎన్. మూర్తి

N144

GOTETI Publicities...

డిస్ట్రిబ్యూటర్లు. ఆంధ్ర. మహాలక్ష్మి సీడెడ్ నవభారత్ నైజాం వాణి మైసూర్ మహేశ్వరి మూవీస్

కథలు

కథానికల సంఖ్యా, రచయితల స్థాయీ పెరుగు తున్నందులకు చాలా సంతోషం. 'అనగాననగా'తో ప్రారంభమైన మనకథాసాహిత్యము యెన్నోమార్పులు చెంది, భావ చిత్రీకరణలో, రచనావిధానములో విశిష్టతమైన స్థానమును పొందుతున్నది. 10.2.67 సంచికలో ప్రచురించబడిన 'సముద్రము' నామనస్సులో గంభీర ముద్రవేసినది. తిలక్ కథలు, గాథలు మనస్సులోని రొదలు మరల గుర్తుకొచ్చినవి. 'సముద్రం' కథ చదువుతున్నకొలదీ మనస్సులో మెదిలే భావపరంపరలు మనోహరంగా వుంటే లీలంగావి, మ్యూతనలేని, రచనావిధానం, వున్నత స్థాయిలో సాగి సంతోషాన్నే కలిగించినది. అర్థంలేని మాటలులేవు. అర్థంకాని మాటలు అర్థంచేసికొంటే రచయిత ప్రయత్నం సఫలీకృతమవుతుంది. ఆయన ఆలోచనలు, ఆశయాలు, ఫలించి ఆలోచనలకు ధన్యత చేకూర్చగలవు. మనస్సులో కనిపించే వాస్తవాన్ని మన కళ్ళలముందు పెట్టి కల్మషాన్ని, నైర్మల్యాన్నీ విడదీసి ఇది—ఇదిగా— అది అదిగా తూకంరాళ్ళతో తూచి

ఉత్తరాలు

చూపించినారు రచయిత. ఈ సంచికలోని యితరకథలు క్రొత్తవాతావరణంలోనివికావు. పసి వసంతానికి చివుళ్ళువేసిన ప్రాతమోళ్ళ. చదవటానికి సొంపుగావున్నా నవకథాచైతన్యం కనిపించదు. 'అప్పుల లోని ఆంతర్యం' స్మృతిరేఖలు మామూలుగా వున్నవి. ''నన్నుకారెక్కించుకోరూ'', రచయిత చక్కని పేరు పెట్టారు. పేరులోకాదు రచనా సంవిధానంలో వుండాలి మెరుపు కుదింపు. అలాంటి సొంపు కనిపించకుంటే వాసనలేనిపూవు విధమేగదా! రచయితలు యింకా ప్రయత్నించాలని నాకోరిక. తిలక్‌లాగా కాల్పనిక సాహిత్యం సృష్టించి, సి. నారె. లాగ 'అక్షర గవాక్షాలు' నిర్మించి, ఆరుద్రలాగ జంటపదాలతో, నవచైతన్యం, నవసాహిత్యం, నవ్యత్వం సిద్ధించేటట్లు చేయటానికి రావాలి రావాలి రచయితలంతా ముందుకు.

వె. సా. రావు (ఉదయగిరి)

*   *   *

అంధ్యాల సూర్యనారాయణగారు వ్రాసిన 'పల్లెటూళ్లో బడిపంతులు' కథానిక వాస్తవానికి దూరంగావున్నట్లు కనిపించదు. విభిన్న వ్యక్తులమధ్య ఛిన్నాభిన్నమగుచున్న మన్నిత మనస్కుల జీవితచిత్రీకరణ చక్కగా జరిగింది. మృగ్యమైన సత్యాన్ని మరుగునపెట్టి హేయమైన భావనతో పసందైన పరిహాసముతో తోటివారి జీవితాలతో చెంగాటమాడేవారుంటారనే సత్యాన్ని బయట పెట్టారు రచయిత. బస్సు దిగగానే కొద్దిసామానుకు మూడురూపాయిలడిగారనుటలో సందేహం లేదు. ప్రత్యక్షంగా నేనీ అనుభవాన్ని పొందగలిగాను. అడవుల మధ్య వుద్యోగాలు చేస్తూ, అప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ, మానసికంగా క్రుంగిపోతూ, శారీరకంగా జీవితయాత్రను సాగించుకుపోయే కొందరికి యీకథ సంతోషాన్ని కలిగించి, భావిజీవితంపై భారమైన బరువును దించివేసి గోరంత ఆశను చూపించ గలదని నమ్ముతున్నాను.

వెలివల సాంబశివరావు (ఉదయగిరి)

*   *   *

ఇది మీకు తెలియదా?
ఎవరూ చెప్పలేదా?

చదివే అలవాటు వల్ల అనేక కొత్త విషయాలు తెలుస్తాయి. అనుభవం, విజ్ఞానం ఎక్కువయి జీవితం ప్రతిభ ప్రజ్ఞలతో అనేక విధాల అభివృద్ధి అవుతుంది. అయితే నిత్యజీవిత తాపత్రయాలతో వందల కొలది ఖర్చుపెట్టి, ప్రతిదీ కొని చదివే తీరిక ఉండదు. దానితో తెలుసుకోవలసిన అనేక మంచి విషయాలు తెలియకుండా పోతాయి. మీకీ శ్రమ లేకుండా ఆ లోటును భర్తీచేయటానికి ప్రతి సంవత్సరం అన్ని మంచి పత్రికలు, పుస్తకాలు, సంవత్సరమంతా అదే వృత్తిగా చదివి, వాటిలో అనుభవాన్ని, ఆనందాన్ని, విజ్ఞానాన్ని, ఆశ్చర్యాన్ని ఎక్కువచేసే అనేక గొప్ప విషయాలు ఏరికూర్చి, "తెలుసుకోదగ్గవి" అనే పుస్తక రూపంలో సంవత్సరానికో భాగంగా తెలుగులో ప్రచురింపబడుచున్నది. చివరకు మిగిలేది, మనతో వచ్చేది, మనం చదివి తెలుసుకొనే విజ్ఞానం మాత్రమే. మొదటి భాగం తయారుగా ఉన్నది. ఇందులో మీరు వెంటనే తెలుసుకోదగ్గ అనేక రకాల అద్భుత విషయాలున్నాయి. పది సామాన్య జన్మలలో రాని అనుభవ ఆనందాలను, దీన్నొక్కసారి కాలక్షేపంగా చదివినంతలో పొందగలరు. కుటుంబంలో అందరికీ ఉపయోగిస్తుంది. మీ యింట్లో విద్యార్థులకు కూడా ఎంతో లోకజ్ఞానం తెస్తుంది. చదవటం మొదలిడితే పూర్తి అయ్యేవరకూ మానరు. చదువులో యిదివరకు మీరు చవిచూడని ఎన్నో గొప్ప రుచులు చూపిస్తుంది. దానెత్తు బంగారం అయినాసరే యిచ్చి, కొని చదవదగ్గ విషయాలందున్నాయి. ఒక సంవత్సర శ్రమ ఫలితం. రచన : **ఎ. యస్. మూర్తి, ఎం.ఏ.** 320 పేజీలు. ధర పోస్టు ఖర్చులతో సహా రూ. 5/- ఇది మీరు చదివేక, మీ మనస్సాక్షిగా మీరనుకొన్నట్లు లేదనుకొంటే, మీకు పుస్తకం అందిన మూడు రోజుల్లో తిరిగి పంపిస్తే, ధరలో పోస్టు ఖర్చు రూ. 1 పోను, మిగతా రూ. 4 యదార్థంగా మీకు వెంటనే తిరిగి పంపబడును. ప్రతి పేజీలోను రత్నాలలాంటి అనేక అమూల్య విషయాలున్నాయి. ఇవే మీరు స్వంతంగా తెలుసుకోవాలంటే అనేక వందల రెట్లు ఖర్చు శ్రమ అగును. అలాంటి శ్రమ లేకుండా యిది మీకు అమర్చిపెట్టినట్లు అందుబాట్లో ఉంది. ముందుగా డబ్బు పంపే పనిలేదు. **దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర** కు ఉత్తరం వ్రాస్తే పోస్టు ఖర్చులతో సహా రూ. 5 లకు వి. పి. పోస్టులో పంపబడును. ఇది మీరు త్వరపడవలసిన చక్కటి అవకాశం.

SWA TTK

"పల్లెటూరులో బడిపంతులు." కథ చాలా బాగుంది. గ్రామాలలో ఉపాధ్యాయులు పడేపాట్లు గ్రామ పరిస్థితుల చక్కగా వర్ణించినారు.

గ్రామాలలో పనిచేసే గ్రామసేవికలు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులు యిట్టి అనేకచిక్కు సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. గ్రామ పెద్దలలో కల ద్వేషాలవల్ల చిన్న ఉద్యోగులకు కలిగే యిబ్బందులను తేలికభాషలో కథగా అందించిన శ్రీ జంధ్యాల సూర్యనారాయణగార్కి నా కృతజ్ఞాభివందనములు.

సంద్రమౌళి వెంకటసత్యనారాయణ (కాటావులపల్లి)

* * *

మీరు 10—2—67 తేది పత్రికలో ప్రచురించిన శ్రీ ఇస్మాయిల్ వ్రాసిన కథ "సముద్రం" చదివి చాల బాధపడ్డాము. నీతిని, మనోవికాసాన్ని, ధర్మమార్గాన్ని ప్రబోధించవలసిన పత్రిక, కేవలం సెక్స్ సంబంధించిన నీచాతి నీచమైన సన్నివేశాలతో కథ ప్రచురించడం ఘోరం. పిన్నలు, పెద్దలు చదివే పత్రికలో ఇలాంటి సన్నివేశాలు ఏమి బాగా లేవు. అందులో మీరు ప్రజలకు తెలిపే నీతిఏమిటో బోధపడడం లేదు. మీరు ప్రతి పత్రికలో మీకు నచ్చిన కథలనే పత్రికలలో వేస్తామని ప్రకటిస్తున్నారు. మీకు ఈ కథలో నచ్చిన అంశాలుఏమిటి? ఏ విషయాలనైతే పిల్లలకు తెలియకూడదని జాగ్రత్తగా ఉంటామో అలాంటి వాటిని బహిరంగంగా నలుగురు చదివే పత్రికలో ఎక్కించడం అసభ్యంగా ఉంది.

ప్రజల నైతికస్థాయిని పెంచాల్సిన కథలు నాకు అవసరం కాని, కేవలం, సెక్స్, అసభ్యకరమైన సన్నివేశాలతో నిండిన కథలు అవసరం లేదు. ఇప్పటికి కొన్ని సంవత్సరాలగా మీ పత్రికను చదివే మేము ఈసారి, ఈ "సముద్రం" కథ వల్ల భరించలేక మీకు, వ్రాస్తున్నాము.

ఎం. స్వర్ణ, ఎం. ఇందిర,
ఎం. ప్రభావతి, ఎం. గౌరి (హైదరాబాదు)


ఉత్తరాలు

గోల్డ్ ఫింగర్

ఈనడుమ వెలువడుచున్న 'గోల్డ్ ఫింగర్' శీర్షిక చూచితిని. ఇది మన సాంప్రదాయవిరుద్ధమైన భావములకు దోహదకారియని నా అభిప్రాయము. పాశ్చాత్యమానసిక శాస్త్రవేత్తలు కూడా ఇట్టి అభిప్రాయమునే వెలిబుచ్చియున్నారు. అపక్వ హృదయులగు యువతీయువకులు మానసిక వికాసముపై 'గోల్డ్ ఫింగర్'వంటి చలనచిత్రములు, కథలు ప్రసరించు దుష్ఫలితములు పాశ్చాత్యదేశములలోనే కనిపించుచున్నవి! మనదేశము సంగతి వేరే చెప్పనవసరములేదు. అందునను ఆంధ్రసచిత్రవారపత్రిక ముఖ్య పాఠకుల అభిరుచులూ, అవసరములూ దృష్టియందుంచుకుని మీ 'గోల్డ్ ఫింగర్' శీర్షికను పరిశీలించినచో, దీనివలన కలుగునష్టములు మీకే తెల్లము కాగలవు. పాశ్చాత్య సభ్యతను తూలనాడుట నా అభిమతముకాదు. 'గోల్డ్ ఫింగర్'వంటి రచనలుపాశ్చాత్య నాగరికతలోని అతినికృష్టతరమైన అంశములనే వెల్లడిచేయుచున్నదని విజ్ఞుల అభిప్రాయము. దీనిని మీరు గ్రహించినచో నేను ధన్యుడను.

ఈశీర్షికను ఇంతటితో నిలిపివేయుమని నా ప్రార్థన. పాఠకలోకముపై తమకుగల బాధ్యతను పురస్కరించుకుని ఇట్లు కోరటమైనది.

ఏ. రాధానందప్రభు (బెంగుళూరు)



వ్యాసాలు

10—2—67 పత్రికలోని కథలన్నీ ఎంతో బాగున్నాయి. ముఖ్యంగా "సముద్రం", "పిడొక్కలు", "నన్ను కారెక్కించుకోవూ" అన్న కథలు అద్భుతంగా ఉన్నాయి. రచయితలు శ్రీ యిస్మాయిల్, వెంకట్రామరెడ్డి, అరిగే రామారావుగార్లకు నా ధన్యవాదాలు.

వనితాలోకంలో మీరు ప్రచురించిన "శ్రీమతి కెన్నెడీ రాణివాసం" చదివిన నాకు ఎంతో బాధ గలిగింది. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన వో మహాపురుషుడు శ్రీ కెన్నెడీ. ఆయనున్నంతకాలం దేదీప్యమానంగా ప్రకాశించిన ఆయన కుటుంబ గౌరవం శ్రీమతి కెన్నెడీవల్ల తరుగుతుందని తెలిస్తే ఎవరికైనా బాధ కలుగుతుంది.

ఆ మహాపురుషుడు ఇపుడు మనలో లేనప్పటికీ ఆయన వెలిగించిన దివ్యజ్యోతులు మనందరిలో ప్రకాశిస్తున్నాయి. ప్రపంచంలోని భాగ్యవంతమైన, వైజ్ఞానికంగా ఎంతో అభివృద్ధి సాధించిన దేశాధినేత భార్యగా శ్రీమతి కెన్నెడీ తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోలేకపోవడం ఎంతో దురదృష్టకరం.

తన "కుమారుడు, కుమార్తెల భవిష్యత్తును తీర్చిదిద్ది కెన్నెడీ అంతటివారిని చేయుటయే నా కర్తవ్యంగా భావిస్తా"నన్న శ్రీమతి కెన్నెడీ ఇలా ప్రవర్తించడం ఎవరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఏమైనా యుగపురుషుడు శ్రీ కెన్నెడీకుటుంబ గౌరవాన్ని, ఆయనకు ప్రపంచంలో గల పేరు ప్రతిష్ఠలను కాపాడే బాధ్యత ఆమెపై ఉంది.

నెల్లూరి గాంధీచౌదరి (గొర్లవారిపాలెం)

* * *

3.2.67 సంచికలో శ్రీమతి జమునారమణారావుగారు, నావిదేశయాత్ర వ్యాసంలో, మాస్కోలో లెనిన్ సమాధివద్ద గార్డ్సు మార్పిడి అయినప్పటి సంఘటన గురించి వ్రాస్తూ, ఆ గార్డ్సు పెరేడ్ బాగున్నా వందలాది జనంవిరగబడి చూడడం ఎంతో ఆశ్చర్యంవేసి నవ్వు వచ్చిందని రాసారు. ఈ మార్పు ప్రతిగంటకి జరుగుతుంది. ఫర్లాంగ్‌కన్న దూరంలో నుంచి ఆగార్డు నిర్ణీతసమయంలో బయలుదేరి, సెకెండ్లలో సరిగా స్టెప్స్‌వేసి, పెరేడ్‌చేస్తూ లెనిన్ సమాధివద్ద చేరి ఆఖరిమెట్టుపై అడుగుపెట్టే సమయానికి క్రెమ్లిన్‌పైనున్న గడియారం సరిగ్గా గంటలు కొడుతుంది. ఒక్కసెకండుకూడ ముందు, వెనుక జరుగదు. ఎంతో నియమబద్ధంగా ఉండే ఈపెరేడ్ చూడడానికి విదేశీయులేకాక, అక్కడి రష్యన్‌లుకూడ ఎంతో ఉత్సాహంతో వస్తారు. నామటుకి నేను ఆ పెరేడ్ మూడురోజులు సరిగ్గా సమయానికి వెళ్లి చూసేను. అటువంటిది, శ్రీమతి జమునగారికి, చూస్తున్నవారిని చూచి నవ్వొచ్చిందందుకు, నాకెంతో ఆశ్చర్యమనిపించింది. బహుశా ఆమె ఆ గంటలు కొట్టడాన్ని, ఆసమయాన్ని గమనించలేదేమో!

కంచి శేషావతారమ్ (భిలాయ్‌నగర్)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 24—2—'67
పరాభవనామ సం॥ మాఘ మాసం॥ పూర్ణిమ

సంపుటము : 59 సంచిక : 24

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీథి, మద్రాసు-1

చందా వివరాలు : 10 2-1967 మొదలు

భారతదేశం

పోస్టుద్వారా

సంవత్సర చందా	22.40
6 మాసముల చందా	11.20
3 మాసముల చందా	5.60
విడిప్రతి	0.40


ఇతరదేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	42.00
అర్ధసంవత్సర చందా	21.00

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటి సుచిత్రాసేన్



శ్రీకృష్ణ

మహమ్మదీయులు - అస్మదాదులు!

మన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ఢిల్లీలో ప్రసంగిస్తూ రెండు రసవత్తరమైన అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఆమె కనుగొన్న నినాదాన్ని మొదట చెప్పాలి. 'కాంగ్రెసు, లేకపోతే అధ్వాన్న పరిస్థితి!' అనేది ఆ నినాదం. వోట్లు కూడబెట్టుకోవడానికి వేసిన మంత్రం రెండవది. ముసల్మానుల వ్యక్తిగతమైన న్యాయసూత్రాలు ఏమాత్రమూ సడలించ బడవు, వాటిని ఆదరిస్తాము, అని ఆమె భరోసా ఇచ్చారు. ముసల్మానుల వంటి మైనారిటీ వర్గాలకు తగిన న్యాయం జరగడంలేదు, ఉర్దూకు ప్రాంతీయంగానైనా మర్యాద ఇచ్చి వుండాల్సింది, అంటూ విచారం వ్యక్తం చేశారు!

సిక్కుల్ని శాంతపరుస్తూ వారిని కాంగ్రెసు గూటికి లాగడానికి గాంధిగారు ఎలా శ్రమపడ్డారో ఆ కథను 'న్యూఢిల్లీ లేఖ'లో ఇదివరకు మనం ప్రస్తావించుకున్నాం. జాతీయ పతాకావిర్భావ సంవత్సరంలో మహాత్మాగాంధీ సిక్కులకు లొంగిపోయారు. ఫలితంగా పంజాబీసుబా అనే పేరుతో 'సిక్కిస్థాన్' ఏర్పడి పోయింది.

విభాజితం కాకముందు హిందీ, ఉర్దూలకోసం ఎంతో పోరాటం జరిగింది.

నైజాం పరిపాలనలో ఉర్దూ అధికారభాషగా వుంటూ వుండేది. అప్పటి ఉస్మానియా యూనివర్సిటీలో ఉర్దూ బోధనాభాషగా కూడా వుండేది. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, పంజాబులలో ఇది అధికార భాషగా వుండేది. ఢిల్లీలో అగ్రాసనం వేసుకున్న 'అంజుమాన్ తరక్కీ—ఇ—ఉర్దూ' అనే సంఘం ఒకటి వుంది. అగ్రాసనానికి కావలసిన కార్యాలయాన్ని నిర్మించుకోడానికి ఢిల్లీలో కొంతభూమిని ఆ సంస్థ సేకరించుకొని వుంది. శ్రీయుత మహమ్మద్ ఆలీ జిన్నాగారు పద్నాలుగు సూచనలు చేసి వున్నారు అందులో ముస్లింమతాన్ని సంరక్షించాలని, ఉర్దూ భాషకు, దాని సంస్కృతికి రక్షణ కల్పించాలని ఆయన చెప్పారు.


1947 నుంచి ఈ విధమైన వ్యవహారాల్లో కొంతమార్పు వచ్చింది. ముఖ్యంగా 1965 జనవరి 26 నుంచి హిందీ అధికార భాష అయినప్పటినుండి మరీ అంతరాయం ఏర్పడింది. పండిట్ నెహ్రూగారి హయాంలోనే ఉత్తరప్రదేశ్‌లో ఉర్దూ అధికార భాషగా వుండడానికి ఆయన అంగీకరించలేదు. పండిట్ పంత్ జమునానదిని యమునగాను, బెనారస్‌ను వారణాసిగాను, కాన్పూర్ (Cawnpur) వర్ణక్రమాన్ని కాన్పూర్ (Kanpur) గాను మార్చేశారు. న్యూఢిల్లీలోని రోడ్లన్నీ 'మార్గ్'లుగ వ్యవహరించ బడుతున్నాయి. రాజకీయ దురంధరులుంటున్న ప్రదేశాన్ని 'చాణక్యపురి'గా చేశారు. అందులో రోడ్లన్నీ హిందీ పేర్లతోనే వున్నాయి. రష్యన్లు, ఫ్రెంచివారు, ఇలా అనేకమంది విదేశవాసుల సౌకర్యార్థం రోడ్ల గుర్తులన్నీ హిందీలోనే చూపించారు! 'మిస్టర్' అనే దానికి 'శ్రీ' అంటూ తర్జుమా చేశారు పండిట్ నెహ్రూ. బిరుదులు 'పద్మశ్రీ' లై శ్రీలను సంతరించుకున్నాయి. నెహ్రూగారు ఉర్దూకు తగిన గుర్తింపు ఇవ్వాలని అనుకుని వుంటే 'మిస్టర్' అనేపదాన్ని 'జనాబ్'గా తర్జుమా చేసి వుండేవారు!

ఇది కాంగ్రెసు విధానాన్ని విమర్శించడం కాదు నిజాన్ని బట్టబయలు చేయడం. శ్రీమతి గాంధీగారు ఏదైనా అభియోగం తెచ్చినట్లయితే అది, 1946 నుంచి 1964 వరకు ఈదేశాన్ని పాలించిన వారి తండ్రిగారి మీదనే!

'రాజనీతి నిపుణుడు తన తరువాతి తరం గురించి యోచిస్తాడు, రాజకీయవేత్త తర్వాత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు' అనే ఒక నానుడి వుంది. శ్రీమతి గాంధీ ఒక రాజకీయ వేత్తగా వ్యవహరిస్తున్నారు. రాజనీతిని దృష్టిలో వుంచుకున్నట్లయితే ఆమె ఉర్దూను ప్రోత్సహించేవారు కాదు ఈ చివరిదశలో ఇటువంటి ఆందోళనలు ఎంత ప్రమాదకరమో ఆమె వూహించి వుండేవారు. అందులోను, ఉత్తర భారతంలోని ముస్లింల పిల్లలు హిందీని నేర్చుకోవడం మొదలు పెట్టనే పెట్టారు. ఉర్దూను ప్రోత్సహించడం ఏమంత శ్రేయస్కరం కాదు. తర్వాత్తర్వాత ఉత్తరప్రదేశ్‌నుంచి 'ఉర్దూ సుబా' వేరుపడే ఆందోళనలు లేవడానికి ఆస్కారం వుంది. నిజంగా చెప్పాలంటే, ఉత్తరప్రదేశ్ అయోధ్యకు పశ్చిమోత్తర రాష్ట్రంగా వ్యవహరించ బడాలి. అయోధ్యలోని తాలూకాదార్లను శాంతపరచడానికి ఉత్తరప్రదేశ్ రాజధాని, అలహాబాదునుంచి లక్నోకు తీసుకెళ్ళ బడింది. శ్రీ కె. యమ్. పణిక్కర్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సిద్ధాంతాన్ని వ్యతిరేకించారు. ఉత్తరప్రదేశ్ విభజింప బడాలి అప్పుడు, ఏవిధముగా పరిశీలించి చూసినా అంత స్థోమత దానికి లేదని ఆయన వాదించారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు చాలా వెనకబడి వున్నాయి పరిపాలన, ఆర్థిక, రాజకీయ బలాబలాల దృష్ట్యా [illegible]కోగల్గిన శక్తి వాటికి లేదు. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణకు తలపెట్టినప్పుడు భాషావాదుల్ని శమనపరచినందువల్ల లాభం లేదు. స్వయంపాలనకు కావలసిన సరంజామా ఆ రాష్ట్రం దగ్గర వున్నదా? అంత బలాన్ని ఆ రాష్ట్రం సమకూర్చుకో గలుగుతుందా? అని ఆలోచించడం మంచిది

మైనారిటీవర్గాల్ని, ముఖ్యంగా ముసల్మానులను 'ఏజాతి రాష్ట్రాలతో' సన్మానించలేకపోయిన కాంగ్రెస్ విధానం దెబ్బతిన్నది! కొందరికి మాత్రమే వర్తించే విధాన్ననుసరిస్తున్న కాంగ్రెసు తన పద్ధతిని మార్చుకోవడం ఇటువంటి సమయాల్లో అవసరం అని తోస్తున్నది. బ్రిటిషువారు వదిలివెళ్ళినస్థానంలో కాంగ్రెసు అధిష్టించిందే కాని భారతదేశాన్ని ఐక్య రాజ్యంగా చేయలేక ఆశాభంగాన్ని కలిగించింది. బాబూ జగ్‌జీవన్‌రామ్ మొదలైన కాంగ్రెసు ప్రముఖులు 'షెడ్యూల్డ్ కులాలు' అనే తరగతిని సృష్టించారు. భారతదేశంలోనే వీరుమరో దేశీయులుగా గుర్తింపబడుతున్నారు. ఈ 'షెడ్యూల్డ్ కులాల' అధఃమానవతను ఊర్ధ్వ దశకు తీసుకుపోవడానికి ఇంకా కృషిచేయాలి, భారతీయుల్లో కలుపుకోవాలి!

పూర్తిగా ఢిల్లీ గురించి మాట్లాడినట్లయితే వర్తక వ్యాపారాల్లో ముసల్మానులు వెనకబడివున్నారు. అయినా పాకిస్తాన్‌లోని హిందువులవలె, ముఖ్యంగా పశ్చిమ పాకిస్తాన్‌లోని వారివలె, మన ముసల్మానులు పూర్తి స్వతంత్రులుగా అన్నీ అనుభవిస్తున్నారు. వారికి కేంద్ర ప్రభుత్వంలో ఇద్దరు ప్రతినిధులు ఉన్నారు. వీరు ముసల్మానులకు ఏకీడూ కలక్కుండా జాగ్రత్తగా కాపాడుతున్నారు. విద్యామంత్రులు (చాల తక్కువ కాలానికే అనుకోండి!) ఎప్పుడూ ముసల్మానులే అయి వుంటున్నారు. మవులానా అజాద్, హుమాయూన్ కబీర్, చాగ్లాగారలు ముందు తరాలవారు. ఇప్పుడు ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్‌గారు వారసత్వాన్ని స్వీకరించారు. పురావస్తు పరిశోధన శాఖ ఒకటి వుంది. అది విద్యాశాఖలోని ఒక అంగం ఈశాఖ, హిందూ దేవాలయోద్ధరణ కంటే మహమ్మదీయ కట్టడాలమీదనే ఎక్కువ మోజు చూపిస్తూ వుంది. ఢిల్లీలోని 'జుమా మస్జీద్' మీద లక్షలకొద్దీ ధనాన్ని వెచ్చిస్తున్నారు. అది అంతగా సంరక్షింపదగిన కట్టడం



మీ ఓటు నాకు వేస్తారా వెయ్యరా? తొరగా చెప్పాలి! ఒకటి...రెండూ

కూడాకాదు! అంబర్, చిత్తూర్, హాలేబీడ్, విజయనగర్, గవుర్, మండూర్ వంటి చారిత్రక స్థలాల్ని సంరక్షించేందుకు ఒక్కరూ పూనుకోవడం లేదు. ఈ యా ప్రదేశాల్లో పవిత్రమైన దేవాలయాలు అనేకం ఉన్నాయి, అవన్నీ చరిత్ర ప్రసిద్ధంగా పతనమైపోయిన నగరాలు.

దీనివలన మనకు అర్థమవుతున్న దేమిటి అంటే, హైందవుల అధికబలం వున్న కాంగ్రెసు ప్రభుత్వం కూడా మహమ్మదీయ కట్టడాలకోసమే కృషిచేస్తూ వున్నదని.

శ్రీమతిగాంధి మరల మరల పునరుక్తంగా వివరిస్తున్న కాంగ్రెసు విధానం, పూర్తిగా విభిన్నవిధానం. కాంగ్రెసు పరిపాలకుల దృష్టిలో భారతదేశంలో నాలుగు విధాలయిన న్యాయ సూత్రాలున్నాయి. భారత నియమనిబంధనలు వర్తించని కాశ్మీరీలకు వేరుగా ఒక పద్ధతి వుంది. ఇప్పుడున్న వైఖరిని చూస్తే, ప్రతి ఒక్క కాశ్మీరీ భారతీయుడి క్రిందే జమ. అతని కార్యాలయాలు మనదేశంలో ఏర్పరచుకోవచ్చు, మనదేశంలో ఆస్తినీ సమకూర్చుకోవచ్చు. కాని, భారతీయుడు మాత్రం కాశ్మీరీ అవడు! ఏ భారతీయుడూ కాశ్మీరు వెళ్ళి, అక్కడ తన కార్యాలయాన్ని ఏర్పరచుకోడానికి గాని, ఆస్తి సమకూర్చుకోడానికి గాని అర్హుడు కాడు. కాశ్మీర్ భారత పార్లమెంటు పరిధులో లేదు. మన పార్లమెంటు దానికి వర్తించదు. భారత న్యాయసూత్రాల సరిదిద్దేందుకు కాశ్మీర్ ప్రజలకు ప్రాతినిధ్యం వుంది. కాని కాశ్మీరు వ్యవహారాల్లో కలగ జేసుకోడానికి ఏ భారతీయుడికీ హక్కు లేదు! కాశ్మీరలోని ప్రజాస్వామ్యం— కాశ్మీరీల చేత, కాశ్మీరీల యొక్క, కాశ్మీరీలకోసం అనే రీతిలో ప్రభుత్వం నిర్వహించబడుతూ వుంది. ప్రజాస్వామ్యాన్ని వెక్కిరిస్తూ ప్రత్యర్థి వర్గాన్నంతా శ్రీ సాదిక్ అణిచి పెట్టారు. 'తమ అభిప్రాయాల్ని వెల్లబుచ్చడానికి కాశ్మీర్ ప్రజలకు అవకాశమిచ్చేది లేదు!' అన్న పాలిస్సీను బలపరుస్తూ ఆయన అధికారం చలాయిస్తున్నారు.

ముసల్మానులకు వ్యక్తిగతమైన కొన్ని నియమాలు ఉన్నాయి. ముసల్మానుల ప్రమేయం లేకుండా వాటిని మార్చడానికి వీల్లేదంటున్నారు శ్రీమతి ఇందిరాగాంధి. ముస్లింలలోని వివేకవంతులెప్పుడూ ఈ అభిప్రాయాన్ని ఆసరాగా తీసుకుని విగ్రవీగరు. కాని, ముల్లాలు, మవులానాలు ఎగిరిపడేందుకు అవకాశం వుంది. మరో విధంగా చెప్పాలంటే, ఒక ముసల్మానేతరుడు మొదటి భార్యకు విడాకు లివ్వకుండా రెండో వివాహం చేసుకున్నట్లయితే, 'నడునాయనా' అంటూ శ్రీ కృష్ణ జన్మస్థానంలో కూర్చోబెడతారు. ముసల్మానుల నియమం ప్రకారం ఒకేసారి నలుగుర్ని పెళ్ళాడనూ వచ్చు, నలుగురి భార్యలతో కాపురం చేయనూవచ్చు. అసలు ఇటువంటి న్యాయశాస్త్రాన్ని సృష్టించిన ఇస్లాంమత ప్రవక్తకిటుకు వేరు. మతం ఉద్ధరింపబడాలి అంటే జనసంఖ్య కావాలి. అందుకని ఈ విధానం బాగా పనిచేస్తుంది! శ్రీమతి గాంధి, ముసల్మానులకు వారి వారి నియమాల్ని సంరక్షిస్తామని హామీ యివ్వడానికి తగిన కారణం ఏమై వుంటుందీ అనేది ఇక్కడి ప్రశ్న. ఎవరామెను పురిగొల్పారు? భారతదేశంలోని ముసల్మానుల్లో ఎవరైనా ఇలా కావాలని ఆందోళన చేశారా? జనసంఘం లేదా తదితర పార్టీలకు మీ వోటువేస్తే వారు మిమ్మల్ని ఏవిధంగాను రక్షించలేరు, ఇదిగో నేను హామీ యిస్తున్నాను, కాంగ్రెసుకు మీ వోటు వెయ్యండి, అంటూ ఆమె ఎన్నికల ప్రచారం మొదలెట్టారా??

మూడోరకం న్యాయసూత్రం ఒకటి వుంది. అది కాంగ్రెసు నాయకుల్ని ఉద్దేశించినది. రెండు రూపాయిలు లంచం తీసుకున్న ప్రభుత్వ నౌకర్లను శిక్షిస్తూ, వారిని పనిలోనుంచి తొలగించామనో, లేకపోతే ఖైదు చేశామనో కావలసినంత ప్రచారం ఇచ్చేస్తున్నారు. అలానే లంచం ఇచ్చేవాడికి కూడా శిక్ష వేస్తున్నారు. ఒక కాంగ్రెసు సభ్యుడు మరో పేద గుమస్తాకు లంచం యిచ్చి, ఆ గుమస్తా లంచం తీసుకున్నట్లు ఆరోపించిన సంఘటన ఒకటి నాకు తెలుసు. గుమస్తా కారాగారవాసానికి వెళ్ళాడు. 'శ్రీవారు' ప్రభుత్వానికి ఇవ్వవలసినదాన్ని ఎగవేసి హాయిగా వున్నారు!

ఒక మంత్రిగారి ఆస్తిపాస్తుల వివరాల్ని తెలుసుకోడానికి ప్రధానమంత్రిగారి కొక్కరికే తగును. సేవచేసేవారికి ఒకరకమైన 'క్రమ శిక్షణానిబంధనలు', మంత్రులకు మరో రకమైనవి ఉన్నాయి. కొందరు కాంగ్రెసు నాయకులకున్న తరగని మూలధనాలు దేశీయాంగమంత్రిత్వానికి, 'సెంట్రల్ ఇంటిలిజెన్స్ బ్యూరో'కు తప్ప తక్కిన అందరికీ తెలుసు! ఇటువంటి ద్వంద్వ పద్ధతులే కాంగ్రెసు విలువను తగ్గించేశాయి. కాంగ్రెసు మళ్ళీ అధికారం సంపాదించు కొంటుంది. కాని, నాయకులు గౌరవాన్ని పోగొట్టుకున్నారన్న విషయం మాత్రం నిజం. ఒకటి తమ కోసము, రెండవది తక్కిన ప్రజానీకానికి వెరసి మొత్తం రెండురకాలయిన నియమాలేర్పరచుకున్న రోమన్ చక్రవర్తులతో మన కాంగ్రెసు వారిని సరిపోల్చవచ్చు!

స్వాధికారంలేని భారతీయులకు మరో సర్వ జనీనమైన నియమం వుంది.

శ్రీమతి గాంధి, 'కాంగ్రెసు, లేకపోతే ప్రళయాన్!' అనే వినాదం అంత సహేతుకంగా లేదు. భారత దేశాధ్యక్షునికి ప్రధాన మంత్రిగావున్న శ్రీమతి ఇందిరాగాంధీగారే, మొన్న మొన్నటి రిపబ్లిక్ డే నాడు కాంగ్రెసు పరిపాలనలో మరో విధమైన కథన ఆకాశవాణిలో చెప్పారు. ఇప్పుడు భారతదేశం ఆమె అన్నట్లుగానే అనిశ్చిత పరిస్థితుల్లో ఇరుక్కున్నది. శ్రీమతి గాంధి మాటల్లో నమ్మకం కుదరాలంటే, తిరిగి కార్యాలయాన్ని అధిష్ఠించినప్పుడు ఆమె ఏమి చేస్తారో చెప్పడం సబబు!

కొద్ది వారాల క్రితం శ్రీ అతుల్యఘోష్ కూడా ప్రసంగించారు. కాంగ్రెసును వ్యతిరేకిస్తున్న ఒక మహారాణి మీద ఆయన దుమ్మెత్తి పోశారు. పాటియాలా మహారాణి కాంగ్రెసులో ఉన్నంతకాలం ఒక ప్రజాప్రభుత్వ వాది. ప్రతిపక్షంలో చేరినట్లయితే ఆమె భర్తకిచ్చిన అవకాశాల నన్నిటినీ పోగొట్టుకుంటుందిట! ఇది రాణిని సమర్థించడం కాదు. కాంగ్రెసే ఇటువంటి ఒప్పందాల్ని చేసుకుని వున్నది. ఎన్నికల మాసంలో ఈ విధమైన బెదిరింపులు ప్రభుత్వానికి తగునా? అదృష్టంకొద్దీ శ్రీయుత ఘోష్ మాన్‌సేటుంగ్ కాదు! ●

లోకం పోకడ

— పులారితండ్ (బీహార్) అనేచోట 'జన కాంతిదళ్' నాయకుడు శ్రీ కామాఖ్యా నారాయణ్ సింగ్ హెలికాప్టర్‌లో ఎన్నిక ప్రచారం చేస్తూ విమానం దిగటానికి వీలుకానందున, పైనుంచే ఉపన్యాసం ఇచ్చారు (నేలమీదవారికి వినిపించటానికి) ఒక పొడుగు గెడచివర మైక్రోఫోను తగిలించి కిటికీలోనుంచి లర బరువుని పెట్టిన ఆయన (ముఖంపద్ద)కి అందించారు (క్రిందివారు)

పి. టి. ఐ. వార్త. (3—2—67)

* * *

శ్రీ మొరార్జీదేశాయి, గుజరాత్ గుంపుల మధ్య సంబంధం ప్రత్యేకమయినది వారు ఆయన్ని గౌరవిస్తూనే ఆయన సభలలో అల్లరి చేస్తారు.

—'స్టేట్స్‌మెన్'లో నిహాల్‌సింగ్ (6—2—67)

* * *

—మన ప్రధానమంత్రి భాషా పరీక్ష ఒకదానిని 'పాస్' కావలసినరోజు వస్తుందంటే అది మనకిమంచిదికాదని నే ననుకుంటున్నాను

—శ్రీ కృష్ణమీనన్, యు. ఎన్. ఐ. ఇంటర్వ్యూలో (5—2—67)

* * *

పాటిల్‌చేసే పనులు అంత సంతృప్తికరంగా వుండడంలేదు గనుక జార్జ్ ఫెర్నాండెస్ అతన్ని ఓడిస్తాడు. బొంబాయిలోని ఇటీవలి రైలు ప్రమాదంలో నా సన్నిహిత మిత్రుడొకరు చనిపోయినందువల్ల పాటిల్ ఓడిపోవాలని నేను రోజూ దేవుడిని ప్రార్థిస్తున్నాను. పాటిల్ చేసిన పాపం పోవాలంటే అతను వెంటనే రాజీనామాయిచ్చి గంగాస్నానం చేయాలి. లేకపోతే నా ప్రార్థన వున్నది చూశారూ, అది తప్పకుండా పాటిల్ మీద పనిచేస్తుంది.

—'బ్లిట్జ్' (11—2 67 లో శ్రీ చంపాలాల్ లేఖ

* * *

శ్రీమతి ఇందిరాగాంధిమీద విసిరిన రాయి క్రమమైన ప్రజాస్వామ్యాన్ని పడగొడుతుందని మనమెప్పుడూ పొరబడరాదు.

—పేట్రియాట్ (10—2—67)

గోల్డ్ ఫింగర్-9



సందేహాలతోనే గోల్డ్‌ఫింగర్‌తో భోజనానికి కూర్చున్నాడు బాండ్. గోల్డ్‌ఫింగర్ కనిపెడుతూనే ఉన్నాడు.......

'సందేహిస్తున్నట్టున్నారు. అది వండిన రొయ్య. ప్రమాదమేం లేదు.'

'అహ్'

'దీన్ని తీసుకుంటారా. పీస్పోర్టర్ గోల్డ్ ట్రాఫ్ చెన్ '53. నేను తాగను—ప్రమాదకరమైన అలవాటు. పొగ తాగను—దురలవాటు.'

'ఆడ్‌జాబ్ నన్ను మెప్పించాడు. బ్రహ్మాండమైన ఈ విద్యల్ని అతనెక్కడ నేర్చాడు?'

'కరేట్‌ని గురించి మీ రెప్పుడూ వినలేదనుకుంటా మిస్టర్ బాండ్......?'



గోల్డ్‌ఫింగర్ దగ్గర్నుంచి ఏదైనా విషయం బయట పడొచ్చని బాండ్ ఎదురుచూస్తూనే ఉన్నాడు.


'ఆడ్‌జాబ్ కరేట్ నిపుణుడు. అతను మీ శరీరంలోని ఏడు స్థానాలలో దేనిమీదైనా దెబ్బకొట్టి మీ ప్రాణాలు తీయగలడు......'

'అతన్ని చంపడానికి అయిదు విధానాలు మాత్రం నాకు తెలుసు'......

'ఆడ్‌జాబ్ మంచి బాడీగార్డ్. రోజులో కొన్ని గంటలు అతను తన విద్యల్ని ప్రాక్టీస్ చేయటంతో గడుపుతాడు. అతని చేతులు, కాళ్ళు కొయ్యల్లా గట్టిపడ్డాయి........'

మానసికంగా జరుగుతున్న యుద్ధంలో బాండ్ లొంగిపోవడానికి యిష్టపడలేదు.

'టోపీ విసరడం అతనెప్పుడు ప్రాక్టీస్‌చేస్తాడు నే నే కనుక్కోలేదు........'



భోజన సమయంలో గోల్డ్‌ఫింగర్‌వద్దనుంచి ఏమీ రాబట్టలేకపోయాడు. నిరాశతో చివరిప్రయత్నం చేశాడు........

'నేను యిక్కడ్నుంచి కెనడా వెళ్ళవచ్చు. డబ్బు సంపాదించడానికి ఎక్కువ అవకాశం ఉందా?'

'మీకు డబ్బు సంపాదించాలనుందా?'

'అహా. మరి కష్టపడటం ఎందుకు?'

'అలాగైతే చిన్నసలహా మీ డబ్బుని రెండింతలు చేయడానికి మంచి మార్గం దాన్ని మడిచి జేబులో పెట్టుకోడమే!'

'మంచిది. మీ ఆతిథ్యానికి చాలా థాంక్స్. బహుశా మళ్ళీ కలుస్తామనుకుంటా........'

'అదేమీ విచిత్రమనుకోను మిస్టర్ బాండ్......'




బాండ్ ప్రయత్నం విఫలమైంది. గోల్డ్‌ఫింగర్‌తో కలవటం, అతనితో ఫోంచేయటం ప్రయోజన శూన్యమైంది......

'తర్వాత ఏమిటి? అచ్చా బొమ్మా వేస్తే మంచిది.......'

'బొమ్మయితే గోల్డ్‌ఫింగర్ నాతో పరిచయానికి వచ్చేంతవరకూ వేచి ఉంటాను. అచ్చయితే నేనే అతనికి దగ్గరగా వెళ్ళాల్సిఉంటుంది......'

'అచ్చు. మంచిది. అలాగే ఉండనివ్వాం. కానీ మళ్ళీ నేనెప్పుడతని దగ్గర కెళ్ళాలి. ఏదో సాకు ఉండాలిగా!'



బాండ్ తన చీఫ్‌తో మాట్లాడుతూ ఆరోజు గోల్డ్‌ఫింగర్ ఆడ్‌జాబ్‌తో సహా విమానంలో ఫ్రాన్స్ వెళ్తున్నాడని తెలుసుకున్నాడు.

'మీరు కస్టమ్స్‌తో ఏర్పాటుచేస్తే నేను అతని కార్లో 'హోమర్' ఉంచి వాడి అంతు కనుక్కుంటాను......'

ఆరోజు ఉదయం పదకొండు గంటలకు......

'కమాండర్ బాండ్! మీ వాడి కారు కస్టమ్స్‌లో ఉంది. రంగంలోకి దిగు......'

జేబులోనుంచి హోమర్‌ని బయటికి తీశాడు బాండ్........

'టూల్‌బాక్స్‌లో ఉన్న ట్రే కింద దీన్ని అమరుస్తాను. కారు విమానంలోకి వెళ్ళేంతర్వాత పరీక్షిస్తాను.'



విమానాశ్రయంలోఉన్న బార్‌లో ఏకాంతంగా నిలబడి గోల్డ్‌ఫింగర్ కారుని విమానంలో ఎక్కించడం గమనించాడు బాండ్.

'విమానం బయల్దేరేదాకా ఆగి ఆతర్వాత కారులోని హోమర్‌ని పరీక్షిస్తాను......'

'ఓ. కే.—రిసీవర్ స్విచ్ వేద్దాం. హూవూవూవూ...'

భలే. అతని దగ్గర్నుంచి వందమైళ్ళలోపు ఉంటే చాలు ఆ శబ్దం వినపడుతుంది. గోల్డ్‌ఫింగర్! చిక్కులోపడ్డావోయ్—మహా చెడ్డ చిక్కు!

(ఇంకా ఉంది)

ఎప్పుడూ అందంగా కనిపించాలి!

ముఖంమీద, శరీరంమీద ఉన్న మచ్చలకు చికిత్స :

'బ్లీచింగ్ క్రీమ్'ను ఎలా అప్లయ్ చేయాలో ఇదివరకు మనం తెలుసుకున్నాం. అదేవిధంగా మచ్చలున్న భాగానికి 'విటమిన్ స్కార్ క్రీమ్' లేదా 'విటమిన్ స్కార్ మాస్క్' వేసినట్లయితే కొంత వరకు పనిచేస్తుంది. మసూచికం మచ్చలకు మరో గట్టి ట్రీట్‌మెంట్ చేస్తేనేగాని పోదు. ఇలాంటి మచ్చలు పోడానికి రెండు మూడు పద్ధతులున్నాయి. 'శాండ్‌పేపర్ సర్జరీ' ద్వారా ఈ మచ్చలు పూర్తిగా పోతాయి. ప్రస్తుతం బొంబాయిలో ఈ చికిత్స చేస్తున్నారు. మా కేంద్రంలో కూడా ఈ మచ్చలకు ఒక తేలిక రకం చికిత్స చేస్తున్నాం. ఈమచ్చలు పూర్తిగా పోవాలంటే కనీసం ఆరునెలలైనా పడుతుంది. మచ్చలు మరీ లోతుగా లేకపోతే మాత్రం 'విటమిన్ స్కార్ క్రీమ్', 'విటమిన్ స్కార్ మాస్క్' పనిచేస్తాయి. రోజూ చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.



శ్రీమతి విద్యాకనకతంగం

మీరు సన్నబడాలంటే... (గృహ చికిత్స)

ఆరు వారాల దగ్గర్నుంచి పన్నెండు వారాలదాకా శ్రమపడితే సన్నబడడానికి అవకాశం వుంది. కృశింపు ఎక్కడ కావాలనుకుంటే అక్కడ 'విటమిన్ రెడ్యూసింగ్ క్రీమ్' రాసి గట్టిగా మర్దనా చేయండి. ఇలా రెండు మూడు నిమిషాలు చేయాలి. క్రీమును రాసుకున్న తర్వాత ఒక మైలన్నా నడవాలి. ఈ రకమైన వ్యాయామం చాలా మేలు చేస్తుంది. (సన్నబడడానికి ఏయే వ్యాయామాలు ఇంకా కావాలో ఇంతకుముందు తెలియపరచాను. వాటిని జాగ్రత్తగా అనుసరించండి.) మీరు స్నానం చేసేప్పుడు నీళ్లలో ఒక చెంచాడు 'రెడ్యూసింగ్ లోషన్' వేసి ఆ నీళ్ళతో స్నానం చేయండి. 'రెడ్యూసింగ్ లోషన్' రోజుకు మూడుసార్లు ఉపయోగించవచ్చు. 'రెడ్యూసింగ్ క్రీమ్' మాత్రం రోజుకు ఒకసారే రాయాలి. (ముందటి వ్యాసాల్లో యిచ్చిన ఆహారనియమాల్ని పాటించండి.) పంచదార తగ్గించడం మంచిది.

రొమ్ములకు చికిత్స :

రొమ్ములు వృద్ధి చెందడానికి సహజంగా కని పించడానికి ఒక చిట్కా వుంది. ఎ, డి విటమినులున్న 'విటమిన్ బస్ట్ క్రీమ్' ఇందుకు చాల ఉపయోగకారిగా వుంటుంది. ప్రతిరోజూ ఉదయాన్నే రొమ్ములకు

ఈ క్రీమును రాసి మెల్లిగా ఒక్కో వైపున ఒక నిమిషంసేపు మర్దనా చేయాలి. తర్వాత ఒక తువ్వాలు తీసుకుని దానిని వేన్నీళ్లలో ముంచి రొమ్ము లకు అద్దండి. తువ్వాలును మళ్లీ చన్నీళ్లలో ముంచి తుడవండి. కొద్ది రోజుల్లోనే మంచి ఫలితం కని పిస్తుంది.

వ్యాయామం: భుజానికి సమాంతరంగా వచ్చేలా మోచే తుల్ని ఎత్తి, మళ్ళీ నమస్కారం చేస్తున్నట్టుగా చేతులు జోడించి గట్టిగా నొక్కండి. ఒకో నిమిషం వూరుకుని మళ్ళీ మళ్ళీ ఇలా చేసి చూడండి. ఆ తరు వాత క్రీమును తీసేసి స్నానం చేసేయవచ్చు. రోజూ కనీసం రెండు కప్పుల పాలైనా తాగాలి. ●



అవీ - ఇవీ...

మద్రాసులో 'నెఫ్కా' నాటక కళాపరిషత్తు

నెల్లూరు ఫిలిం క్రిటిక్స్ అకాడమీ (నెఫ్కా) ఆధ్వర్యంలో, మద్రాసు శ్రీకృష్ణగానసభ హాలులో జనవరి 24 నుండి 30 వరకు 'నాటకకళా పరిషత్తు' పేరుతో భారీఎత్తున నాటక, నాటిక, ఏకపాత్రాభినయ ప్రదర్శనాలు జరిగాయి. ఈపోటీలకు పద్మశ్రీ నాగయ్య అధ్యక్షత వహించగా శ్రీమతి అంజలీదేవి ప్రారంభోత్సవం చేశారు. పలువురు ప్రముఖులు ప్రసంగించారు.

వారంరోజులపాటు ఏకబిగిగా ఏర్పరచినకార్యక్రమముతో, 'నాటకకళా పరిషత్తు' మద్రాసులోని తెలుగు జనాన్ని సందడితో ముంచెత్తింది. ప్రదర్శనల్లో పాల్గొన్నవారు చాలమంది ఆంధ్రప్రాంతాలకు చెందినవారు. కొందరు ప్రాంతీయులు. ఖరగ్‌పూర్ నుంచి కూడా రెండుజట్లు పాల్గొన్నాయి. వారం రోజులు కార్యక్రమాలు పూర్తయినతరువాత ఆంధ్రరంగస్థల సంస్కృతి అంతరించి పోతోందా? సంస్కారాన్ని సంతరించుకొంటూ విలర్దొక్కుకుంటున్నదా? అనే ప్రశ్నలు ఉదయించాయి. వీటికి నాలుగు వక్తలు నావినాది పరిశీలనల మేరకు వివిధ రీతులుగా పెలవిచ్చారు. 'ప్రదర్శకులు—ప్రేక్షకులు' వీరి పరస్పర సంబంధము, అవినాభావసామరస్యాలు గురించి కూడా కొందరు ఉపన్యసించారు. ఇవన్నీ నాటక కళోద్ధరణకు కావలసిన అలంకారాలుగానే తోచాయి! ముందుముందు సరిదిద్దుకోడానికి చక్కని శిక్షణ.

ప్రదర్శనల్లో కొన్ని ఉత్తమంగానే వున్నాయి. అందులో అగ్రస్థానం వహించేది 'తస్మాత్ జాగ్రత్త' అనేనాటకం. లోపరహితంగా నడిచి చక్కనిస్థాయి నిలుపుకున్న నాటకం ఇది. పోటీకివచ్చే నాటకాలు పోటీ వాటికి తీసిపోకుండానే వుంటాయి. అంచేత ప్రతి ప్రదర్శనాఏదో ఒక కోణంనుంచి బాగానేవుంది. కథా వస్తువులో భేదంలేనివికొన్ని వున్నాయి గాని ప్రదర్శనలో ఆ లోపాలను కప్పిపుచ్చడానికి ప్రయత్నాలు జరిగాయి.

ఉత్తమ ప్రదర్శనాన్ని ఎన్నుకోవడంలో న్యాయ నిర్ణేతలు నిష్పాక్షికంగా, ప్రేక్షకుల అభిప్రాయానికి అనుగుణ్యంగానే వ్యవహరించారు. ప్రదర్శనలోని కొన్ని కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులతోపాటు అందర్నీ కదిలించేవిగా వుంటాయి. ఆసన్నివేశ ప్రభావం నాటకాలమీద పనిచేయడానికి అవకాశం వుంటుంది గనుక 'సన్నివేశం' కోసం మరో బహుమతిని ప్రవేశపెట్టి వుండినట్లయితే ఎక్కువమంది ప్రదర్శకుల్లో కలిగిన నిరుత్సాహం పోయివుండేది!

వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సుమారు రెండు వందల కళాకారులకౌశల్యాన్ని తిలకించడానికి మద్రాసు ఆంధ్రులకు అవకాశం కల్గించిన 'నెఫ్కా' కృషి అభినందించదగినది. పురప్రముఖులతో పాటు చలనచిత్ర పరిశ్రమకుచెందిన ముఖ్యులు అనేకులు ఈ ప్రదర్శనాల్ని సాంతంగా తిలకించారు.

చివరిరోజు శ్రీమతి సావిత్రిగణేశన్ అధ్యక్షత వహించారు. శ్రీమతి అంజలీదేవి బహుమతి ప్రదానం చేశారు.

బహుమతుల వివరాలు (నాటకాలు)

ఉత్తమ ప్రదర్శన: నటనాలయం (గురుజాడ కళాసమితి, విజయవాడ). ద్వి. ఉత్తమ ప్రదర్శన: **తస్మాత్ జాగ్రత్త! (ఆదర్శసమితి, మద్రాసు.) ఉత్తమనటుడు:** శ్రీ శివరామరెడ్డి (నటనాలయం), ద్వి. నటుడు: శ్రీ భాస్కరరావు (మాటతప్పకు); ఉత్తమనటి: శ్రీమతి కనకదుర్గ (ఆరాత్రి) ద్వి. నటి: శ్రీమతి జి. సావిత్రి (పదవులు— పెదవులు). ఉత్తమ హాస్యనటుడు: శ్రీ తారాకృష్ణ (తస్మాత్ జాగ్రత్త) ఉత్తమవిలన్: శ్రీ రాళ్ళభండికామేశ్వరరావు (నేనున్నాను) ఉత్తమదర్శకత్వం: శ్రీ రాప్రసీ (మరోమొహెంజోదారో). ఉత్తమరచన: శ్రీ యన్. ఆర్. నంది (మరోమొహెంజోదారో) కన్సొలేషన్ బహుమతులు: మాస్టర్ సంజీవి (నటనాలయం) శ్రీ మురళి (దేవాలయం) శ్రీ కె. భాస్కర్ (విభ్రాంతి) శ్రీ కె. రంగారావు (ఛైర్మన్) రచయిత ఆర్. వి. పలం (మాట తప్పకు)

నాటికలు: ఉత్తమనాటిక: నటన (యువజన ఆర్ట్ థియేటర్స్, పెదరావూరు), ద్వితీయ నాటిక: పరిష్కృతి (శ్రీవెంకటేశ్వర ఆర్ట్ థియేటర్స్, గుంటూరు), ఉత్తమనటుడు: శ్రీ బి, వెంకటేశ్వరరావు (పరిష్కృతి), ద్వి. నటుడు: శ్రీ కె. ప్రసాద్ (నటన) ఉత్తమనటి: శ్రీమతి చంద్రకళ (రిక్రియేషన్ క్లబ్) ఉ. హాస్యనటుడు: శ్రీ కె. మల్లారెడ్డి (ఉలిపికట్టె) ఉ. విలన్: శ్రీ కె. ప్రభాకర్ (ఉలిపికట్టె) ఉత్తమ దర్శకుడు: శ్రీ బయ్యానరపు (పరిష్కృతి), ఉత్తమరచన: శ్రీ కన్నెగంటుల మల్లిఖార్జునరావు (పరిష్కృతి) ఉ. సహాయనటి: శ్రీమతి యన్. విజయలక్ష్మి (పుష్యప్పూరి) కన్సొలేషన్ బహుమతులు: మిణుగురు పురుగులు (నాటిక), రచయిత: పోలా ప్రగడ గోపాలకృష్ణ (ఇదం—అహం) శ్రీ ప్రకాశరాయులు (చీకటితెరలు) శ్రీ యస్. ప్రభాకర్ (వాం టెడ్ ఫాదర్స్),

ఏకపాత్రాభినయాలు: శ్రీ వై. ఏకాంబరం (నెల్లూరు), శ్రీ కె. యస్. ప్రసాద్ (ఖరగ్‌పూర్) శ్రీ సి. హెచ్. యస్. పి. వి. రంగారావు (మచిలీపట్నం), శ్రీ కె. నాదమునిరాజు (కాళహస్తి) ప్రత్యేక బహుమతి: బేబీ విజయ (కడప)

'నేనున్నాను' నాటకంలో విలన్ బహుమతిపొందిన శ్రీ రాళ్ళభండి కామేశ్వరరావు 'ఒథెల్లో' ఏకపాత్రాభినయం ప్రేక్షకుల విశేష ప్రశంసల్ని పొందింది. జైహింద్ సత్యం నిర్వహించిన 'మల్లయుద్ధం' ఈ ప్రదర్శనల్లో మరో ఆకర్షణ.

కృష్ణాజిల్లా రచయితల మహాసభ ప్రత్యేక సంచిక

శ్రీయుతులు నండూరి రామమోహనరావు, కవిరాజ రామచంద్రమూర్తి సంపాదకత్వంలో వెలువడిన నై సంచిక మాకార్యాలయం చేరింది. ఇందులో ప్రముఖుల సందేశాలు, కొన్నిచక్కని రచనలువున్నాయి. పే జీ ల దం డు గ 'మెటమార్ఫొసిస్' తోపాటు, మంచి 'తెలుగు(మంచీ, చెడుల)కథ' నేటిరచనల్లో తీరుతెన్నుల్ని విశదం చేశాయి. శ్రీ బాపు ముఖచిత్రం ఒకనిండైన ఆకర్షణ! 'నవ్యసాహితీ సమితి విజయవాడ శాఖ సభ్యులు కంటున్న కలలో ఒకదానికి అనువాదమే ఈమహాసభ' అని ముందు మాటలోవుంది. ముందు ముందు మరింత ఉత్సాహంతో సదస్సులను ఏర్పాటు చేస్తారని ఆశిద్దాం!

—శికరాజా.



కృష్ణాజిల్లా సంగీత, నాటకపోటీల సదస్సులో విజేతలకు బహుమతులు పంచుతున్న శ్రీమతి కాథిరిన్ జయకర్ జాన్సను (కలెక్టరు సతీమణి) జిల్లా పౌరసంబంధాధికారి శ్రీ యన్. దొరస్వామిరెడ్డి, బహుమతి పందుకుంటున్న బాలికను ఈ చిత్రంలో చూడవచ్చు. ఫోటో: సిడుగు రామలింగయ్య.

తొలి యౌవనదశలో పెళ్ళిళ్ళు

చక్కని సాంఘిక వాతావరణం శారీరకమైన పరిపక్వానికి తోడ్పడుతూ బ్రిటన్‌లో సమస్యల్ని సృష్టిస్తున్నదట!

బ్రిటన్‌లో ఈ సంవత్సరం సుమారుగా 40,000 పెళ్ళిళ్ళు జరిగాయి. ఈ పెళ్ళిళ్ళన్నిటిలోనూ వధూవరుల వయస్సు 20 సంవత్సరాలలోపు. ఈ సంఖ్య పదిహేనేళ్లలో నాలుగురెట్లు అధికమయింది. ఎందుకు? తొలి యౌవనదశలో పెళ్ళిళ్ళు ఇంతగా పెరిగిపోవడానికి కారణం ఏమిటి?

ఆంగ్లేయ శాస్త్ర ప్రకారం, తలిదండ్రుల అనుమతి లభిస్తే పదహారేళ్ళు వచ్చిన అబ్బాయిలూ, అమ్మాయిలూ పెళ్ళి చేసుకోవచ్చు. బ్రిటన్‌తోను ఇతర పాశ్చాత్యదేశాల్లోను పెళ్ళి చేసుకోడానికి పదహారు సంవత్సరాల వయస్సు మరీ చిన్నది అంటున్నారు కాని బ్రిటన్‌లోని పత్రికల్లో వెలువడే వార్తలు ఇలా వుంటున్నాయి:

“వార్నెస్, జాన్ యిద్దరూ నాలుగు సంవత్సరాల క్రితం స్కూల్లో ఆటస్థలంలో కలుసుకున్నారు. తర్వాత యిద్దరూ అనేకసార్లు చూసుకోవడం అయింది — ఇప్పుడు యిద్దరికీ పదహారు సంవత్సరాలు. పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నారు ....”

బ్రిటన్‌లోని యువతీ యువకులు చాల తొందరగా వివాహం చేసుకుంటున్నారు. 1967 వ సంవత్సరంలో వధూవరులకు 20 ఏళ్ళ లోపు పెళ్ళిళ్ళు సుమారు 40,000. 1952 నాటి సంఖ్యతో పోల్చిచూస్తే ఈ సంఖ్య నాలుగు రెట్లు పెరిగిపోయింది. బ్రిటన్‌లోని చట్టప్రకారం సగం వరకు 21 సంవత్సరాలు వస్తే (21 సంవత్సరాలు నిండిన వయస్సు న్యాయసమ్మతమైన పరిపక్వ దశ.) 1939 కంటె రెండు రెట్లు పెరిగింది [illegible]

తొలి యవ్వనదశలోనే ఇన్ని పెళ్ళిళ్ళు జరగడానికి హేతువు ఏమిటి? ఈ దశలోనే తొందరగా దంపతులవడం ఇందుకు ముఖ్య కారణంగా చెప్పబడుతూ వుంది. చక్కని ఆరోగ్యవంతమైన ఆహారం సులభమైన నివాసయోగ్యమైన పరిస్థితులు, ప్రశాంతమైన జీవితం, విచ్చలవిడిగా స్త్రీ పురుష సంబంధమైన పరస్పర కలయిక — యుద్ధానంతరం బ్రిటన్ ప్రజల యౌవన దశకు తెచ్చిన మార్పులు ఇవి. యుద్ధానికి ముందు, లేదా పదిహేనేళ్ళ ముందటి కంటె ఇప్పుడు సాంఘిక వాతావరణంలోను, కామంలోను అభివృద్ధి కనిపిస్తూ వుంది. పిల్లలు పొడవుగాను, బలిష్ఠంగాను అనేకరకాలుగా అభివృద్ధి చెందారు.

యుద్ధానికి ముందున్న 17 ఏళ్ళ బాలిక ఇప్పటి పద్నాలుగేళ్ళ బాలికకు సరి. 17 ఏళ్ళ వయసొచ్చిన ఆడపిల్లలు రెండు మూడేళ్ళ మగపిల్లలతో స్నేహమేర్పరచుకున్నట్లయితే వారు పెళ్ళికి సిద్ధమవుతారు. శారీరకంగాను, మానసికంగాను (కాని, జ్ఞానం శూన్యమే!) వారు ఇరవయి ఏళ్ళ యువతులకు సమానం. అందుచేత చాల మంది అమ్మాయిలు స్కూలు విడిచిపెట్టగానే పెళ్ళిళ్ళు చేసేసుకుంటారు. లేకపోతే ఏదైనా ఉద్యోగంలో ప్రవేశించిన వెనువెంటనే పెళ్లి చేసుకుంటారు.

ఇంద్ర ధనుస్సులాంటి పెళ్లి కావాలి!

మరికొన్ని ప్రేరణలు పెళ్లికి ప్రోత్సహిస్తూ వుంటాయి. ‘పాప్’ మ్యూసిక్ చాలా ప్రసిద్ధికెక్కినది. అందులో ఇతివృత్తమంతా ప్రేమ, కౌగిళ్ల గురించే వుంటుంది. ప్రకటనలూ అదేవిధంగా వుంటాయి. సుఖసంతోషాల కోసం భర్తల్ని ఎలా ఆకర్షించుకోవాలో, ఇంటిని ఎలా సర్దుకునేందుకు డబ్బును ఎలా కూడబెట్టాలో, యిలాంటివన్నీ ఎంతో ఆసక్తిజనకంగా చూపించి ఇటువంటి సుఖాలమీద ఆడవాళ్ళు మోజుపడేలా చేస్తూ వుంటారు. ఇక స్త్రీలకు సంబంధించిన రచనలూ అలానే వుంటాయి. ఎంతసేపూ పెళ్ళిని గురించి, సంసారాన్ని చక్కదిద్దుకోవడాన్ని గురించి రాస్తుంటారు. ఇలా ఇవి ప్రేరణకు కారణాలవుతున్నాయి. ఇటువంటి కోరికలతో ఉవ్విళ్ళూరే తొలి యౌవన దశలో వున్నవారికి అర్థమయ్యేదేమిటంటే పెళ్ళి చేసుకున్న తర్వాత కొంత స్వతంత్రం వుంటుంది అని. కొన్ని పరిస్థితుల్లో ఇటువంటి అవగాహనకు లోనైన పిల్లలు తల్లిదండ్రుల్ని ఎదిరించడం కూడా పరిపాటి.


పెళ్ళి చేసుకున్న తర్వాత సర్వ స్వాతంత్ర్యం వస్తుంది, వ్యక్తిత్వం బలపడుతుందని, ఆడపిల్లలకు కూడా తమబోటి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించాలని పెళ్ళికొడుకులు అనుకొంటూ వుంటారు. కాని, అసలు అమ్మాయిలే ఎక్కువగా పెళ్ళికి తొందరపడుతూ వుంటారు.

బర్మింగ్‌హామ్ స్కూల్లో 14 ఏళ్ళ పిల్లల్ని తీసుకుని పరిశీలన చేశారు. ఆ పరిశీలనలో 16 వ సంవత్సరం పెళ్ళికి యుక్తవయస్సు అని తేలింది. పెళ్ళికూతురుతోవున్న చెలులు ఇంద్రధనుస్సులాంటి రంగురంగుల ఉడుపుల్ని ధరించాలని నాకు కోరికగా వుందని ఒక అమ్మాయి చెప్పింది!

తొలి యౌవనదశలో వధూవరులవడం ఒక సమస్యగా పరిణమించింది. ఒక లండన్ మేజిస్ట్రేటు ఇలా అన్నారు:

“40 శాతం యువతులు వారి వారి తలిదండ్రులని ధిక్కరించి పెళ్ళి చేసుకుంటున్నారు. అందుకు కారణం వారు గర్భాన్ని ధరించి వుండడంగా చెబుతున్నారు. తలిదండ్రులతో చాలమంది [illegible] రకాలు. పనిపాటు లేకుండా హాయిగా కూర్చొని భర్త తెచ్చిన ఆదాయంమీద కులుకుతూ వుంటారు.”

ఒక లండన్ ప్రొబేషన్ ఆఫీసరు ఇలా వ్యాఖ్యానించారు:



తొలి యౌవనదశలో పెళ్ళిళ్లు

"తొలి యౌవనదశలో పెళ్లి చేసుకునే వధూవరులు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారు. ఆడపిల్లలు తమ కాళ్లమీద నిలబడదామనుకోవడం లేదు. అలా వుండేందుకు ప్రయత్నమూ చేయడం లేదు. వారు కోరుకునేది ఒక్కటే ఒక్కటి. తల్లిదండ్రులు విడచిపెట్టిన ఆస్తిని అనుభవిస్తున్న వాడు ఎవరైనా వుంటారా, అతనికి గాలం వేద్దామని చూస్తూ వుంటారు."

తొలి యౌవనదశలో తల్లులు

మీరు చెప్పే విషయాలు బహుశా అంత సమంజసంగా వుండకపోవచ్చు. యవ్వనం తొలిలోనే తల్లులైనవారు ఏమంటున్నారు? మాంచెస్టర్‌లో 17 ఏళ్ల తల్లి ఒక పాపాయితో వుంది. ఆమె భర్త 19 ఏళ్ల వయస్సువాడు. ఆమె ఇలా చెప్పింది: "నువ్వు విస్మరించిన విషయాల్ని ప్రజలు సుబోధకం చేస్తూ వుంటారు. ప్రపంచంలో నువ్వు ఒక పెద్ద తెలివి తక్కువ దద్దమ్మలా ప్రశ్నిస్తుంటారు. ఇది విచారకరమైన విషయం. ఇలా చెప్పేవాళ్లు తప్పు దారిలో నడుస్తున్నారని నాకు తెలుసు. నువ్వు చిన్న వయసులో వున్నావు గనక పెళ్లయి భర్తతో హాయిగా కాపురం చేసుకుంటున్నా నువ్వేదో మహా తప్పు చేసేస్తున్నట్టు భావిస్తూ వుంటారు. ఇది సరికాదు"

ఈ సందర్భంలో లండన్‌లోని ఇద్దరు పిల్లల తల్లి యదార్థంగా ఒక విషయాన్ని వెల్లడించింది. ఆమె తన 16 వ ఏట పెళ్లిని తలచుకుని అన్న మాటలివి: "అదంతా ఒక సాహసం. మొదటి పాపాయి కలిగే వరకూ సాహసంగానే కనిపించింది. నేను తొందరపడినదానికి ఫలితం ఇది. నేను చాలా భయపడ్డాను. పద్దెనిమిదేళ్లు నిండేసరికే నా జీవితం అయిపోయిందనే భావన ఏర్పడింది. పెళ్లి జానపద కథ లాంటిది కాదు"

లివర్‌పూల్‌లో నివసిస్తున్న లిలియన్‌కు ఇప్పుడు ఇరవై సంవత్సరాలు. ఆమెకు 17 వ ఏట పెళ్లయింది ఒక పాపాయి వుంది. ఆమె చెప్పిన మాటలివి: "కొంత డబ్బును కూడబెట్టుకోకుండా పెళ్లి చేసుకుంటే తప్పకుండా అది ఒక దెబ్బే అవుతుంది. ఎటువంటి సమస్యలూ లేకుండా ఉల్లాసంగా రాత్రిళ్లు విహరించే వారిని చూసినప్పుడు మనస్సుకు కష్టం కలుగుతుంది. అలా అనుకుంటే మరి ఈ వయసులో నాకు బిడ్డ వుండేది కాదు. మొదట్లోనే నాకు కుటుంబం కావాలనుకున్నాను. సంసారం చేయాలనుకున్నాను. పిల్లల సంరక్షణకన్నా ఇతరమైన భాగ్యమేముంటుంది?"

తొలి యవ్వనదశలోని భార్యాభర్తలు, విడిగా వున్నప్పుడు ఎలా సంపాదించేవాం తలచుకుని బాధపడుతూ వుంటారు. అప్పట్లో ఎలా మునిగి పోగలిగామా అని ఆశ్చర్యపడుతూ వుంటారు.

క్లిష్ట పరిస్థితి

లండన్‌లో ఒక పాత ఇంటిలో నివసిస్తున్న పీటర్, మేరీల దాంపత్యం ఉదాహరణగా తీసుకుంటే ఇటువంటి పెళ్లిళ్లవలన ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఏర్పడవుతున్నాయో గ్రాహ్యమవుతుంది. దంపతులిద్దరూ వేర్వేరు గదుల్లో వుంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. మేరీకి 16 ఏళ్ల వయస్సప్పుడు పెళ్లయింది. 20 ఏళ్లు నిండుతున్న భర్త ఇలా అన్నాడు: "మేము చాలా చిన్న వయసులో పెళ్లి చేసుకున్నాం. ఇలాంటి తప్పుని చేయవద్దని అందరికీ చెబుతున్నాను. మా పెళ్లినాటి రాత్రినుంచి ఇప్పటి వరకు ఎప్పుడూ మేము షికారుకు వెళ్లి వుండలేదు. ఏడు నెలల క్రితం కాబోలు ఆఖరిసారిగా ఒంటరిగా నేను సినిమాకు వెళ్లాను. మా పిల్లల్ని చూస్తుంటే ఆనందంగా వుంటుందనుకోండి నిజంగా వాళ్లను చూసుకుని గర్విస్తుంటాము. భవిష్యత్తులో మంచి అవకాశం రావచ్చునని, చక్కని సాంసారిక జీవితాన్ని గడువుతామని, కొంత వెనకేసుకుని ఎటువంటి సమస్యలూ లేని జీవితం గడుపుతామని ఆశిస్తూ వుంటాము."

వయసొచ్చిన తర్వాత పెళ్లి చేసుకున్నవాళ్లకంటే తొలి యవ్వనదశలో పెళ్లి చేసుకున్న వాళ్లకు వుండే అవకాశాలు తక్కువ. అనురాగమే ముఖ్యం కాదు. డబ్బు లేకపోవడం, సంసారాన్ని సరిగా చక్కదిద్దుకోలేకపోవడం, కుటుంబంలోని భేదాభిప్రాయాలు, చుట్టాలు పక్కాలు కలగజేసుకోవడం, పరస్పర విరుద్ధభావాలు అంత శ్రేయస్కరంగా వుండవు. ఒక్కోసారి దారుణంగా ప్రవర్తించేందుకు అవకాశం వుంది. తత్ఫలితంగా పెళ్లిళ్లలో అంతరాయం కలుగుతుంది. పెళ్లయిన వాళ్లు విడిపోవడం తటస్థిస్తుంది.

అక్రమ సంబంధమైన జన్మాలసంఖ్య ఇప్పుడు సంవత్సరానికి దాదాపు 70,000 ల దాకా వుంది. ఇదీ 20 ఏళ్లలోపు బాలికలకే. ఈ కారణాలచేత తొలి యౌవన దశలోని బ్రిటన్ బాలికలు 27 శాతంవరకు తప్పనిసరిగా వివాహం చేసుకోవలసి వస్తోంది. ఇరవై ఏళ్లు వచ్చిన తర్వాత పెళ్లి చేసుకునేవారు 15 శాతం మాత్రమే.

25 ఏళ్లున్న యువతి సాధారణంగా ఒకసారి విడాకు తిస్తుంది. అలాంటిది తొలిదశలోని పెళ్లిళ్ల ఫలితంగా ఇరవై ఏళ్లు వచ్చేసరికే ముగ్గుర్ని మారుస్తుంది! అయినప్పటికి, 60,000 విడాకులు మాత్రమే 1967 సంవత్సరాంతానికి లెక్కతేలాయి. తొలియవ్వనదశలో జరిగే వివాహాల సంఖ్యలో విడాకులివ్వడం మూడుశాతం మాత్రమే.

తొలియవ్వన దశలోని భార్యాభర్తలు ఎన్నో కష్టనష్టాల్ని ఎదుర్కోవాలి. లోకజ్ఞానం లేకపోవడం, మానసికంగా పరిపక్వదశ అందుకోలేకపోవడం ఇందుకు కారణాలు. ఇరవై ఏళ్లు నిండిన తర్వాత దంపతులైన వారికి ఈ సమస్య వుండదు. యవ్వనారంభం పెళ్లిళ్లు అంత శ్రేయోదాయకం కావని గోల పెడుతూనే వున్నారు. అయినా తప్పడంలేదు అనుభవం సంపాదించుకోవాలంటే పెళ్లిచేసుకోవాలనే యువతీయువకులు దూరదృష్టితో భవిష్యత్తు నాలోచించలేక పోతున్నారు.

'మ్యారేజి గైడెన్స్ కవున్సిల్' అనే వివాహ సలహా సంఘం ఒకటి బ్రిటన్‌లోవుంది. "వయస్సు కంటే వ్యక్తిగత లక్షణాలు, ఆదర్శాలు, ఆశయాలు ముందు పెరుగుతున్నాయి!"— అని వారన్నారు.

—ఫోరమ్ వరల్డుఫీచర్స్.



సీరియల్

జాహ్నవీ ప్రేమములు

సి. ఆనందారామం

2

హైమ అత్తగారు ఈ విషయం విని భగ్గుమంది. "ఏంటమ్మా! ఇంత జరిగిందా?" అంది హైమతో. హైమ తలవంచుకుంది.

"ఎవళ్ళ కర్మ వాళ్ళది. ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు."

"ఎలా కుదురుతుంది?"

"ఎందుకు కుదరదు? ఏం? మా చెల్లెలు అంత మరీ జ్ఞానంలేని పసిపిల్లా? ఏం ఆలోచించుకుని ఇంతకు తెగించారేమె? మా బంధువులంతా వచ్చి. ఉమాపతి నాయనను అడిగారట కదా! ఆయనిష్టం. ఆయన మొగ మహారాజా. ఆడదానికి బుద్ధుండాలి! అనుభవించుమనండి?"

"పరిస్థితి ఇంత శృతి మించాక ఎలాగండీ!"

"అందుకు మీరేంచేస్తారు? నా మా పక్షాన ఉంది. ఒకనాడు భర్త కొంత పరాకు చూపితే సహించలేక! మొత్తం జీవితాన్ని పంచి ఇవ్వటం కూటతా? అట్లాంటి పిచ్చి పని చెయ్యబోకండి."

"ఇంతవరకూ జరిగింది న్యాయసమ్మతమూ, జరగబోయేది న్యాయసమ్మతం కానిదినా? ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలను చేసుకోవటం నీతికి విరుద్ధం. నేను వివాహానికి ఒప్పుకోకపోవటం మానవ ధర్మానికి విరుద్ధం. ఈ రెంటికీ సంఘర్షణ వచ్చి నప్పుడు ఏది గెలుస్తుంది?"

"మీరేటేటో పెద్దమాటలు మాట్లాడుతారు. ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు."

"కానీ, జరగక తప్పదు."

వృద్ధ జమీందారిణి విస్తుపోయి చూసింది. ఎంత చిన్న విషయంలోనైనా తన మాటకు ఎదురు చెప్పని కోడలేనా, ఇట్లా మాట్లాడుతూంది?

"ఏంటే? బతికినంత కాలమూ రొమ్ము మీద కుంపటిని రాజబెట్టుకుంటారా, మీరే!"

హైమకు గిర్రున కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వృద్ధ జమీందారిణి విసుగ్గా వెళ్ళిపోయింది. ఆవిడకు జాహ్నవి తన కోడలుగా రావటం ఇష్టంలేదు.

"రొమ్ము మీద కుంపటి..." ఇదే తిరిగి తిరిగి మండెలో ప్రతిధ్వనిస్తుంది.

పరాయి వ్యభిచారులైన మొగవాళ్ళున్నారు. కానీ వాళ్ళంతా మామూలుగా సంసారాలు చేసుకుంటు న్నారు.

పరమ విలాసిని మూర్ఖురాలైన ఆడవాళ్ళున్నారు. అయినా వాళ్ళూ లక్షణంగా పెళ్ళిళ్ళు చేసుకుంటు న్నారు.

తన భర్త వ్యభిచారి కాడు. తన చెల్లెలు విలాసిని కాదు. కానీ, తన బ్రతుకిలా భగ్గుమంది.. ఎక్కడ జరిగింది పొరపాటు? ఏ నిర్వచనాలకూ అందని, ఏ గిరులలోనూ ఇమడని, ఎవరికీ అర్థంకాని ఈ 'మనసు' అనే పదార్థం యొక్క వైచిత్రేనా ఇదంతా?

పెళ్ళయి పదేళ్ళయింది.

తనకు సంతానం లేదు.

జాహ్నవి వచ్చి ఏడాది నిండలేదు ప్రకృతి అప్పుడే తన ప్రతాపాన్ని చూపి పకపక నవ్వుతోంది.

హైమ నెమ్మదిగా భర్త గదిలోకి వెళ్ళింది. చటుక్కున ముఖం మరోవైపుకు తిప్పుకున్నాడు ఉమాపతి.

హైమ మనసు చివుక్కుమంది దగ్గరగా వచ్చింది.

"చూడండి మీరు జాహ్నవిని చేసుకోండి. నేనే స్వయంగా అంగీకరిస్తున్నాను. ఇంక ఆ ప్రసక్తి ఏమీ లేదు."

ఉమాపతి పసిపిల్లాడిలా ఏడవసాగాడు. హైమ అతని ప్రక్కన కూర్చొని శిరస్సు నిమిరింది. "బాధ పడకండి మీ సంతోషానికి నేను అడ్డురాను." ఉమా పతి దిగ్గున తలెత్తాడు.

"సంతోషమా? ఎవరికి?"

హైమ నీరసంగా నవ్వింది.

"ఇంకెవరి సంతోషం నాకు కావాలి?"

"కానీ, నాకిది సంతోషం కాదు."

"సంతోషం కానప్పుడింత ఎలా జరిగింది?"

"నేను జాహ్నవిని ప్రేమించాను."

వాడి బాకులా గుండెల్లో గుచ్చుకుందామాట హైమకు. క్రింది పెదవి పంటితో నొక్కుకుంటూ కూర్చుంది.

"కానీ, నా భార్యవు నువ్వు."

హైమ భర్త ముఖంలోకి పరిశీలనగా చూసింది. ఏదో అర్థంకాని దాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయ త్నిస్తున్నట్లుగా ఉంది ముఖం.

"నాకు సినిమాలలో లాగ ప్రేమించాలని ఉం టుంది. చిన్నతో ఎలా ప్రేమించను? ఏ సినిమా లోనూ భార్యలను ప్రేమించరు. ప్రేమించి పెళ్ళి చేసుకుంటారు. అందుకనే జాహ్నవిని ప్రేమించాను కానీ, ఇప్పుడు తెలుస్తోంది ప్రేమించినా, అలా చెయ్యటం తప్పని. పోనీ నువ్వెందుకు చెప్పలేదు నాకు?"

దిగ్భ్రాంతితో మతిపోయింది హైమకు. మంచి చెడ్డలను చక్కగా నిర్ణయించి సూత్రించిన ధర్మ వేత్తల ఎదుట ఈ వ్యక్తిని నిలబెట్టి ధర్మాన్ని గురించి ప్రశ్నించాలనిపించింది.

"అవును. చెప్పలేకపోయాను. ఊహలోనయినా, నిన్నుకాక్ని మరొకలా భావించలేకపోయాను. ఆ దోషా నికే శిక్షను భరించడానికి సిద్ధంగా ఉన్నాను."

"శిక్ష నీకు కాదు హైమా? నన్ను కాపాడు. నా మనసు ఉడికిపోతుంది. నేను తట్టుకో లేకుండా ఉన్నాను." హైమ వళ్ళో తలపెట్టుకుని హైమను గట్టిగా కౌగిలించుకుని దీనంగా ఏడ్చేసాడు ఉమాపతి.

జాలితో ఆవేదనతో ప్రేమతో హైమ మనసు కరిగి కళ్ళలోంచి ప్రవహిస్తుంది.

లాలనగా శిరస్సునిమురుతూ "ఆందోళన పడకండి. ధైర్యంగా పరిస్థితుల నెదుర్కోండి. ఇప్పుడిప్పుడు నశించింది కానీ పూర్వంలో ఇద్దరు ముగ్గురు భార్య లుండటం సామాన్య విషయమేగా!" అంది.

"కానీ, నాకు ఇద్దరు భార్య లక్కర్లేదు. నువ్వు తప్ప మరొకరు నాకు భార్య కాలేరు."

హైమ దీర్ఘంగా నిట్టూర్చింది.

"పరిస్థితి చెయ్యి దాటిపోయింది. ఇప్పుడిక కర్తవ్యం మాత్రమే ముందుంది. ఆలోచనలకు అవకాశమే లేదు. పెళ్ళి ఏర్పాట్లు చేసేస్తున్నాను."

హైమ లేచి వెళ్ళిపోయింది.

ఆ మరునాటికే పెళ్ళుమంటూ జ్వరం ముంచు కొచ్చింది ఉమాపతికి.

హైమకు మతిపోయింది. ఆర్తితో భర్త నంటా న్నతుక్కుపోయింది.

"నన్ను క్షమించు హైమా! నీకు తీరని అన్యాయం చేసాను. నాకు తెలియదు. ఇది నీకు అన్యాయమనే ఆలోచనే రాలేదు."

ఇవే మాటలు ఉమాపతి నోట నుండి అను క్షణమూ "నన్ను నమ్మండి. నాకే బాధాలేదు. మీరేం అన్యాయం చెయ్యలేదు." కాతర స్వరంతో అంది హైమ.

"కాదు! కాదు! హైమా! నాకే ఇంత క్షోభగా

లేదు.ఎకా...నాకు తెలుసు కాని.నన్ను క్షమించావను... సుఖంగా చచ్చిపోతాను. బ్రతికి ఉండి నీకు అన్యాయం చెయ్యటం కంటె చావటమే నయం." హైమ గుండె బద్దలవుతూంది.

"ఏం మాటలవి? మీరింతకు ముందు నాకు అన్యాయం చెయ్యలేదు. ఇప్పుడు చేస్తున్నారు. మీరే లేకపోతే నా బ్రతుక్కిక అర్థమేవిటి? న్యాయమూ, అన్యాయమూ ఏవిటి?"

"అవును కదూ! నేను చచ్చిపోతే నీకు మరింత అన్యాయం కదూ! నాకు తెలుసు. నేను లేకపోతే నువ్వు బ్రతకలేవు. బ్రతుకుతాను హైమా! బ్రతుకుతాను. ఈ అజ్ఞాన ఫలితాన్ని బ్రతుకంతా మోస్తాను."

పదిరోజులకు గానీ ఉమాపతి మంచం మీదనుంచి లేవలేకపోయాడు.

పెళ్ళి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఎవరి ముఖంలో చూసినా విషాదం తాండవ మాడుతోంది. ఇంట్లోనే దైవసాన్నిధ్యంలో వివాహం జరిగేలా నిర్ణయించింది హైమ.

జాహ్నవి గదిలో నుండి వెక్కివెక్కి ఏడుపు వినిపిస్తే లోపలి కెళ్ళింది హైమ.

సీతమ్మ దిగాలుగా నించుని ఉంది. జాహ్నవి కుమిలి కుమిలి ఏడుస్తోంది. హైమ మనసు కరిగిపోయింది. జాహ్నవి దగ్గరగా వచ్చి భుజం తడుతూ "ఏడవకు జాహ్నవీ! జరిగిపోయిన దానికి ఏం చేస్తాం?" అంది. సీతమ్మ దిగాలుగా నవ్వింది.

"అదెందు కేడుస్తోందో తెలుసునా? తన పెళ్ళికి నగలు లేవని.."

చివ్వున లేచి నించుంది హైమవతి.

"ఏమిటి?"

కన్నీళ్ళ మధ్య నుంచి రోషంగా "అవును. అందరాడవాళ్ళకూ పెళ్ళిలోనే నగలు పెడ్తారు. నా పెళ్ళి నా కర్మ కొద్దీ ఇలా చడీచప్పుడు కాకుండా జరుగుతోంది. కనీసం నగలైనా అక్కర్లేదా? నీకు కట్నమిచ్చుకో నక్కర్లేకుండా పోయింది. అందుకని నాకు నగలు కూడా పెట్టవా?" అంది జాహ్నవి.

"పెడ్తాను తల్లీ,పెడతాను. ఇప్పుడున్న పళంగా ఎక్కడతేను? కాస్త వీలు చూసుకొని పెడతాను."

"పెళ్ళినాడు లేకపోయాక నువ్వు పెట్టే ఎందుకు" అంతవరకూ అయోమయంగా వింటూ నిల్చున్న హైమ నెమ్మదిగా జాహ్నవి దగ్గిర కొచ్చి కూర్చుంది. ఒక్క జత గాజులూ మంగళసూత్రాల గొలుసూ మాత్రం ఉంచుకుని తన నగలన్నీ ఒలిచి చెల్లెలి నలంకరించింది.జాహ్నవి కళ్ళు తుడుచుకొంది హైమ. ఇవతలి కొచ్చేసింది.

దాసీ దొచ్చింది.

"అమ్మా! దొరగారు కల్యాణం బొట్టు పెట్టించుకోటం లేదు. బాసికం కట్టించుకోటం లేదు. ఏం సెలవు?"

హైమ కల్యాణమంటపం దగ్గిర కొచ్చింది. స్వయంగా భర్తకు కల్యాణ తిలకం దిద్దింది. బుగ్గను చుక్క అలంకరించింది.

పెదవి కదపలేక, తల ఎత్తలేక, బొమ్మలా కూర్చున్నాడు ఉమాపతి.

తనక్కడ లేకపోతే, ఏ క్షణంలోనైనా పెళ్ళి పీటల మీంచి లేచిపోవచ్చని పించింది హైమకు. దగ్గిరుండి పెళ్ళి జరిపించింది. స్వయంగా దంపతులను శోభన మందిరంలోకి పంపింది. దేవి విగ్రహంలా నిల్చున హైమను చూస్తూ

"నువ్వు దేవతవమ్మా!" అని కుళ్ళి కుళ్ళిపోయింది సీతమ్మ. వగానంగా తన గదిలో కొచ్చి మొదలు నరికిన చెట్టులా మంచం మీద కూలిపోయింది హైమ.

"నేను దేవతను కాదు. మనిషిని—మనిషిని.." నిశ్శబ్దంగా అరుచుకొంది.

*　　　*　　　*

నిద్రలేని కళ్ళు భగ్గు భగ్గుమంటున్నాయి కాని, రెప్పలు మూతపడటం లేదు హైమకు.. అడుగు చప్పుడుకు ఉలికిపడి లేచి కూచొని ఉమాపతిని చూసి నిస్తుపోయింది.

"మీరు.. ఇక్కడికి.. ఇవాళ.. ఏమిటిది?" అంది తిరిగిపోతున్న స్వరంతో.

ఉమాపతి హైమ దగ్గిరగా వచ్చి హైమ మంచం మీద కూర్చున్నాడు.

"ఉహూ! అక్కడ ఉండలేను హైమా!" అన్నాడు దిగాలుగా.

"అదేమిటి? ఇవాళ రాత్రి.. (మొదటిరాత్రి అనబోయి ఆగిపోయింది.) మీరు జాహ్నవిని ప్రేమించారు కదూ!"

"అవును. అప్పుడనుకున్నాను. కానీ, ఇప్పుడింక ఏమో, పెళ్ళయిపోయాక ప్రేమేమిటని?"

ఈ మాటలు ఉమాపతి అతి అమాయకంగా అన్నాడు. ఏదో విట్టు వేద్దామని అనలేదు. తాను మనసారా అనుకున్నది అన్నాడు.

హైమకు బాగా కోప మొచ్చింది. ఆ అవమానం



జాహ్నవీ హైమవతులు

జాహ్నవిది కాదు తనది అనిపించింది

"అవును మీకు ప్రేమించిన వాళ్ళని పెళ్ళి చేసుకోవాలనీ తెలియదు పెళ్ళి చేసుకున్న వాళ్ళను ప్రేమించాలనీ తెలియదు ప్రేమంటే ఏం తెలుసు మీకు?"

"ఏం తెలియదు అందుకే నేను ప్రేమిస్తున్నది నిన్నేనని తెలుసుకోలేకపోయాను" దీనంగా అన్నాడు ఉమాపతి

అతి ప్రయత్నం మీద అంతవరకూ నిగ్రహించుకున్న హైమ క్షోభనంతా తన్నుకొచ్చాయి మాటలు

భర్త వళ్ళో వాలిపోయి గట్టిగా పెనవేసుకుంది ఎన్నటికీ వదలలేనట్లు ఎవరికీ ఇవ్వలేనట్లు ఉమాపతి కూడా హైమను నల్లుకుపోయాడు

"హైమా! హైమా! నీ వాడిని హైమా! నాకిప్పుడెంత చల్లగా ఉందని, ఎంత హాయిగా ఉందీ? నన్ను వదలకు హైమా!"

హైమ తెలివి తెచ్చుకుంది కళ్ళు తుడుచుకుంది చిరునవ్వుతో "ఎందుకు వదుల్తాను మిమ్మల్ని వదిలే దాన్నయితే ఇంత ఎందుకు సహిస్తాను? ముందు జాహ్నవి దగ్గిర కెళ్ళండి" అంది

"హైమా!"

"ఊహూ! మీరు మరోమాట మాట్లాడటానికి వీల్లేదు జాహ్నవి దగ్గిర కెళ్ళండి ఈరోజు నుంచీ నేను మొత్తం నా జీవితాన్ని జాహ్నవితో పంచుకోవాలి అలా పంచుకునేందుకు నిశ్చయించాను వెళ్ళండి"

హైమ కంఠస్వరంలో ఒక ఆజ్ఞ ఉంది ఆ ఆజ్ఞలో తిరస్కారం లేదు గౌరవం ఉంది ఎరుసనపూర్వకంగా లేదు ప్రేమపూర్వకంగా ఉంది ప్రశ్నేయపడుతున్నట్లుంది తోసివెయ్యటానికి వీల్లేనట్లుగా ఉంది అట్లాంటి స్వరాన్ని హైమ కంఠాన్నుండి మొదటిసారిగా విన్నాడు ఉమాపతి

తలవంచుకుని వెళ్ళిపోయాడు

తన కంఠస్వరం తనకే విచిత్రంగా వినిపించింది హైమకు

ఆ స్వరంలోని కొత్తదనంతో అనేక కొత్త సంగతులు వినిపించాయి

భార్య భర్త ఒడ్డికలో ఇమిడిపోవాలనుకోవటం సహజం తనూ అదే కోరుకుంది ఇన్నాళ్ళూ అలాగే ప్రవర్తించింది కానీ లోకంలో ఏ సూత్రమూ గుడ్డిగా అందరికీ వర్తించదు

తన భర్తలో తనను ఇముడ్చుకోగల బలమైన వ్యక్తిత్వం లేదు తనలోనే ఇమిడిపోయే మార్దవం ఉంది అంతేకాదు అతనికి మరొకరి ఆశ్రయం అవసరం అలాంటి ఆశ్రయమియ్యగలిగే శక్తి తనకుంది కానీ, నిర్లక్ష్యం చేసిందిన్నాళ్ళు కాదు, అంత ప్రధానమైన విషయాన్ని అసలు గుర్తించనే లేదు అనంతమై నవనవోన్మేషణమైన జీవితాన్ని ధర్మసూత్రాల కొలత బద్దలతో కొలచుకుంటూ పురాణగాథల అద్దాలతో చూసుకుంటూ కూర్చుంది

తన కాదర్శం సుమతి సుమతిలో ఏది తన కదర్శంగా భావించింది? కుష్ఠురోగంతో ఉన్న భర్తను స్వయంగ వేశ్య దగ్గిరకు తీసకెళ్ళటమా? అదే గొప్పతనమా?

తన వివేకంతో భర్తను సరిదిద్ది అతనిని మంచి మార్గంలో పెట్టడం అంతకంటె గొప్పతనం కాదా? అది సతీత్వం అనిపించుకోదా?

ఒకకాలంలో ఆ కాలధర్మాన్ని బట్టి మొదటిదే గొప్పగా భావింపబడిందేమో? కాని, ఈనాడు ఎంతటి మూర్ఖులైనా కనీసం మనసులోనైనా రెండవదే ఉత్తమమని అంగీకరించకుండా ఉండలేరు

ఇంత అతిసామాన్యమైన జ్ఞానం తన కెందుకు కలగకుండా పోయింది?

కొంచెం ప్రయత్నించినా తనను తాను రక్షించుకొని తన భర్తనూ చెల్లెలినీ కూడా రక్షించగలిగి ఉండేదే, అసలు ప్రయత్నం కూడా చెయ్యనియ్యని మూఢవిశ్వాసం ఎలా జీర్ణించుకుపోయింది?

గత జలసేతుబంధనం వల్ల ప్రయోజనంలేదు ఇంక ఈ సంసార రథానికి తానే సారథి కావాలి ఎలా నడిపించాలో తన కొక్కదానికే తెలుసు నడపించగలిగే శక్తి తనకు మాత్రమే ఉంది

* * *

ఒక్కసారిగా రైతులందరూ వచ్చేసరికి ఆశ్చర్యపోయాడు ఉమాపతి రైతులు ఉమాపతి పాదాల మీద సాష్టాంగ పడ్డారు

"అరెరె! లేవండి, ఏమిటిది? ఎందుకొచ్చారు?"

"ప్రభువులు దయతలచాలి క్రిందటేడు మా పెద్దమ్మాయి పెళ్ళి చేసాం అయిదు వేలు అప్పయింది"

"అయ్యో, పాపం, పోనీలే, మంచి సంబంధమేనా?"

"బాబుగారు, ఈ ఏడు నేను ఎరువులు తోలించాను చాలా పెట్టుబడి పెట్టాల్సొచ్చింది క్రిందటేడు వానలు సరిగా లేవు పంట అనుకున్న దానిలో సగం కూడా రాలేదు

"అయ్యో! మీకు ఎలా సరిపోతోందోయ్ ఏమైనా అప్పు కావాలా?"

"బాబుగారూ! మా అండ్రిగారికి ప్రాణం మీదికొచ్చింది మందులూ, మాకులూ, కుర్రోడు పట్నంలో చదువుతున్నాడు చిన్నది పెళ్ళి కెదిగింది"

"పాపం, అన్నీ ఖర్చు లేనోయ్!"

"చిత్తం, తమరు కరుణించాలి"

"ఫరవా లేదు మీరేం బాధ పడకండి ఏదైనా సహాయం కావాలంటే చేస్తాను"

"బకాయి శిస్తులన్నీ ఒక్కసారిగా చెల్లించమంటే మా కు ఎలా సాధ్యం బాబా?"

"ఫరవ లేదు వెంటనే చెల్లించక్కర్లేదు చూసుకోవచ్చు లెండి మీ దగ్గిర డబ్బున్నప్పుడు ఇద్దురు కాని" రైతుల ముఖాలు సంతోషంతో వెలిగిపోయాయి

"కానీ బాబూ, తమరు లాయరు నోటీసిప్పించారు"

"లాయరు నోటీసా?" తెల్లబోతూ అన్నాడు ఉమాపతి

"అవును బాబుగారూ! అమ్మగారిప్పించారు మీ రొక్కమాట అమ్మగారితో"

ఉమాపతి ముఖం వెలతెలపోయింది

"హైమతోనా? నాకు తెలియదోయ్! హైమ హైమ ఆలోచించే చేస్తుంది నాకు తెలియదు"

రైతులు వెలతెలపోయారు

"బాబుగారూ కల్లని ప్రభువులు తమరి అండన ఇన్నాళ్ళు బ్రతికాం ఒక్కసారిగా ఇచ్చుకోలేం దయ చూపించండి"

"నన్ను క్షమించండి నాకు తెలీదు హైమను అడుగుతాను" రైతులు నిరాశగా లేచిపోయారు

ఉమాపతి లోపలి వెళ్ళేటప్పటికి హైమ జమాఖర్చుల పద్దుల పుస్తకాన్ని వళ్ళో పెట్టుకుని, చూస్తోంది

"హైమా!"

"ఊ!" తలెత్తకుండానే అంది

"రైతు లొచ్చారు"

"డబ్బు తెచ్చారా?"

"పాపం వాళ్ళకి చాలా ఇబ్బందులు"


"ఇబ్బందులు మనకి లేవా? ఇదుగో చూడండి" పద్దు పుస్తకాన్ని ఉమాపతి ముందు పెట్టింది హైమ

"చూసారా? రెండులక్షల అప్పు ఏనాటికి తీరుతుంది? ఎలా తీరుతుంది? అసలింత అప్పెలా అయింది?"


"ఏమో!" అన్నాడు అయోమయంగా ఉమాపతి



మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది




లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ




ఈ టీతో మీరు కమ్మని చిక్కని
బంగారు ఛాయగల టీ కప్పుల వెంటనే
కప్పులు అతి త్వరలో తయారు
చేయకలుగుదురు ఈ పానీయమును
మీరే త్రాగి చూడండి అతిథులకుకూడా
యివ్వండి మీరు తప్పక సంతోషముతో
వికసిస్తారు అవును–మీ ఆనందభరితులైతే,
అతిథులుకూడాను లిప్టన్స్ హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో
నిజంగా అద్వితీయమైనది

లిప్టన్స్ అంటే మంచి టీ

LIPTON





జాహ్నవీ హైమవతులు

"రాబడి తగ్గిపోవటంవల్ల, మనం చాలా ఉన్న వాళ్ళమనే భావనతో విపరీతంగా ఖర్చులు పెంచుకోవటం వల్ల అసలు, వడ్డీలతో ఈ అప్పులిలా పెరిగిపోతే, మన ఆస్తికీ అప్పులకీ సరిపోతుంది. అప్పులే మించిపోతాయి. ముందు ఈ అప్పులన్నీ తీర్చాలి. నిష్కారణంగా వడ్డీలు పెరిగిపోతున్నాయి."

"కానీ, కానీ.. పాపం. వాళ్ళు చాలా బాధ పడుతున్నారు." హైమ తలెత్తి భర్త ముఖంలో కొకసారి చూసింది.

"నేనొచ్చి మాట్లాడతాను లెండి."

"నువ్వు.. నువ్వు మాట్లాడతావా?"

"అవును."

భర్త అంతటి ఆశ్చర్యాన్నీ మూడక్షరాలతో తేల్చి పారేసింది. ఇంక మాట్లాడటానికేమీ లేనట్టు లేచిపోయింది హైమ.

మరునాడు హైమ స్వయంగా ఆఫీసు గదిలో కొచ్చింది. గుమస్తాలు, రైతులు గౌరవంతో, భయంతో సంభ్రమంతో గడగడ వణికిపోయారు.

హైమ రాణిలా నడిచి వచ్చి సోఫాలో కూర్చుంది. ఎవరి వంకా చూడకుండా గంభీరంగా అంది.

"నాకూ ప్రస్తుతం డబ్బు అవసరం. మీరంతా బకాయీ ఇచ్చుకోలేకపోతే, సగమైనా ఇవ్వండి. కనీసం నాలుగవ వంతైనా ఇపుడిచ్చి తీరాలి."

ఎవరి సమాధానం కోసమూ ఎదురు చూడకుండా లేచిపోయింది. అందరూ చిత్తరువులలా నిలబడ్డారు. ఉమాపతి తలవంచుకుని బయటకు వెళ్ళిపోయాడు.

"నా మీద కోపమొచ్చిందా? మీకేమైనా కష్టం కలిగిందా?" తరువాత అడిగింది హైమ ఉమాపతిని.

"ఛా! నాకు కష్టంలేదు. నీ మీద కోపం రాదు నాకు. నువ్వేంచేసినా, ఆలోచించి చేస్తావు. నాకే కష్టమూ ఎప్పుడూ కలగదు. నువ్వుండగా దిగులే నియ్యవు" హైమ సంతృప్తిగా నిట్టూర్చింది

రైతుల్లో చాలామంది కొంత కొంత చెల్లించారు కొందరు చెల్లించలేదు హైమ ఆయా రైతులు చేస్తున్న పొలాలు అతి చాకచక్యంతో అమ్మించేసి అప్పులో కొంతభాగం తీర్చేసింది.

పొలాలు అమ్మినందుకు వృద్ధ జమిందారిణికి చాలా కోపమొచ్చింది.

"ఇదేటమ్మా! ఎక్కడ న్యాయం? భూములమ్ముకోటమేటి?" అంది.

"మన అప్పు మీద వడ్డీ విపరీతంగా పెరిగిపోతుందండీ? మనం ఇంకా నిర్లక్ష్యం చేస్తే అప్పుల వాళ్ళూరుకోరు. మొత్తం మన ఆస్తినే స్వాహాచేస్తారు. ఆ రైతులెలాగూ శిస్తులు సరిగా చెల్లించటం లేదు. వాళ్ళతో గొడవలు పడే బదులు ఆ పొలాలమ్మేస్తే, అప్పైనా తీరుతుందని అలా చేసాను. ఇంత అప్పు ఏ నాటికి తీరుతుందో అర్థం కావటంలేదు.

అప్పు మాటెత్తేసరికి వృద్ధ జమిందారిణి చాలా వరకు చల్లబడింది. అయినా పూర్తిగా సమాధాన పడలేక కొంచెం సణుక్కుంటూనే వెళ్ళిపోయింది.

* * *

హైమ తన సామర్థ్యంగా అప్పులు తీర్చడానికి కృషి ప్రారంభించిన సమయంలోనే, వృద్ధ జమీం

దారిణి పట్టు మీద శ్రార్ధకర్మ అతివైభవంగా జరపవలసొచ్చింది ఖర్చులే కాని రాబడిలేని సంసారం

మళ్ళీ అప్పు చెయ్యడానికి బయలుదేరాడు ఉమాపతి కేళ్ళేదని హైమ గట్టిగా పట్టుబట్టింది

"ఇప్పటికే తలమునగా అప్పుల్లో ఉన్నాం ఇంక అప్పు చెయ్యద్దు అంతగా అవసరమనిపిస్తే కొంత భూమి అమ్మండి"

అప్పుగా తెస్తూంటే, అదేదో పూరికే వస్తున్నట్లుగా ఉంటుంది తర్వాత ఆ అప్పు మన మెడకు ఉచ్చులా బిగుస్తుందని ఆ సమయంలో మూర్ఖులకు తోచదు మన పూర్వులు చేర్చలేదు కానీ, ఈ అప్పులు చెయ్యటం అన్ని వ్యసనాల్లోనూ ప్రమాదకరమైన వ్యసనం

భూములమ్మటం అలాంటిదికాదు చేతులారా తమ స్వంత ఆస్తిని పోగొట్టుకుంటున్నామనే భావన కలగక మానదు ఆ కారణంగానైనా విపరీతంగా పెరిగిపోతున్న తమ కుటుంబపు ఖర్చులు కొంత అదుపులోకి రావచ్చునని హైమ ఆశించింది

వృద్ధ జమిందారిణికి మాత్రం ఈ విషయం చాలా కల్లోలం కలిగించింది

"వాయన మారిపోయాడు భార్య ఎంత చెపితే అంత ఆస్తి అంతా తగలబెట్టేస్తున్నారు" అని వాపోయింది

కేవలం తన తండ్రి కర్మలకు వాలుగెకరాలమ్ము కోవలసి వచ్చింది ఉమాపతికి అప్పుడు మొదటిసారిగ హైమ ఆశించినట్లు ఉమాపతి తమ ఇంటి ఖర్చులెంత విపరీతంగా తమ రాబడికి మించి ఉన్నాయో, అర్థమయింది

ఒక్క సంవత్సరం గిర్రున తిరిగేసరికి హైమ యాజమాన్యం క్రింద తగ్గిన ఖర్చులూ, హెచ్చిన రాబడీ, చూసేసరికి, ఉమాపతితో హైమ పట్ల పెల్లుమారిన గౌరవమూ, విశ్వాసమూ స్థిరపడిపోయాయి ఇంటి వ్యవహారాల్లో తను కలిగించుకోవటం కంటె కలిగించుకోకపోవటమే మేలని అతనికి బాగా అర్థమయింది

జాహ్నవికి ఏడోనెల ప్రవేశించింది పల్లెటూళ్ళో వైద్య సదుపాయం సరిగా ఉండదని హైమ జాహ్నవిని తల్లి దగ్గరకు పంపలేదు

"నేను మాత్రం ఎవర్ని? జాహ్నవికి అత్తింట్లోనే పుట్టిల్లూ ఉంది ఇక్కడే పురుడు పోసుకుంటుంది" అని ఉత్తరం రాసింది తల్లికి ఆ కారణం వల్ల జాహ్నవి భర్త దగ్గిరే ఉండిపోయింది

భర్తకు తమలపాకులు ఈనెలు తీసి అందిస్తోంది జాహ్నవి వాలుకుర్చీలో పడుకుని తాంబూలం సేవిస్తున్నాడు ఉమాపతి

"బావా!" ముద్దుగా పిలిచింది జాహ్నవి జాహ్నవి అలా పిలిచినప్పుడల్లా ఉమాపతికి మనసులో ఏదో అగ్ని రాజబెట్టినట్లవుతుంది కానీ, తన మనసులో భావాలకు సరిఅయిన భాషను తనెన్నడూ ఇవ్వలేదు

"ఊఁ!" అన్నాడు పరాగ్గా

"నాదో చిన్న కోరిక! తీర్చవా?"

"చెప్పు"

"నాకు రవ్వల అడ్డిగ చేయించుకోవాలనుంది బావా!"

"చేయించుకో!"

"డబ్బు?"

"తీసుకో!"

సంతోషంతో జాహ్నవి ముఖం వెలిగిపోయింది, "నువ్వెంత మంచివాడివి బావా! నా బావ, నా నోముల పంట!"

వంగి ముద్దు పెట్టుకుంది జాహ్నవి భరించాడు ఉమాపతి

"సరే! ఎప్పుడు చేయించుకోమంటావు బావా!"

"నీ యిష్టం ఎప్పుడు కావాలంటే అప్పుడే!"

"నిజంగానా? అయితే నాకు డబ్బియ్యి"

"హైమ నడిగి తీసుకో!"

జాహ్నవి ముఖం పాలిపోయింది

"అదేమిటి బావా! నువ్వియ్య కూడదూ?"

"నా దగ్గిరేముంది? అంతా హైమే చూసుకుంటూందిగా!"

ఈర్ష్యతో జాహ్నవి మనసు ఉడికింది

"అంతా అక్కయ్య పెత్తనమేనా?"

"మరెవరు చెయ్యగలరు?" ఆశ్చర్యంగా అడిగాడు ఉమాపతి

"అదేమిటి బావా! ఆ మాత్రం నేను చెయ్యలేనా? ఆవిడగారు చేసిన పనంతా పనివాళ్ళను మాన్పించటం, పూజారులను తగ్గించటం, పార్టీలు తగ్గించటం ఇవేగా!"

"నీ ముఖం"


అతి మామూలుగా అన్నాడు ఉమాపతి అవమానంతో, ఈర్ష్యతో జాహ్నవికి దుఃఖం పెల్లుబికి వచ్చింది రెండు చేతులలో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది

ఉమాపతి బెంబేలుగా చూసాడు

"నన్ను క్షమించు జాహ్నవీ! ఎవరైనా ఏడుస్తూంటే నేను చూడలేను వెళ్ళిపోతున్నాను"

ఏడుపు మరిచిపోయి గది దాటి వెళ్ళిపోతున్న ఉమాపతిని నోరు తెరుచుకు చూసింది జాహ్నవి

(సశేషం)



వారఫలం

24-2-1967 శుక్రవారం మొదలు 2-3-1967 గురువారం వరకు.

మేషం ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాలవల్ల ముమ్ముందు కూడా ఉపయోగం ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభించగలవు పోటీవారితో వాద ప్రతివాదాలకు దిగడం తగదు. రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సంతృప్తి కరంగా ఉంటాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

వృషభం : వృత్తివ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభించగలదు. కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. శుభకార్యాలు నెరవేరుతాయి.

స్త్రీలకు— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

మిథునం : వ్యాపారంలో పోటీదారులు ఏర్పడినా వారిని అనుకూలాలను సాధించ గలరు. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాలు బలహీనపడే సంఘటనలు జరుగుతాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం : భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. అధికారులవలన జరుగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. ప్రయాణాలు కొంచెం శ్రమ మీద ఫలిస్తాయి. కొన్ని వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడంవలన యిబ్బంది కలుగుతుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన పరిచయాలను చేసుకొంటారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

సింహం : వృత్తివ్యాపారాల్లో యిదివరకు ఏర్పడిన చికాకులు తొలగిపోతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. కొన్ని వ్యవహారాల్లో మిత్రుల సహకారం లభిస్తుంది. సాహిత్య కళారంగాల్లో మీకృషి రాణిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు.

కన్య : వారం ప్రారంభంలోనే వృత్తివ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో మెప్పుకు రాని కార్యభారాన్ని వహిస్తారు. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది.

తుల : ఈవారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. వారం మధ్యలో అన్నివ్యవహారాల్లోనూ చికాకులు యేర్పడతాయి. వృత్తిలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

వృశ్చికం : ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాల వల్ల ముమ్ముందు కూడా ఉపయోగం ఉంటుంది. కొన్నివ్యవహారాల్లో మీకంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభించ గలవు. ప్రయాణాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీకృషి ఫలించగలదు.

ధనస్సు : ఇదివరకు మీకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహ కరంగా ఉంటాయి. నూతన వ్యాపారాలు లాభించగలవు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో ప్రయోజనం గల వ్యక్తులను కలుసుకొంటారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలకు మార్పులు వస్తాయి. విలాస వస్తువులు కొంటారు.

మకరం : వృత్తివ్యాపారాల్లో వారం ప్రారంభంలోనే చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభిస్తాయి. వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం : ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనుపించిన అనుకూలత ఆఖరు వరకు నిలవదు. రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. వృత్తిలో ప్రయోజనం గల వార్తలను వింటారు. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. బంధు మిత్రులను కలుసుకొంటారు.

మీనం : వ్యాపారంలో కొత్త వారితో పోటీ ఏర్పడుతుంది. ఉద్యోగంలో ముఖ్యమైన వ్యవహారాలు మీరు స్వయంగా చూడడం మంచిది. కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేస్తారు. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి.

—మహేష్

గజిబిజి

కన్నడ మూలం: అనుపమా నిరంజన

అనువాదం: కల్యాణి

నల్లటి తారురోడ్డుమీద పచ్చటి అంబాసిడర్, కారుకు రెండువేపులా ఏపుగా పెరిగిన వృక్షాలు, పైన పచ్చటి ఆకులతో నిండిన రెమ్మల తోరణం, ఎండలో చల్లగా వింజామరల్లా ఆ చెట్లు వీచే చల్లటి గాలి మనోల్లాసకరంగా ఉంది పరిగెత్తుతున్న కారుకు దోవ పొడుగూతా ఇదే దృశ్యం స్వాగతం ఇస్తోంది ఆకుల మధ్యలో నుండి తొంగి చూస్తున్న సూర్యుడు, నేల మీద వెలుగునీడల, దాగుడు మూత లాడుతున్నాడు

"వెలుగు— నీడ! ఎంతటి అందం!"

అన్నాడు సదానందం కారు డ్రైవ్‌చేస్తున్న అతని పక్కలో అయినా కొంచెం దూరంలోనే కూర్చున్న సరళ అతని వేపు తిరిగి నిర్వికారమయిన కంఠంతో "వూఁ" అంది

"వూ" ఇదీ మనిషి జీవితం లాగానే ఉందికదా?"

అతని ప్రశ్న వినగానే బెదిరిన లేడిలా అయింది సరళ 'ఎలాంటి మాట అది' అనుకుంది జీవితంలో వెలుగు— నీడ, సుఖం — దుఃఖం బ్రతుకు— చావు, వీటి గురించే ఇలా అన్నారా? లేక ఆయనకి తన, మోహనుడి విషయం తెలిసిందా? ఆ ఆలోచన రాగానే చిన్నగా వణికిపోయింది సరళ ఉహూఁ, ఆ నల్లటి నీడలు ఇప్పుడు తన జీవితం మీద పడకూడదు కొత్తగా పెళ్ళయిన యువతి తను తన జీవితానికి వెలుగు కావాలి, సుఖంకావాలి నీడకాదు, బాధకాదు

తన ఆలోచనల్లో మునిగిపోయిన భార్యవేపు తిరిగి సదానందం మృదువుగా అడిగాడు,

"నిద్ర వస్తోందా సరూ?"

ఆ ప్రేమవాహిని ఆమె హృదయంలోనే దాక్కున్న జ్ఞాపకాలను పైకి లేపింది సరళ కళ్ళు మూసుకుని వెనక్కి జారగిల పడింది

"నిద్రపో బండీపురం ఇంకా పదిమైళ్ళుంది అప్పుడు లేపుతాను!"

నిద్ర! నిద్ర పడుతుందా? జ్ఞాపకాల భూతాన్ని ముక్కలు ముక్కలుగా చేసి రూపుమాపేవరకూ తన కెక్కడిది విశ్రాంతి?

మూసుకున్న రెప్పల అడుగున చీకటి

ఒక రోజున చీకటి పడుతూండగా మోహన్ వచ్చాడు ర్యాలీసైకిల్, దానిముందు పేముబుట్ట, పొట్టి గళ్ళ షర్టు, తెల్లటి కాటన్ ప్యాంటు, చెప్పులు ఎంతో సాదాగా ఉన్నాడు అంత పొడగరి కాని అతని ముఖంలో ఎత్తి కనిపించేవి నవ్వుతున్న పెదవులు.

"రామచంద్రం ఉన్నాడా?" అనడిగాడతను గేటు దగ్గరే నిల్చున్న సరళ

"అన్నయ్య ఇంట్లో లేడు షటిల్‌కాక్ మ్యాచ్ ఉందిటకదా, అక్కడికే వెళ్ళాడు" అని జవాబిచ్చింది

బుట్టలో నుండి రెండు పుస్తకాలను తీసి ఇస్తూ అతనన్నాడు:

"పుస్తకాలు తీసుకు రమ్మన్నాడు ఇచ్చేస్తారా?"

సరళ పుస్తకాలనందుకుంది. అవి తన కిష్టమయిన నవలలు చిరుకోపంతో ఆమె మోహనుడిని అడిగింది

"ఇవి అన్నయ్య కోసమా?"

చిన్నగా మందహాసం చేస్తూ అతనన్నాడు

"కాదు మీకోసం"

అతని కళ్ళలోకి చూసిన సరళ తలదించుకుంది 'మీకోసం' అన్నాడతను ఆమె హృదయం మృదువుగా కంపించింది

"అవును అన్నయ్యతో చెప్పాను, సెలవులు వచ్చాయి, పొద్దుపోవటంలేదు, ఏవయినా నవలలు తెచ్చిపెట్టు అని వాడు మీకు చెప్పాడు" అంటూ పుస్తకాల నోమారు చూసి "చాలా థ్యాంక్స్" అంటూ లోపలికి పరిగెత్తింది

పుస్తకం పట్టుకుని కూర్చున్న కూతుర్ని భోజనానికి లేపటం కూడా తల్లికి కష్టమనిపించింది.

"అన్నయ్యనూ రానివ్వమ్మా ఇద్దరం కలిసి భోంచేస్తాం"

"ఏం పాడు పుస్తకాలో ఏమిటో" అని గొణుక్కుంటూ ఆమె లోపలికి వెళ్ళారు

హఠాత్తుగా ఓ వాక్యం కిందున్న పెన్సిలు గీతను గమనించింది సరళ ఆ వాక్యాన్ని మళ్ళీ మళ్ళీ చదివింది సరళ "మనిద్దరి చూపులూ ఏకమయినపుడు అది ప్రేమకు నాంది అని తెలియలేదానీకు?"

సరళ పుస్తకం మూసిపెట్టింది వాక్యం కింద గీసిన వారెవరో అనుకుంటూ పుస్తకం మొదటి పేజీ తెరచింది 'మోహన్' అన్న అక్షరాలు కనబడ్డాయి ఆమె బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి వచ్చింది

రాత్రి భోజనాలప్పుడు రామచంద్రం అన్నాడు

"మోహనుడికి పుస్తకాల పిచ్చి!"

"నాకూ అంతే" అని సరళకు చెప్పాలనిపించినా చెప్పలేక పెదవి కొరుక్కుంది

మోహన్ ఎన్నోమార్లు వారింటికి వచ్చాడు. సరళ అతనితో ఎన్నోమార్లు మాట్లాడింది, కబుర్లు చెప్పింది. పుస్తకాల విషయం రాగానే రామచంద్రం—

"సాహిత్యం అనగానే నేను వెళ్ళిపోతాను మీరు ఇద్దరూ ఎంతసేపయినా మాట్లాడుకోండి నాకు దాని విషయం బొత్తిగా తెలియదు" అనేవాడు. అతని మాటకందరూ నవ్వేవారు

అసలే సరళ అందగత్తె ఇప్పుడు అలంకరణలో మరింత ఆసక్తి చూపింది మోహన్ ఎలాగేనావుండనీ, ఏమేనా మాట్లాడనీ, అది ఆమెకు ప్రియమే!

ఓ రోజు తల్లి కొడుకు నడిగారు:

"మోహన్‌ది ఏం కులమబ్బాయ్?"

రామచంద్రం నవ్వుతూనే జవాబిచ్చాడు:

"ఏం? మనవాళ్ళే"

"ఏంలేదు వూరికేనే అడిగా మంచి అబ్బాయి" అన్నా రామె ఆ మాటలు విని సంతోషంతో పొంగిపోయింది సరళ

వెలుగు— నీడ

వెలుగయ్యాక నీడ రానే రావాలా?

ఆ రోజు సాయంకాలం రామచంద్రం ఇంట్లో లేడు మోహన్ వచ్చాడు

"రండి అన్నయ్య లేకపోతే మీరు లోపలికి రాకూడదా?" అంది సరళ చిరునవ్వుతో

వెనక్కి తిరిగిన మోహన్ లోపలికి వచ్చాడు సరళ కాఫీ తెచ్చి టేబిల్‌పైన ఉంచింది అతను ఓ పుస్తకం తిరగేస్తూ కూర్చున్నాడు ఆమె కేమనిపించిందో ఏమో, అతనిదగ్గరకు వెళ్ళి అతని చేతిపైన తమకోమలమయిన చేతిని ఉంచింది కొరడాదెబ్బ తిన్నవాడిలా మోహన్ తనచేతినిలాక్కుని నిలబడ్డాడు. అంతే ఆశ్చర్యంతో అతని కళ్ళలోకి చూసింది సరళ మోహన్ మెల్లిగా "రామచంద్రాని కెలాగో అలాగే మీరు నాకూ చెల్లెలన్న భావంతో చనువుగా ఉన్నాను మీరు పొరబాటుగా భావిస్తే నన్ను క్షమించండి మావూళ్ళో నా భార్యవుంది" అన్నాడు

మాటమాటకు పెరిగిపోయిన కోపం ఆఖరికి జ్వాలాముఖి అయి అతనికో చెంపపెట్టిచ్చింది సరళ కోపంతో వణికిపోతూ, ఏడుపు మధ్యలో "ఛీ! మోసగాడా!" అంటూ లోపలికి పరిగెత్తుకు వెళ్ళింది ఆమె నిర్మించిన రంగురంగుల కాంతి గోపురం చిన్నాభిన్నమయింది

సదానందం కార్ హార్న్ చేశాడు ఆ చప్పుడుకు మెలకువ వచ్చింది సరళకు కళ్ళు తెరుచుకుని కూర్చుంది ఓ ఆవుల మంద మెల్లిగా రోడ్డును దాటుతోంది మైదానం వెనకబడి అడవి మొదలవటాన్ని గమనించింది సరళ అరణ్యపు చల్లటి గాలి తగులుతోంది.

"ఈ అడవిలోనేనా మనం మృగాలను చూడటము?" అని అడిగింది భర్తను

"ఊఁ, ఇంక పోనుపోను దట్టమవుతుంది అడవి దాన్ని చూసి ఆశ్చర్యపడతావ్ సరూ"

అప్పుడు తన ఇష్టాయిష్టాల నెవరూ అడగలేదు, అనుకుంది సరళ మోహన్ ఆమె జీవితం నుండి నిష్క్రమించాక, మిన్నువిరిగి తలమీద పడ్డట్టు బాధపడింది సరళ బెంగతో చిక్కిపోయింది తల్లి,

"దానికి పెళ్ళి చేస్తే సరిపోతుంది రామూ ఏ వయసులో ఎక్కడుండాలో అక్కడలేకపోతే ఆడదాని బ్రతుకు వ్యర్థంబాబూ" అన్నారు.

అప్పుడే మోహనుడి మాట ఎత్తారామె,

"ఎందుకో మరి అతను ఇంటికే రావటంలేదే?"

"అతనికి తీరిక ఎక్కడిది? వూరి నుండి భార్యను తీసుకుని వచ్చాడు.

ఆమె తల్లి నిరాశతో నిట్టూర్చారు. ఆ సమయం లోనే సదానందం, అతని తల్లీ, తండ్రీ సరళను చూడటానికి వచ్చారు. అమ్మాయి నచ్చిందని ముహూర్తం నిశ్చయించారు. పొడుగ్గా, పచ్చగా అందంగా ఉన్న సదానందాన్ని అందరూ ఇష్ట పడ్డారు. సరళకూడా ఇష్టపడిందనే భావించారు. "నాకిప్పుడు పెళ్లి వద్దమ్మా" అని తల్లిని బతి మాలుకొంది సరళ. కాని ఆమె కోపంతో "ఏలాంటి మాటలంటున్నావు తల్లీ! మంచి సాంప్రదాయం, మన్మథుడిలాంటి అబ్బాయి. ఇంకా ఏంకావాలి నీకు? కావాలన్నప్పుడు సంబంధాలు వెతకటానికి మీ నాన్నగారు ఉన్నారా?' అని వెంటనే రోదించ సాగారు. తండ్రి జ్ఞప్తికి రాగానే మరోమాట అనకుండా పెళ్ళికి ఒప్పుకుంది సరళ. పెళ్ళి అయి పోయింది.

*　　　*　　　*

కారు హఠాత్తుగా ఆగింది, ఓ చిన్న బంగళా ముందు. సరళ 'రహదారి బంగళా' అని రాసి ఉన్న బోర్డును చూసింది. అంతవరకూ లోపలే అణిగి వున్న అలసటంతా పైకి వచ్చింది. గదికి వెళ్లి మొహం కడుక్కుంది. ఆ తరువాత పడకమీద వాలి పై కప్పునే తదేకంగా చూడసాగింది.

సదానందం "నీ మనసుకు తృప్తయ్యేవరకూ అలా తిరిగి వద్దాం— బండీపురం, వూటీ, కొడై కెనాల్ ఇంకా నీకెక్కడికి వెళ్ళాలనుంటే అక్కడికి వెడదాం." అన్నాడు.

నిజానికి ఇది వారి హనీమూన్. కాని అడవిలో ఏం విహారం? దానిలో సరళకేమాత్రం ఆసక్తి లేదు. సదానందానికి ఒకటే ఉత్సాహం. మేరు వంతటి ధైర్యస్థుడతను, అతి భీరువు ఆమె.

జోళ్ళ చప్పుడుతో సరళ తలుపువేపు చూసింది. సదానందం లోపలికి వచ్చాడు. తలుపులు ముందుకు లాగి ఆమెను దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టు కున్నాడు.

"ఇకలే సరూ. కాఫీ తాగి బయలుదేరుదాం జీప్ లేదట. మన కార్లోనే అడవిలోపలికి వెడదాం."

"మనిద్దరమే?"

"ఉహు . మనతో ఓ రేంజర్ వస్తారు. తోవ చూపాలికదా మరి."

సరళ తల దువ్వి జడవేసుకుంది. ఆకు పచ్చట చీర కట్టుకుంది. అడవిలోని ఆకుపచ్చను ప్రతిబిం బించే ఆకుపచ్చటి చీర. వారు బయటి కొచ్చే సరికి కారు దగ్గర నల్లగా, పొట్టిగా ఉన్న వో వ్యక్తి నిల్చున్నాడు. తీక్షణంగా ఉన్న చిన్న చిన్న కళ్ళు అతనివి. ఖాకీ ప్యాంటు, కోటు, అదే రంగులో వున్న హ్యాట్ ధరించాడతను. చేతిలో వో తుపాకి ఉంది. దాన్ని చూసే సదానందం అడిగాడు.

"ఇదేమిటి, అడవిలో మృగాల్ని చంపకూడదని నియమం ఉందికదా?"

"అవును. కాని ఇది ఆత్మరక్షణకోసం. సాధార ణంగా దీని అవసరం తగలదు. అయినా రేంజర్ దగ్గర వో తుపాకి ఉండాలని రూల్స్."

అతని మాటల్లోని హాస్యాన్ని మెచ్చుకుంటూ సదానందం అడిగాడు, "మీ పేరు?"

"అయ్యన్న."

దంపతులు ముందు, అయ్యన్న వెనక సీట్లో కూర్చున్నారు. కారు నెమ్మదిగా తారు రోడ్డును వదిలిపెట్టి, అడవిలోని కాలిదోవలో చలించసాగింది. ఒక్క వాహనం వెళ్లేంత చోటు ఉంది అంతే. దోవ కటు ఇటూ ఏపుగా పెరిగిన గడ్డి, రాళ్ళు, మట్టిదిబ్బలూ వెనక్కి పోతున్నాయి.

వూరికే అటూ ఇటూ చూస్తున్న అయ్యన్న, కారు నెమ్మదిగా నడవటం గమనించి

"కారుకు క్లియరెన్స్ తక్కువ. ఇలాంటి రోడ్డుకు జీపు, వ్యానులే సరిపోతాయి కదండి?" అన్నాడు.

రోడ్డు వంకర వంకరగా ఎన్నో మలుపులతో సాగుతోంది. పోను పోను అడవి మరింత దట్టం కాసాగింది. ఎత్తుగా పెరిగిన చెట్లు ఆకాశాన్నంటు తున్నట్లున్నాయి. పొడుగ్గా, ఏపుగా పెరిగిన చెట్లు వరసగా, వంకర్లు వంకర్లుగా తిరుగుతున్నట్లని పించింది సరళకు.

"రెండువేపులా చూస్తూ ఉండండి. అక స్మాత్తుగా ఏనుగు కనిపించ వచ్చును." అని మెల్లగా అన్నాడు అయ్యన్న.

అకస్మాత్తుగా కనిపించటం సరికదా, అసలు రెండు మూడు మైళ్ళు దాటినా ఏ మృగమూ వారి కంట పడలేదు. సూర్యుడు పడమరకు తిరిగి పోయాడు. అరుణవర్ణం ఆకాశంపైన చిత్రాలను రచించింది. చెట్లన్నీ బంగారు కొలనులో స్నానం చేసి వచ్చినట్టుగా మెరిసిపోతున్నాయి.

అంతలో అయ్యన్న "అదుగో, నెమలి అక్క డుంది చూడండి" అన్నాడు. కారు ఆగింది. కారుకు వో పదిగజాల దూరంలో పింఛం విప్పుకున్న నెమలి ఒకటి తన జంట నెమలివంక వయ్యారంగా చూస్తోంది.



స్త్రీ— పురుషుడు, ప్రకృతి— పురుషుడు.

సరళకూడా ఆ రోజున అలాంటి చీరే కట్టు కుంది. పెళ్ళయ్యాక మొదటిరాత్రి అది. ఆమె ఆనందంగా ఉండాల్సింది. ప్రేమలో కరిగి, తన్ను తానే మర్చిపోవాల్సిన తరుణ మది. కాని ఏవో కరాళచ్ఛాయలు ఆమెను దుఃఖితను చేశాయి.

సదానందానికి ప్రేమామృతాన్ని కురిపించాలని ఆశ, ఆమెకు ప్రేమంటే జుగుప్స. ఆమె చేతులతో మొహం కప్పుకుని ఏడవసాగింది. సదానందం ఆశ్చ ర్యంతో

గజరాజు

"ఏమిటయింది సరళా? నాతో చెప్పు!" అన్నాడు.

వెక్కిళ్ళ మధ్యనే ఆమె "ఏమీలేదు. నాకేమిటో ఇదిగా ఉంది. నన్ను బలవంతం చేయకండి."

సదానందం తెల్లబోయాడు. కోపం, జాలి కలిగాయతనికి. బలవంతంగా పువ్వుని నలిపివేయ లేడతను. ప్రేమతోనే ఆమె భయాల్ని తొలగిద్దామనుకున్నాడు. అయినా ఆమె విచిత్రమయిన ప్రవర్తన కుతూహలాన్ని రేకెత్తించింది.

ఓ మారు అడిగాడు,

"పెళ్లికి ముందెవర్నైనా ప్రేమించావాసరళా?"

సరళ మనసులోనే వణికిపోయింది. కాదు. అది ప్రేమ కాదు. ఉన్మాదం, పిచ్చి అది. అతనివేపు చూడకుండానే అన్నది,

"లేదు. మరి మీరో?"

సదానందం పకపకా నవ్వాడు.

"ఎంతో మంది అమ్మాయిల్ని చూశాను. కాని 'భార్య' అన్న దృష్టితో ప్రేమించినది నిన్ను మాత్రమే!"

సరళ సమాధానంతో నిట్టూర్పు వదిలింది.

చల్లటి గాలికి ఆమె ముంగురులు లేగి నుదుటి మీద పడ్డాయి. కారు ముందుకు సాగిపోయింది. ఇంకో పదిగజాలు వెళ్లేసరికి నాలుగయిదు లేడి పిల్లలు కనిపించాయి. సదానందం అనుకున్నాడు— 'జూ' లో కూడా ఈ మృగాలున్నాయి. అక్కడ లేని కొత్తదనం ఇక్కడేముంది? మానవునికి దుర్గమమయిన అడవి, కొత్త కొత్త సాహసాలు పిచ్చి వింతగా ఉంది!

అంతలో ఓ జీపు వారికి ఎదురు వచ్చింది. అడవిలో షికారు ముగించుకుని వస్తున్న ప్రయాణికులు వారు. వారిని అయ్యన్న అడిగాడు,

"ఏనుగుని చూశారా?"

"ఆ. కుడివేపునున్న నీటివాగు పక్కన ఓ మగ ఏనుగు నీరు తాగుతోంది."

ఏనుగుని చూసిన వారి మొహంలో ఏదో రకమయిన గర్వం, దేన్నో సాధించిన తృప్తి, విజయోత్సాహం.

"నిజంగానే ఇది Wild goose Chase" అన్నాడు సదానందం.

"అలా అనకండి. కొంతమంది నాలుగయిదు మార్లు వచ్చినా ఏనుగు కనబడక పోవటం కూడా కద్దు."

"వాళ్ళు దురదృష్టవంతులు."

తను దురదృష్టవంతురాలన్న విషయంలో సరళ కేమాత్రం సందేహం లేదు. లేకపోతే తను ముట్టిన దల్లా ఇల్లా అవుతుందా? ప్రేమ అనుకుని దగ్గరికి వెడితే అది భ్రమ అయింది. మోహన్ ఎంతటి మోసగాడు! మోహన్నే ఏమిటి? మగవాళ్ళంతా అంతే. పువ్వుల్ని ఆకర్షించటం దగ్గరకు వచ్చాక నలిపి పారేయటం అదే వారిపని. మోహన్ ఒక్క మారయినా ఆ విషయం చెప్పలేదే! కనీసం అన్నయ్య కయినా ఆ విషయం తెలియవద్దూ? తల్లి వివేకం ఎక్కడికి పారిపోయిందో అప్పుడు? అందరూ కలిపి ప్రవాహం మధ్యలో వదిలిపెట్టారు! మర్చిపోదామనుకున్న కొద్దీ మానని గాయంలా బాధ పెడుతుంది.

"అదుగో" అని అయ్యన్న ఉత్సాహంతో చిన్నగా కేకపెట్టాడు. సరళా సదానందం అతను చూపిన వేపు చూశారు. ఎత్తుగా ఉన్న దిబ్బమీద, చెట్ల మధ్యలో ఓ నల్లటి గజరాజు చెట్ల ఆకుల్ని తుంపి నోట్లో పెట్టుకుంటోంది. భవ్యత, గాంభీర్యాలకు మరో మారుపేరు 'కరి' అనుకున్నాడు సదానందం. గొలుసులతో బంధింపబడిన ఏనుగు కాదిది. స్వతంత్ర వనవిహారి.

సరళకు తన జీవితం సార్థకమయింది అనిపించింది.

సదానందం "ఏనుగు కారు దారికి అడ్డంవచ్చి గొడవచేయదా అయ్యన్నగారూ?" అనడిగాడు.

"ఒక్కోమారు అల్లా కూడా అవుతుంది. అప్పుడు ఆకాశంలోకి తుపాకి పేలుస్తాం. బెదిరిపోయి ఏనుగు పరిగెత్తుతుంది. మనమూ రివర్స్ గేర్ వేసి వెనక్కి పోవాలి. డ్రైవర్ ధైర్యంగా ఉంటే మరేం భయంలేదు. ఇక వెనక్కి పోదామా? ఏనుగుని చూశాంకదా!" అన్నాడు అయ్యన్న.

"భయపడకండి. మీ డ్రైవర్ ధైర్యశాలి" అంటూ చిన్నగా నవ్వాడు సదానందం.

చీకటి అడవిని నలుచెరంగులా కమ్ముకోసాగింది. దట్టంగా ఉన్న చెట్లు నల్లటి తెరను కప్పుకున్నాయి. ఎత్తు పల్లాలుగా ఉన్న ఆ దారి నిర్జనంగా ఉంది. కీచురాళ్ళ చప్పుడు ఆ నిశ్శబ్దనిశీథిలో స్పష్టంగా వినిపిస్తోంది. చెట్లకు వేలాడుతున్న గబ్బిలాలనుచూసి సరళ మనస్సు వణికింది. ఎంతో రమ్యంగా కనబడిన ప్రకృతి ఇప్పుడు రుద్రంగా, భయానకంగా, భీభత్సంగా ఉంది.


భయం పిడికిలా ఆమె కళ్ళముందు నాట్యమాడింది. ఇక భయం దేనికి? అబద్ధం చెప్పి, మోసం చేస్తే భయపడాలి. సదానందానికి అంతా చెప్పేయాలి. ఆయన తప్పక క్షమిస్తారు. అప్పుడు తన మనస్సు తేలికపడుతుంది. ఈ బాధ తగ్గుతుంది. మగవాళ్ళంతా ఒక్కలా ఉంటారనుకున్నదే, ఎంత పొరబాటది! తన సదానందం అలాంటివాడు కాదు. అతను సహృదయుడు, క్షమాశీలుడు, ఉదాత్తమయిన మనస్సు కలవాడు, ఆ గజరాజు లాగానే ధీశాలి, అనిపించింది సరళకు.

లేకపోతే ఆ మొదటి రాత్రి "నన్ను బలవంతం చేయకండి" అంటే ఆయన దయతో ప్రవర్తించడు లేదా? పశువులా హింసించి తన కోరిక తీర్చుకుందా మనిపించలేదే ఆయనకు! ఆ తరువాత కూడా తన్ను కొట్టక తీసుకెళ్లి కావలసిన చీరల్ని కొనిపెట్టారు. "నీకు కావాల్సింది తీసుకో సరళా. నువ్వు సంతోషంగా ఉండటమే నాకు ముఖ్యం" అని కూడా అన్నారు. అతని ప్రేమ చూసి ఏడుపు వచ్చిందామెకు. "భార్య అన్న దృష్టితో ప్రేమించినది నిన్ను మాత్రమే" అని కూడా అన్నారు. ఎలాంటి నిష్కల్మషమయిన అనురాగం ఆయనది! దానికి బదులుగా నేను ఆయనకి ఇచ్చినది చిరాకు, విసుగుదల. నా విసుగుదలని పోగొట్టటానికి "ఎక్కడి కయినా పికెనిక్ వెడదాం" అన్నారు. కాని ఒక్కమారు అయినా ఆయన కోరికల్ని తీర్చానా? ఆయన్ని సంతోషపెట్టటానికి ప్రయత్నించానా? ఆయన నాకంతా ఇచ్చారు. కాని నేనాయనకేమీ ఇవ్వలేదు. దేవుడా, నాకిలాంటి బుద్ధి ఎందుకిచ్చావ్? ఆయన్ని సుఖపెట్టాలి. అంతకన్నా నాకింకేమీ వద్దు. ఆయన ప్రేమఋణాన్ని తీర్చాలి అనుకుంది సరళ.

అంతలో కారు ఆగిపోయింది. సదానందం డిక్కీ బ్యానెట్ తీసి బ్యాటరీ సాయంతో రిపేరు చేశాడు. అయ్యన్న కారుని తోశాడు. అయినా కారు కదలలేదు. తన ప్రయత్నాలు విఫలమవటంతో కొంచెం కంగారు పడ్డాడు సదానందం.

"ఇపుడేం చేద్దామండి?" అనడిగింది సరళ, ఏడుపు నాపుకోవటానికి ప్రయత్నిస్తూ. సదానందం సిగరెట్ ముట్టించి పొగ వదులుతూ "మిస్టర్ అయ్యన్నా, ఇపుడు మనం వెనక్కి ఎలా వెళ్ళటం చెప్పండి." అన్నాడు.

"ఇంకో గంటా, రెండు గంటలు చూసి మన కోసం వెతుకుతూ వస్తారు. అంతదాకా ఇక్కడే మన ముకాం."



గజరాజు

"ఈ చీకట్లోనా" అని చింతించసాగింది సరళ. కీచురాళ్ళ శబ్దం ఎక్కువవసాగింది. జంజరమని మృగాలు పరిగెడుతున్న చప్పుడు, దూరంలో ఏనుగు ఘీంకారపు శబ్దం వినపడింది. ఆమె సదానందం పక్కకు జరిగి నిలబడింది. ఆమె గుండెల్లో అదోరకమయిన గాబరా కలిగింది. సదానందం ఆమె భుజం మీద చేయివేసి "భయపడకు సరళా, నేనున్నానుగా" అన్నాడు. అతని చేతిస్పర్శ హాయిగా ఉన్నా, అయ్యన్న చూస్తున్నాడేమోనని ఆ చీకట్లో కూడా సిగ్గుపడిపోయింది సరళ.

అప్పుడే కుడివేపునున్న చెట్ల మధ్య నుండి కాగడాల వెలుగులాంటిది కనిపించింది. జీపులైట్ల వెలుగేనా, ఇంత మందంగా ఉందేమిటా అని సదానందం ఆలోచిస్తూండగానే అయ్యన్న గట్టిగా కేకపెట్టి

"పరిగెత్తిపోండి, ఏనుగు వస్తోంది! ఏదయినా పెద్ద చెట్టు ఎక్కి కూర్చోండి. తుపాకి పేల్చి ఏనుగుని భయపెడతాను........ వూ. తొందరగా." అని అరిచాడు.

సదానందం, సరళ చేతిని పట్టుకొని ఎడం వేపుకి పరిగెత్తసాగాడు. చెట్ల వేరు తగిలి సరళ కిందపడింది. ఆమె చెప్పులు కాస్త వెనుకనే ఉండిపోయాయి. ముళ్ళకి తగులుకుని ఆమె చీర చిరిగిపోయింది. అయినా సదానందం ఆమె చేయి వదలకుండా గట్టిగా పట్టుకుని పరిగెత్తుతూనే ఉన్నాడు. నడవలేక, కాళ్ళలో శక్తి నశించిపోయి ఆమె గట్టిగా రోదించసాగింది. అది అరణ్య రోదనం.

అప్పుడే వారికి తుపాకి పేలిన చప్పుడు వినిపించింది. దానితోపాటు ఏనుగ ఘీంకారం కూడా వినిపించింది. మరింకో నాలుగడుగులు వేసేసరికి భూతంలాంటి చెట్టు కనిపించింది. సదానందం బూట్సు తీసి పారేసి తను ముందు పైకెక్కాడు. కిందనున్న సరళను పైకి లాక్కున్నాడు. ఆమె మోకాలు, మోచేయి చెట్టుకు రాచుకుని రక్తం వచ్చింది. నొప్పితో సరళ మూలిగింది. సదానందం ఇంకా పైకెక్కి సరళనూ పైకి లాక్కున్నాడు. లావుగా, పెద్దగా ఉన్న రెండు కొమ్మలు ఒకదాని పక్కనొకటి ఆనుకొని ఉన్నాయి. అక్కడే కూర్చున్నారు వారిద్దరూ. అలసిపోయిన సరళ అతన్ని గట్టిగా కౌగలించుకుంది. సదానందం ఆమె తల నిమురుతూ "భయపడకు సరళా, ఇంకేమీ భయం లేదు." అన్నాడు.

రెండోమారు తుపాకి పేల్చిన చప్పుడు వినిపించింది. అయ్యన్న ఎక్కడున్నాడో తెలియలేదు. అతను కూడా ఏదయినా చెట్టు ఎక్కి ఉండాలి అనుకున్నాడు సదానందం. మదించిన గజరాజు తన కోపాన్నంతా ఆ కారు పైన తీర్చుకుంటోంది. పిచ్చెక్కినట్టుగా అటూ ఇటూ తిరుగుతోంది.

పైన గాఢాంధకారం, కింద మృత్యువులా కనపడ్డ గజరాజు, ఒంటి మీద గాయాలు, రక్తం, నొప్పి ఇన్నిటి మధ్యా ఆ అమృతక్షణంలో సరళ మనస్సు పునీతమయింది ●





ఏదో ఒక పెద సంఖ్యని మరో సంఖ్యచే భాగిస్తే శేషం మిగులుతుందో మిగలదో నిజంగా భాగించి చూడకుండా తెలుసుకోవడం సాధ్యమా? విభాజకం (భాగించే సంఖ్య) బాగా చిన్నది అయితే నిశ్శేషంగా పోతుందో పోదో తెలుసుకోడానికి కొన్ని అడ్డదారులున్నాయి. విభాజకం మరీ పెద్దది అయితే చెప్పడం కష్టం. 15 లోపు సంఖ్యలతో భాగించగా శేషం మిగిలేదీ లేనిదీ సులభంగా తెలియజెప్పే చిట్కాలు కొన్ని చెప్తాను. విభాజ్యం (భాగించబడేసంఖ్య) బాగా పెద్దది అయినప్పుడే వీటి ఉపయోగం.

ఉదాహరణకి :— 9,454,768,462,020 అనే పదమూడంకెల సంఖ్యని భాగించాలి అనుకుందాం.

విభాజకం 1 . అన్ని సంఖ్యలలోనూ ఒకటి నిశ్శేషంగా పోతుంది.

విభాజకం 2 : ఇచ్చినది సరిసంఖ్యఅయితే 2 నిశ్శేషంగా పోతుంది. పైన వ్రాసినది సరిసంఖ్య కనుక దీనిని 2 చే భాగిస్తే శేషం మిగులదు.

విభాజకం 3 . ఇచ్చినసంఖ్యలోని అంకెలన్నింటినీ కూడు. ఆ కూడగా వచ్చిన మొత్తాన్ని మూలాంకం అంటారని ఇదివరలో తెలుసుకున్నాంకదా? ఈ మొత్తంలో మూడు నిశ్శేషంగాపోతే అసలు సంఖ్యలోనూ పోతుంది పైన వ్రాసిన సంఖ్యలోని అంకెలన్నీ కూడితే 9+4+5+4+7+6+8+4+6+2+0+2+0=57. మళ్ళీ 5+7=12 మళ్ళీ 1+2=3= మూలాంకం. ఇచ్చిన సంఖ్యయొక్క మూలాంకంలో 3 నిశ్శేషంగా పోతుంది.

విభాజకం 4:— ఇచ్చిన సంఖ్యలో కుడివైపు చివరి రెండు అంకెలలోనూ (అంటే పదులస్థానం, ఒకట్లస్థానం) 4 నిశ్శేషంగాపోతే అసలు సంఖ్యలోనూ పోతుంది ఉదహరించిన సంఖ్యలో చివరి రెండు అంకెలు 20. ఇందులో 4 నిశ్శేషంగా పోతుంది. కనుక అసలు సంఖ్యలోనూ పోతుంది.

విభాజకం 5 :—ఇచ్చిన సంఖ్యలో ఒకట్ల స్థానంలో సున్నగాని. 5 గాని ఉంటె ఆసంఖ్యలో 5 నిశ్శేషంగాపోతుంది.

విభాజకం 6 : ఇచ్చిన సంఖ్యలో 6 నిశ్శేషంగా పోతుందో లేదో తెలుసుకోడానికి రెండు పరీక్షలు చెయ్యాలి. (1) అందులో 2 పోతుందో లేదోచూడాలి (2) అందులో 3 పోతుందో లేదో చూడాలి. 2, 3 లు నిశ్శేషంగాపోతే 6 నిశ్శేషంగా పోతుంది. పైన వ్రాసిన సంఖ్యలో 2, 3 లు నిశ్శేషంగా పోతాయని తెలుసుకున్నాం. కనుక ఆరు కూడా పోతుంది.

విభాజకం 7 : ఇచ్చిన సంఖ్యలో 7, 13 లు నిశ్శేషంగా పోతాయో లేదో తెలుసుకోడానికి ఒకటే పద్ధతి ఉంది. దానిని "విభాజకం 13" లో చర్చిద్దాం.

విభాజకం 8 : ఇచ్చిన సంఖ్యలో కుడి చివరి మూడు అంకెలలోనూ (వందలు, పదులు, ఒకట్ల స్థానాలు) 8 నిశ్శేషంగా పోతుందేమో చూడాలి. ఈ మూడింటిలోనూ పోతే అసలు సంఖ్యలోనూ పోతుంది. పైన వ్రాసిన సంఖ్యలో చివర 020 ఉంది. అంటే 20 అని అర్థం. 20 ని 8 చే భాగిస్తే శేషం మిగులుతుంది కనుక అసలు సంఖ్యలో 8 నిశ్శేషంగా పోదు.

విభాజకం 9 : ఇచ్చిన సంఖ్యలోని అంకెలన్నీ కూడి మూలాంకం కనుక్కోవాలి. ఈ మూలాంకం 9 అయితే అసలు సంఖ్యలో తొమ్మిది నిశ్శేషంగా పోతుంది. మన సంఖ్యయొక్క మూలాంకం 3. కనుక ఇందులో 9 నిశ్శేషంగా పోదు.

విభాజకం 10 : ఒకట్ల స్థానంలో సున్న ఉంటే ఆ సంఖ్యలో 10 నిశ్శేషంగా పోతుందని చూడగానే చెప్పవచ్చు.

విభాజకం 11 : ఇచ్చిన సంఖ్యలో 11 నిశ్శేషంగా పోతుందో లేదో చాలా సులభంగా చెప్పవచ్చు. ఇచ్చిన సంఖ్యలోని అంకెలన్నింటినీ రెండు జట్లుగా విడదీయాలి. మొదటి అంకెను, మూడవ అంకెను ఐదవ అంకెను, ఏడవ అంకెను......ఒక వైపున వేసి కూడాలి. తరువాత రెండవ అంకెను, నాలుగవ, ఎనిమిదవ అంకెను..... మరొకచోటవేసి కూడాలి. ఈ మొత్తాలను ఒక దానిలోనుంచి మరొకటి తీసి వెయ్యాలి. మిగిలినది సున్నగాని, 11 గాని 22 గాని 33 గాని, 44 గాని .....అయితే అసలు సంఖ్యలో 11 నిశ్శేషంగా పోతుంది.

ఉదహరించిన సంఖ్యలో :

$$9+5+7+8+6+0+0 = 35$$
$$4+4+6+4+2+2 = 22$$

భేదం 13

13 లో 11 నిశ్శేషంగా పోదు కనుక అసలు సంఖ్యలోనూ పోదు.

విభాజకం 12: ఇచ్చిన సంఖ్యలో మొట్టమొదట మూడు, నాలుగు నిశ్శేషంగా పోతున్నాయేమో చూడాలి. ఇవి రెండు కూడా నిశ్శేషంగా పోతే అసలు సంఖ్యలో 12 నిశ్శేషంగాపోతుంది. ఉదాహరించిన సంఖ్యలో 3, 4 లు శేషం లేకుండా పోతాయని తెలుసుకున్నాం. కనుక అందులో 12 కూడా పోతుంది.

విభాజకం 7 , విభాజకం 13 :

ఇచ్చిన సంఖ్యని కుడివైపునుంచి మొదలుపెట్టి మూడేసి అంకెల సంఖ్యలుగా విడదీయాలి. వీటిని ఒకటి విడిచి ఒకటి కూడడం తీసివెయ్యడం చేసుకుంటూపోతే చివరకు మిగిలిన సంఖ్యలో 7 నిశ్శేషంగాపోతే అసలు సంఖ్యలోనూ పోతుంది. అల్లాగే అందులో 13 నిశ్శేషంగాపోతే అసలు సంఖ్యలోనూ పోతుంది. అన్నట్లు 11 కి కూడా ఇదే పరీక్ష ఉపయోగించవచ్చు. ఉదహరించిన సంఖ్యని ఇలా వ్రాద్దాం.

$$\begin{matrix} 9 & 454 & 768 & 462 & 020 \\ + & - & + & - & + \end{matrix}$$


$(020)-(462)+(768)-(454)+(009) = -119$. ఈ 119 లో 7 నిశ్శేషంగా పోతుంది కనుక అసలు సంఖ్యలో కూడా 7 పోతుంది.

119 ని 13 చే భాగిస్తే శేషం మిగులుతుంది కనుక అసలు సంఖ్యలో 13 నిశ్శేషంగా పోదు.


119 లో 11 నిశ్శేషంగా పోదు. కనుక అసలు సంఖ్యలోనూపోదు.

విభాజకం 14 : ఇచ్చిన సంఖ్యలో రెండు, ఏడులు నిశ్శేషంగాపోతే 14 కూడా పోతుంది.

విభాజకం 15 : ఇచ్చిన సంఖ్యలో మూడు, ఐదులు నిశ్శేషంగా పోతే 15 కూడా పోతుంది. ●



వనితాలోకం



రాజకుమారి ఇందిరాదేవి ధనరాజగిర్, వ్యాస రచయిత.

రాజకుమారి ఇందిరాదేవి ధనరాజగిర్

బాసాని సుదర్శన్ రెడ్డి

మల్లెపూవుల మందహాసం వంటి దరహాసం ఆమెది. విశ్వసాహిత్యాన్ని మథించి, సాధించిన విజ్ఞాన వైశారద్యంతో పాటు హృదయ నైర్మల్యాన్ని కలిగిన సంస్కారం ఆమెది. నిజాన్ని నిజంలా నిగ్గుదీసి నిర్భీతిగా నివేదించే నిజాయితీ ఆమెది. అందాలకు నందెంలా, అనంతమైన ప్రకృతి వైభవంలో విహరించే విహంగంలా, వియత్పథంలో విన్యసించే భావాల రాగాల ఆలాపనం ఆమెది.

'అన్వేషణ'ను నిర్వచించడానికి అహరహమూ ఆరేళ్లపాటు అన్వేషించిన జిజ్ఞాసా చింతన ఆమెది; నిండైన వ్యక్తిత్వానికి మెండుగా మన్నన కలిగించే విలక్షణ సంపన్నత ఆమెది; తొలి పరిచయంలోనే ఆత్మీయతను కలిగించే స్నిగ్ధవ్యక్తిత్వం గల 36 ఏళ్ల కవయిత్రి— రాజకుమారి ఇందిరాదేవి ధనరాజగిర్. ఆమె ఇంగ్లీషులో వ్రాసిన మూడు కావ్యాలు దేశంలోని మేధావుల ప్రశంసలకు పాత్రమైనాయి. భాషలోను, భావాల్లోనూ ఆమె చూపిన ప్రతిభ సాహిత్య బంధువులను విస్మయపర్చినది.

ఇందిరాదేవి కేవలం కవితారంగానికే పరిమితం కాలేదు. సామాజిక జీవనరంగంతోనూ సంబంధం ఉన్నది. అఖిలభారత మహిళామండలి, రెడ్‌క్రాస్, బొంబాయి ఫిలిం సెన్సారుబోర్డు వంటి ఉన్నత సంస్థల్లో ఆమెకు సభ్యత్వం ఉన్నది. హైదరాబాదులోని ధనరాజగిర్ రాజప్రాసాదంలో ఇందిరాదేవిని ఇటీవల నేను కల్సుకున్నప్పుడు, ఆమె కవితా వ్యాసంగం గురించి, వనితల ప్రగతిని గురించి చర్చించాను. మన ప్రాచీన శిల్పవైభవాన్ని చాటే సువిశాలమైన ఆ రాజ మందిరంలో, తరతరాల నాటి కళాఖండాలు కనిపించాయి. గంభీరమైన వాతావరణం ఆవహించుకున్న ఆ ప్రాసాదంలో, గతాన్ని అవగతం చేసే దేశదేశాల వస్తుసామగ్రి అలంకరించి ఉన్న గదిలోనికి ఇందిరాదేవి గారు నన్ను తీసుకవెళ్లారు.

స్త్రీల మానసిక దృక్పథం గురించి ఆమెకు విస్పష్టమైన అభిప్రాయాలున్నాయి. వాటిని ఆమె నిష్కర్షగా ప్రకటిస్తారు. స్త్రీ జీవితానికి ప్రయోజనం ఉండాలని అన్నారు. రాజకీయ స్వాతంత్ర్యం రావచ్చు, కాని ఇంకనూ స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం రాలేదని, అందుకే వ్యక్తిత్వం పరిపూర్ణంగా వికసించడం లేదని ఇందిరాదేవి చెప్పారు. 'ఈ పరిస్థితుల్లో వ్యక్తిగా స్త్రీ పెరగజాలదు. స్వేచ్ఛగా భావాలను ప్రకటించుకోజాలదు. ప్రగతి తీరానికి చేరుకోజాలదు. స్వల్పమైన ఆర్థిక అవసరాలకు కూడా ఇతరులపై— భర్తపైన కూడా— ఆధారపడి బ్రతికినంతకాలం స్త్రీ నిజమైన, అర్థవంతమైన అభ్యున్నతిని సాధించడమంటూ ఉండదు. పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసమూ ఉండదు!' అని రాజకుమారి నొక్కి చెప్పారు.

స్త్రీ నరకయాతన...

జీవితంలో స్త్రీకి ఒక ఆసరా ఉండాలన్న భావనతోనే మనదేశంలో పెళ్లిళ్లు జరుగుతున్నాయనీ, ప్రతిచిన్న విషయానికి కూడా అలా ఆధారపడి బ్రతకడం స్త్రీకి చావు లాంటిదని ఇందిరాదేవి అన్నారు. 'భర్తకు అర్ధాంగిగా, అండగా ఉండాలంటే, ఆర్థిక స్వేచ్ఛ ఉండితీరాలి. అలాంటి స్వేచ్ఛలేని పక్షంలో మానసికంగా స్త్రీ నరక యాతన అనుభవిస్తుంది. ఆలోచనల్లోనూ, భావనల్లోనూ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ, భర్తతో సమానంగా నిలువగలుగడానికి వీలుండదని' ఆమె పేర్కొన్నారు.

అభ్యుదయాన్ని మీరెలా నిర్వచిస్తారు? అని నేను అడిగినప్పుడు, "బాధల నివారణ ప్రగతికి సూచిక. అంతరంగికంగా బాధతో క్రుంగుతుంటే అభ్యుదయాన్ని సాధించామని చెప్పుకోజాలము. మానసికమైన బాధలను సాధ్యమైనంతవరకూ తొలగించుకోడమే ప్రగతి. అది స్వార్థమే అనుకోవచ్చు. వ్యక్తిగా తాను సంతృప్తిగా ఉంటేనే ఇతరులకు మీరు ప్రమోదాన్ని కలిగించగలుగుతారు." అని ఇందిరాదేవి వివరించారు.

మానసికంగా స్త్రీ సంతోషంగా ఉన్నప్పుడే తన పిల్లల యోగక్షేమాలు కనిపెట్టుతుందనీ, తాను ఒక వంక బాధపడుతూ తన పిల్లలకు తల్లి ఎలాంటి తృప్తినీ, సంతృప్తిని ఇవ్వగలదు? అనీ రాజకుమారి ప్రశ్నించారు. స్త్రీలు కూడా ఉద్యోగాలు చేసి కుటుంబ ఆర్థిక వ్యవస్థకు దోహదపర్చినప్పుడే ఇండ్లలో రులు సుఖమయ జీవితాన్ని గడపడానికి వీలవుతుందని చెప్పారు.

ఆఫ్ఘానిస్తాన్ నుండి హైదరాబాద్‌కు

ఇందిరాదేవి హైదరాబాదులో 1931వ సంవత్సరం ఆగస్టు 17వ తేదీన జన్మించారు. ఆఫ్ఘనిస్తాన్‌లోని ఖాండహార్ పట్టణం నుండి రెండువేల ఏళ్ల క్రితం ధనరాజగిర్ కుటుంబం భారతదేశానికి తరలి వచ్చినది. ఏడు తరాలపాటు పూనాలో, కొంతకాలం ఢిల్లీలో, మద్రాసులో గడిపిన తర్వాత ఈ కుటుంబం —500 ఏళ్ల క్రితం హైదరాబాదుకు మకాం— మార్చినది. 'రాజా' అను బిరుదు వీరికి వంశ

పారంపర్యంగా వస్తున్నది. గోస్వామి తెగకు చెందిన వీరు శంకరాచార్యుల వారి శిష్యులు.

చిన్ననాటి నుండి ఇందిరాదేవి ఇంగ్లీషు గ్రంథాలు విపరీతంగా చదువుతూ వుండేవారు. ఒక దశలో ఠాగూర్, సరోజినీనాయుడు, ఇలియట్, షెల్లీ, బ్రౌనింగ్, డి. హెచ్. లారెన్సు, సార్త్రే, అల్బెర్టో మొరావియో, సెయింట్ జోన్‌పెర్స్, వర్జీనియా వూల్ఫ్ వంటి ప్రఖ్యాత రచయితలు ఆమె మానసిక వికాసానికి దోహదం చేసారు. గాలిబ్, జిగర్ రచనలు కాల్పనిక కవిత్వ రచన పట్ల ఆమెకు అభిరుచిని కలిగించాయి. తాను ఎన్నుకునే రచయితల రచనలన్నింటినీ ఆమూలాగ్రంగా ఆమె చదువుతారు. ఆయా రచయితల లేఖలు, వారి గురించి ఇతరులు వ్రాసిన రచనలూ చదవడం అలవాటు. ఆ రచయిత తత్వాన్ని అర్థం చేసుకోవడానికి వీలవుతుందని ఇందిరాదేవి అభిప్రాయపడుతారు.

సామ్యవాద దృక్పథం: కవితా వ్యాసంగం

రాజకుమారి 1961 లో తొలి గేయం "వార్నింగ్" వ్రాసారు. అది వ్రాసిన 24 గంటల లోపునవే ప్రఖ్యాత కవి మగ్దూం మొహియుద్దీన్ దాన్ని ఉర్దూ భాషలోనికి అనువదించి, ఒక ప్రముఖ పత్రికలో ప్రచురించడమూ జరిగింది. దానికి ఆశించనంతగా 'రెస్పాన్సు' వచ్చినది. నలుగురి దృష్టిని ఆకర్షించింది. "బహుశా అనువాదకుడి పేరు ప్రఖ్యాతుల వల్లనేమో" అని నమ్రతతో అంటారామె. సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ సంప్రదాయ పద్ధతులలో పెరిగినప్పటికీ, ఇందిరాదేవిలో ప్రజాస్వామికమైన భావనా దృక్పథం మొగ్గలు తొడిగినది. ఆ మొగ్గలు కవితా రూపంలో వికసించాయి. ఆమె కవిత్వం వ్రాయడం ప్రారంభించినప్పుడు, కుటుంబీకులంతా నవ్వారు. 'నేను స్వాభావిక కవిత్వం రాయడమే రాచమర్యాదలపై తిరుగుబాటుగా భావించారు' అని ఇందిరాదేవి తెలిపారు. సాహిత్య పరిమళాలు ఎన్నడూ ఆమె కుటుంబంలో వీచలేదు. అందుచేత, ఆమె రచనా వ్యాసంగానికి ప్రత్యేకమైన ప్రోత్సాహమూ లేదు. రాజప్రాసాదంలో అలా రాయడానికి ఇందిరాదేవి ఆలోచించడమే గొప్ప విషయం.

కవిత్వం పట్ల కూడా రాజకుమారికి విస్పష్టమైన అభిప్రాయాలున్నాయి. వ్యక్తిని కదలించకపోతే అది కవిత్వం కాదంటారు. కవిత్వానికి ఖచ్చితమైన ప్రయోజనమూ, స్పష్టమైన అర్థమూ ఉండాలనీ, పాఠకుల ఆలోచింపజేసే ఉత్తేజపర్చడం కవిత్వపు కనీస లక్షణమని చెప్తారు. కవిత్వ ప్రక్రియలో సంఘర్షణ బయలుదేరినదనీ, ఈనాడు కవిత్వం వ్రాయడం ప్రమాదకరంగా పరిణమించినదని ఇందిరాదేవి భావిస్తున్నారు. ప్రతి కవితా ఖండిక లోనూ కవిముద్ర, ఆర్ద్రత ఉండాలని అభిలషిస్తారు. ఏమైనప్పటికీ, "నేను కవిగానే ఉండదల్చుకున్నాను" అని ఆమె చెప్పారు.

"ప్రేమ అనేది సంపూర్ణ వ్యక్తిత్వానికి సంబంధించినది. ఇండోరుల ఆమోదంతో జరిగేది. శారీరకమైన కలయిక ప్రేమకాదు. ప్రేమికులిరువురూ భావనాంబరంలో కల్సుకుంటారు. పరస్పరం వ్యక్తిత్వాన్ని గౌరవించుకుంటేనే, సమాగమం కావడం ప్రేమ. ఒకరి కోసం వేరొకరు వ్యక్తిత్వాన్ని వదులుకోవడం ప్రేమకాదు. అలా జరిగితే, జీవితంలో ఆకర్షణ ఉండదు. ఆకర్షణ లేని దాంపత్య జీవితంలో సంపూర్ణత ఉండదు. ఫ్రీలవ్ అనేది లేదు. వివాహ వ్యవస్థ ఉండాలి. ఒక బ్యాంకును చూసి పెళ్లి చేసుకోవడమన్నది పెళ్లికాదు! ప్రేమించడమన్నది ఒకేసారి జరుగుతుంది. పదేపదే ప్రేమించడమంటే అది పశుత్వపు ఆకర్షణ" అని ఇందిరాదేవి ప్రేమ గురించి తమ భావాలను నిర్మొహమాటంగా వివరించారు.

ఆధునిక మహిళల తీరుతెన్నులను ఇందిరాదేవి తీవ్రంగా విమర్శించారు. ప్రవర్తనలో, వేషధారణలో, సాంప్రదాయికత అదృశ్యమవుతున్నదని, అందువల్లనే వారిపట్ల సమాజానికి నిరాసక్తి ఏర్పడుతున్నదని చెప్పారు. రకరకాల వేషధారణల వల్ల సహజసిద్ధమైన ఆకర్షణను స్త్రీ కోల్పోతున్నదని, సరియైన విద్య, పెంపకం లోపమే కారణమని అంటారు. సంస్కృతి నాజూకుతనంలో వ్యత్యాసముందని, అది స్త్రీలు గుర్తించాలని అన్నారు.


'చీరలపై వృధాఖర్చు చేయను'

తమ వేషధారణ గురించి, అలంకరణ గురించి ఇందిరాదేవి ఎక్కువగా పట్టించుకోరు. సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, ఆడంబరాలు గిట్టవు. సంస్కారం గల మామూలు స్త్రీ లాగే కనిపిస్తారు. మెడలో ముత్యాల హారం, వేలికి పెట్టే పైజా ఉంగరం, నుదుట బొట్టు, మామూలు షిఫాన్ చీరె ఇందిరాదేవి ఎప్పుడూ కనిపిస్తారు. చీరెపై వృధాగా ఖర్చు పెట్టరు. పద్ధతి ప్రకారం వస్త్రాలు కొంటారు. బజారులో కనిపించే ప్రతి కొత్తరకం చీరను కొని, దాచుకునే అలవాటు లేదు. అయితే సంవత్సరానికి మూడు జోడ్లు మాత్రం చీరలు కొంటారు. 'నాల్గైదు షిఫాన్ చీరలు, ఎనిమిది ప్రింటెండ్ చీరలు జడ్జెటు వేసుకొని కొంటాను. డబ్బు వృధాగ ఖర్చుచేసే అలవాటు లేదు." అని అంటారు. స్త్రీలు వస్త్రాలపై ఎక్కువగా డబ్బు ఖర్చు చేయవలసిన అవసరమూ లేదని చెప్తారు. ప్రతి నాలుగునెలలకోమారు సెట్టు ఏర్పడం వల్ల తనకు తృప్తి ఉంటుందని, తక్కువ వ్యయంతో ఎక్కువ ఆనందం లభిస్తుందని చీరెలను విర్వి చేసుకునే అలవాటు లేదని అన్నారు.

'5 నిమిషాల్లో రెడీ'

ఇందిరాదేవి ప్రత్యేకమైన అలంకరణేమీ చేసుకోరు. "పౌడరు, స్నో అలవాటు ఎప్పుడూ లేదు. ఎక్కువగా మేకప్ చేసుకోవడం వల్ల మన ముఖం మనదిలా కనిపించదేమో! కొత్తరకంగా ఉండదూ!... కనుబొమ్మలు స్వల్పంగా దిద్దుకుంటాను. కొంచెం లిప్‌స్టిక్ పెట్టుకుంటాను. రెడీ కావడానికి ఐదు నిముషాల టైము చాలు" అని చెప్పడం ఆశ్చర్యం వేస్తుంది. ఆమె మేకప్‌లో భారతీయత కనిపిస్తుందని ఇటీవల ఒక పత్రికా రచయిత వ్రాసిన విషయం వాస్తవం. తనకు వంట చేయడం రాదని మందస్మితంగా రాజకుమారి చెప్తారు.

పూర్వం ఇందిరాదేవి ఉత్తమ చిత్రాలు కొన్నింటిని మాత్రమే చూసేవారు. కాని ఇటీవల సెన్సారు బోర్డు సభ్యురాలుగ నియమితులైన తర్వాత ఆమె ప్రతి చిత్రాన్ని చూడవలసి వస్తున్నది. సినిమాలు ప్రధానంగా వినోదాన్ని, ఆ తరువాతే విజ్ఞానాన్ని కలిగించాలని చెప్పారు. ఉత్తమ అభిరుచులతో చిత్రాలు రావాలనీ, ప్రేక్షకులను ప్రేరేపించేవిగా ఉండరాదని ఆమె అన్నారు. ఈనాడు చిత్రాల్లో కళ కనిపించడం లేదనీ, కాగా కథా దారిద్ర్యం మాత్రం కనిపిస్తున్నదని అన్నారు. బాలరాజ సహానీ, సాధన, వైజయంతిమాల వంటి తారలు ఆమెకు నచ్చుతారు. ●





తెల్లారకట్ట పాలవాడి కేకతో మూర్తికి నిద్ర మెళకువ వచ్చింది. పద్మావతి తలుపు తెరచి పాల వాడు గేదెని పిండటం గమనిస్తున్నది గుమ్మంలో నిలబడి. మంచంమీద పడుకొనేవున్న మూర్తికి గుమ్మంలో పాలవాడు పాలు పిండటం, ఎదురింటి వాళ్ళింటి ముందప్పుడే కళ్ళాపి చల్లుతూండటం కనిపిస్తున్నాయి.

"పద్మా! ఎదురింటివాళ్ళివ్వాళ అప్పుడే లేచారేం" అన్నాడు మూర్తి. ఎదురింటివారేనాడూ ఏడు గొంది తలుపులు తెరవక పోవటం వల్ల ఆశ్చర్య పడుతూ.

"ఇవ్వాళ వైకుంఠేకాదశి కాదుటండీ అందు కని సత్యనారాయణ స్వామి వ్రతం కూడా చేసుకుం టారట. చుట్టాలు పక్కాలూ రారూ అందుకే తెల్లారకట్ట లేచారివ్వాళ." అంటూ పాలగిన్నె తీసుకొని వంటింట్లో కెళ్ళింది పద్మ.

"అవును ఇవ్వాళ వైకుంఠేకాదశి. నేనూ ఏకాదశి ఉపవాసం ... సత్యనారాయణస్వామి వ్రతం చేసు కుంటే?" ... చన వచ్చిన మరుక్షణం ప్రక్కమీద లేచి కూర్చున్నాడు.

"అదేమిటి అప్పుడే లేచేశారు? కాఫీ తయారు కావటానికి ఇంకా ఆలస్యం ఉంది. పడుకోండి" అన్నది పద్మ.

"పద్మా మనం ఏకాదశి ఉపవాసం ఉండి, వ్రతం చేద్దాం—ఏమంటావు? " అన్నాడు మూర్తి.

"నిజంగా ?" సంతోషంతో మూర్తి వంక చూసింది మంచ మెత్తుతున్న పద్మ.

"అవును" అంటూ మూర్తి కాలకృత్యాలు తీర్చు కొని ముఖం కడిగేసి దేవుడి పటం ముందు నిల బడి "ఇవ్వాళ వ్రతం చేసుకుంటాము" అని దణ్ణం పెట్టుకున్నాడు.

"ఇవాళ ఏమీ తినరాదు. తాగరాదు. సాయంకాలం పూజయ్యాక ప్రసాదం కొద్దిగాస్వీకరించాలి "అన్నాడు మూర్తి.

"నాకు తెలీదుటండీ చెప్పాలా?...... అయితే నాకు చాలా తీరుబడి! కాఫీ వంటా హడావిడి ఏమీ లేదు. మీరూ, అన్నట్లు ఆఫీసుకు వెళ్ల రుగా. ఉపవాసం ఉండి ఏమెళ్తారూ?" అంటూ వంటింట్లోకి ఏదో పనిమీద వెళ్లింది పద్మ.

మూర్తి ఆలోచనలో పడ్డాడు.

ఆఫీసు ! హెడ్‌క్లర్కు! ఆఫీసుకు వెళ్లక పోవటమే! శలవు పెడితే తనని బ్రతక నిస్తాడూ! మరి పద్మ అన్నట్లు ఉపవాసం ఉండి ఆఫీసుకువెళ్తే ఏం పని చేయగలడు? తనకా సీట్లో కూర్చుంటే తలొంచుకు ఫైల్సు రాస్తూ పోవటమే అలవాటు కానీ చేసి నట్లు నటిస్తూ గంటల తరబడి ఒకే ఫైలుతో కాలక్షేపం చేయటం చేతకాదు. తిండిలేక నీర సించి పని చేయలేని పరిస్థితిలో ఆఫీసుకొచ్చి పని చేసినట్టు నటించటం చాల పెద్ద నేరం. అంత కంటె శలవు తీసుకొని ఇంటిదగ్గర వుండిపోవటం తప్పుకాదు. కాని శలవు ఏమని పెట్టాలి. వ్రతం చేసుకోవాలని శలవుపెడితే లాభం లేదు. కాజ్యువల్ లీవు ఒక్క అనారోగ్య కారణంగానే ఇంటి వద్ద వుండి వాడుకోవచ్చుగాని మిగతావాటికి ముందే తీసుకోవాలని ఉత్తరువు.

కాగితం తీసుకున్న మూర్తి "వంట్లో బాగో లేని కారణంగా ఆఫీసుకు రాలేక పోతున్నాను. అని వ్రాయ బోయి హఠాత్తుగా ఆగాడు. సత్యనారా యణస్వామి వ్రతం చేసుకోవాలని అసత్యం ఆడి శెలవ పెట్టటమా, ఛా! అలా ఎన్నటికి చెయ్యరాదు.

అలా చేస్తే అది అసత్యనారాయణ వ్రతం అవుతుంది. ఒక్క శెలవ విషయమేకాదు. తాను కనీసం ఆ ఒక్క రోజైనా ఎలాంటి ఎంత చిన్న అబద్ధమైనా సరే ఆడరాడని గట్టిగా నిర్ణయానికి వచ్చాడు. ఆఫీసుకు వెళ్ళి పని చేయాల్సిందే. అంత చేయలేక పోతే అప్పుడే అడిగి సగం రోజు శెలవు పెడితే సరిపోతుందని అనుకున్నాడు.

"ఇల్లంతా శుభ్రంగా కడిగించి ముగ్గేసి ఉంచు. సాయంత్రం వస్తూ వస్తూ బజారుకు పోయి కావలసిన పూజ సామాను పట్టుకొస్తాను. పురోహితుడిక్కూడా చెప్పొస్తాను." అంటూ ఆఫీసుకు కదలబోతున్న మూర్తి దగ్గరకొచ్చిన పద్మ..

"ఏమండీ నాకో పదిరూపాయలు కావాలి. ప్రక్కింటావిడ అదేవో లాటరీ టిక్కెట్లు ఇచ్చింది. డబ్బివ్వాలిస్తానన్నాను", అని అడిగింది.

పద్మకి ఇలాంటి లాటరీ టిక్కెట్ల పిచ్చి చాలా ఉంది. దగ్గర పైకం ఉన్నదని తెలిస్తే ఇచ్చిందాకా వెళ్ళనివ్వని స్వభావం పద్మది. అందుకే ఈ మధ్య మూర్తి తరచుగా డబ్బులున్నా, నాదగ్గ ర్లేవు. ఆ టిక్కెట్లు తిరిగిచ్చేయ్యమని చెప్పి వెళ్ళుతుండేవాడు. డబ్బుల్లేవు నాదగ్గర అని అందామని నాలుకదాకా వచ్చిన మాటను ఆపుకున్నాడు మూర్తి, వ్రతం సంగతి జ్ఞాపకం వచ్చి.

"పద్మా! ఇవ్వాళ వ్రతం చేసుకుందామనుకున్నాం. నాదగ్గర ఉన్నవే పది రూపాయలు. అవి టిక్కెట్లకిస్తే ఎలాగు చెప్పు" అన్నాడు.

"ఆమెకి మాటిచ్చాను. ఆమె వూరుకోదు. అదృష్టం తిరిగితే మంచి బహుమతే వస్తుంది. ఏమైనా సరే ఇవ్వాలి ఆమెకి" అన్నది పద్మ.

"మరి వ్రతమో" అన్నాడు మూర్తి.

"మరీ తమాషాగాని పదిరూపాయలు పుట్టించలేరా ఏంటి?" "అంటూ మూతి ముడుచుకున్నది పద్మ.

ఆనాడు సంతోషంగా వ్రతం చేసుకోవాలనుకున్న మూర్తి, పద్మ ఇక రోజంతా ముడుచుకొని ఉండే అలవాటు కాబట్టి, ఉన్న పది రూపాయలు ఆమెకిచ్చి ఆఫీసు కెళ్ళాడు.

"ఆ ఫైలు మీ సీటుకొచ్చి పదిరోజులైందిట. రాలేదని డబాయించకండి."

"ఎవడన్నాడయ్యా—ఏదీ నాటేబిల్ మీద?"

"క్రింద గుమాస్తా మూర్తి చెప్పాడు."

వచ్చిన ఆసామీ ఈ మాటవేసరికీ హెడ్ గుమాస్తా మూర్తి వంక ఉరిమి చూసి "ఎప్పుడయ్యా నాకు పంపింది. పైగా అబద్ధాలు చెబుతావా? వెంటనే 'ఆ కాగితాలు తెచ్చి నాముందుంచకపోయావో నీపని చెబుతా" అన్నాడు.

మూర్తికి పై ప్రాణాలు పైనే పోయాయి.

"ఉండండి మీతో ఘర్షణెందుకు. ఇక్కడంటె అక్కడ, అక్కడంటె ఇక్కడా అని ఆడిస్తున్నారు" అంటూ ఆ వచ్చిన పెద్దమనిషి ఆఫీసర్ గదిలోకి దూసుకు పోయాడు.

వెంటనే ప్యూన్ వచ్చి ఆఫీసరుగారు పిలుస్తున్నాడని చెప్పాడు మూర్తికి.

మూర్తి వణుకుతూ ఆఫీసర్ గదిలోకి వెళ్ళాడు.

"మూర్తీ !ఏమైందా ఫైలు. ఎందుకు పంపలేదు. ?" గద్దించాడు ఆఫీసర్. మూర్తి, తెలిసిన సంగతి దాచటం అబద్ధం చెప్పటం అనుకున్నాడు.

"హెడ్ గుమాస్తాగారి కిచ్చానండి వారం రోజుల క్రితం" అన్నాడు వణుకుతూ మూర్తి.

"ఆయన లేదంటున్నాడు. నిజం చెప్పు, ఎక్కడ దాచావు."

"నేను కాదండి దాచింది." మూర్తి గొంతు వణికింది.

"మరి దాచిందెవరు? హెడ్‌గుమాస్తానా?ఎక్కడ దాచాడు?" మూర్తికి చిరు చెమటలు పోశాయి. హెడ్ గుమాస్తా ఆ ఫైలు తన ముందటే తన సొరుగులో పెట్టి తాళం వేశాడు. పైగా అనాడు "మూర్తీ నాలుగు డబ్బులొచ్చే కేసు. ఆఫీసరు తెలుసుకదా అని ప్రతి దఫా ఈయన మన చాత పూరికే చాకిరీ చేయించు కుంటున్నాడు. ఈ తడవ నువు అలా ఉండు. కాగితాలు ఎక్కడో ఉన్నై అని చెప్పు— నేనో ఆట ఆడిస్తాను" అన్నాడు హెడ్ గుమాస్తా.

మామూలుగా అయితే హెడ్ గుమాస్తా మాట పాటించేవాడే. ఇవాళ అబద్ధం చెప్పరాదని నిర్ణయించుకోవడం వల్ల ఆ ఫైలు హెడ్ గుమాస్తాకిచ్చానని చెప్పేశాడు మూర్తి. ఇప్పుడది ఎక్కడుందో కూడా తెలుసు. ఆసంగతి తానుచెబితే హెడ్‌గుమాస్తా తనగొంతు పిసికి పారేస్తాడు. మరి తెలిదని చెప్పటమా. ఎదురుగ్గా అప్పుడే హెడ్ గుమాస్తా కూడా వచ్చి నిలబడ్డాడు.

"మాట్లాడవేం?" మళ్ళీ గర్జించాడు ఆఫీసర్.

"అది అది హెడ్ గుమాస్తా గారి సొరుగులో ఉన్నది." అనేశాడు మూర్తి.

ఆఫీసరు స్వయంగా బైటికొచ్చి హెడ్‌గుమాస్తా చేత సొరుగు తాళం తీయించాడు. కాగితాలు బైట పడ్డై.

వినయంగా ఆఫీసరు వంక నవ్వాడు హెడ్ గుమాస్తా. మూర్తి వంక నిప్పులు చెరిగే చూపులో చూస్తూ—

"లక్ష కాగితాలొస్తై నా టేబిల్ మీదికి. అతిముఖ్యం అని సొరుగులో దాచాను నీముందే. మర్చాడు జ్ఞాపకం చెయ్యమన్నా—అలా చెయ్యక పోగా, ఇందాక నాకే కాస్తంత జ్ఞాపకం చేసి ఏడవరాదూ?" అని నోరు బారేసుకున్నాడు.

అప్పటికి పన్నెండైంది. హెడ్‌క్లర్కుకు,మూర్తిని ముక్కలు చేద్దామని పిస్తున్నది. అతని పని తణిఖీ ప్రారంభించాడు.. అది చెయ్యలేదు ఇది చెయ్యలేదంటూ అరగంట అవస్త పెట్టాడు. సత్యనారాయణ వ్రతం చేసుకోవాలని ఉపవాసం ఉండి నీరసంగా పని చెయ్యలేక పోయానని మూర్తి ఇచ్చిన సమాధానంతో మరీ మండిపడ్డాడు.

"డ్యూటీతో సమానమైన దేముడు లేదు. తన విద్యుక్త ధర్మాన్ని మరచిన వాణ్ణి దేవుడు క్షమించడు............"

"వెధవ వేషాలు మాని పని చెయ్".

"స్టేట్ మెంట్ సంగతి ఏంచేశావ్?"చుర చుర చూశాడు హెడ్ గుమాస్తా

"ఇంకా కాలేదనీ, నిన్నే తమరికి".... భయంతో మూర్తి గొంతు వణికి పైకి రాలేదు.

అవేం సాగవు. వెధవ్వేషాలెయ్యకు నాదగ్గర. ఇప్పుడు పన్నెండున్నరైంది. రెండున్నర కల్లా టైప్ చేయించి నాటేబిల్ దగ్గరికి పట్టుకురా. కదల్టానికి వీల్లేదు. వింటున్నావా?

"మంచిదండి అలాగే"..

హెడ్ క్లర్కు రామనాధం విసురుగా వెళ్ళి తన కుర్చీలో కూర్చున్నాడు.

మూర్తి మనస్సు అల్లకల్లోలంగా ఉంది. ఏ పని చెయ్యాలో తోచటం లేదు. అన్నీ అర్జంటే. అన్నీ అర్ధ గంట గంటలో అయిపోవాలి. రామనాధం గారు ఇంతగా ఈరోజు రెచ్చి పోవడానికి కారణం తానా "కేసు" అతగాడి సొరుగులో ఉందని చెప్పటమే. అదే ఇన్ని అనర్ధాలకు దారి తీసింది.

ప్రక్కసీట్లో ఉన్న గుమాస్తాలందరూ తనవంక సానుభూతిగా చూస్తున్నారు. శంకరం వచ్చి మూర్తికి కాస్త సాయం చేయ బోయాడు.

ఒంటిగంట లోపల స్టేట్‌మెంటు తయారు చేసి టైపిస్టు సరోజ సీటు దగ్గరకు పరుగెత్తాడు మూర్తి. సరిగ్గా అప్పుడే సీట్లోంచి లేచిపోబోతున్నది సరోజ.

"ఏమండీ దయచేసి ఇది అర్జంటుపని. కాస్త శ్రమనక రెండున్నరకల్లా కావాలి" ప్రాధేయపడ్డాడు.

"స్టేట్‌మెంటు టైపు చెయ్యడం కాస్త ఆలస్యం పడుతుందండీ మూర్తిగారూ. ఇవ్వాళ మాయింట్లో సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నారు మా అమ్మా నాన్నా. నేను ఇంటికి వెళ్తున్నా భోజనానికి. కాస్త ఆలశ్యంగా కూడా రావచ్చు ఏలా చెప్పండి?

"నా ఉద్యోగంపోయేలా ఉందండీ సరోజగారూ. ఈ హెడ్‌క్లర్కు రామనాధం నా ప్రాణం తీస్తున్నాడు. ఇవాళ ఉపవాసం ఉండి ఆఫీసుకొచ్చాను దయచేసి ఏలాగైనా...?"

"మూర్తిగారూ— మీ మాటెప్పుడన్నా కాదు అన్నానా? వ్రతం పూర్తికాగానే భోజనం త్వరగా ముగించుకొస్తా. ఏలా చెప్పండి. వ్రతంకదూ?"

సందిగ్ధావస్థలో పడ్డాడు మూర్తి. ఏమీ అనలేకపోయాడు."

"సరే వీలైనంత త్వరగారండి. సరోజగారూ. పోనీ నేను భోజనానికి వెళ్లటం లేదు కాబట్టి నేనే టైపు చేసుకుంటాను. మీకు అభ్యంతరం లేకపోతే.

"సరే కానివ్వండి. అవిగో కార్బన్సు, కాగితాలూ. తాళం చెవి ఇదిగో." అని కదలబోయే సరోజను తలొంచుకొనే "సరోజగారూ" అంటూ సంబోధించాడు మూర్తి. ఏమి టన్నట్టు ఆగింది సరోజ.

"మీరేమీ అనుకోకుండా ఉంటే— సాయంత్రము సత్యనారాయణవ్రతం చేసుకుందామనుకున్నాము— వో పదిరూపాయలు అప్పుగా— మళ్ళీ జీతంరోజు ఇచ్చేస్తా."

"అంతేకదా, ఆలాగేనండీ దీంట్లో అనుకోటం ఏవుందీ. వచ్చేటప్పుడు పట్టుకొస్తా, ఇప్పుడు దగ్గర్లేదు. చూడండి రామనాధం అడిగితే ఇప్పుడే బైటికి వెళ్ళిందని చెప్పండి."అంటూ సరోజ వెళ్ళింది.

రెండున్నరదాకా మూర్తి టైపు చేస్తూనే ఉండిపోయాడు. ఇంకా టైపు చెయ్యవలసింది

ఉన్నది. మనిషి చాలా నీరసంగా ఉన్నాడు. రామనాథం పిలుస్తాడన్న భయం ఎక్కువైంది. ఆ తొందరలో తప్పులెక్కడ పడతయ్యో అని చాలా జాగ్రత్తపడుతున్నాడు. మూడు కావస్తున్నది. రామనాథం మూర్తిని వెతుక్కుంటూ వచ్చాడు.

"నువ్వెందుకు టైపు చేస్తున్నావు? సరోజ ఏమైంది?"

"సరోజ ఇప్పుడే బైటికి వెళ్ళింది" అనబోయి మూర్తి అబద్ధం ఆడలేక ఆగిపోయాడు. "మాట్లాడవేం?" అని గద్దించాడు రామనాథం.

"సరోజ......... సరోజ— ఇంటికి......"

"ఎన్నింటి కెళ్ళింది?........."

"ఒంటి గంటకు" బాధగా చెప్పాడు మూర్తి.

రామనాథానికి పట్టరాని కోప మొచ్చింది.

"సిగ్గులేకపోతే సరి. సరోజ పనంతా నువ్వు చేస్తూ ఆవిణ్ణి ఇంటికి పంపావన్నమాట! ఈ వేషా లెప్పణ్ణించీ సాగించావు? ఇహ నువ్వు ఆఫీసులో ఉన్నట్టే?"

"రామనాథంగారూ....... ఆవిడ"

"ఆవిడకి నౌకరీ చేస్తున్నావా? ఆ స్టేటుమెంటు పూర్తిచేసి తీసుకురా. సరోజని రానీ చెస్తా, మూడు దాటుతున్నది ఇప్పుడు" అంటూ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్ళాడు రామనాథం.

వో పావుగంటలో టైపు పూర్తిచేసి స్టేటుమెంటు రామనాథంగారి టేబిల్ మీదికి చేర్చాడు మూర్తి. రామనాథం సీట్లోలేడు.

తన కుర్చీలో కూలబడి ఫైలు చూస్తున్న మూర్తి దగ్గర కొచ్చింది, సరోజ కోపంగా.

సత్యనారాయణ వ్రతం

"ఏమండీ ఆయనచేత నన్ను నానామాటలూ అనిపించారట! "ఆ స్టేటుమెంట్" మిమ్మల్ని నేను టైపు చెయ్యమన్నానా? మీకై మీరు చేసుకుంటానం టే సరేనన్నాను. ఆ మాట ఆయనతో చెప్పటానికి నోరు లేకపోయిందాండీ. అందర్లో ఆయన అలా అరుస్తూవుంటే— తాళం చెవి ఇలా ఇవ్వండి. అంటూ మూర్తి ఇచ్చిన తాళం చెవి తీసుకుని వెళ్ళబోతున్న సరోజని అప్పుడే ఆఫీసరు దగ్గరనుంచి వస్తున్న రామనాథం "సరోజా" అని పిలిచాడు.


సరోజని ఇంకా ఏమంటాడో తన మూలంగా ఇంకా ఏం మాటలు పడుతుందో అనేభయంతో, తానే ఆ కాగితాలు టైపు చేసుకుంటానని అన్న సంగతి చెప్పటానికి మూర్తి కూడా రామనాథం గారి టేబిల్ దగ్గరకు వెళ్ళాడు.

"నువ్వెందుకయ్యా — వెళ్ళి పని చూసుకో ఫో" అని రామనాథం గదమాయించాడు. తలొంచుకొని వచ్చి కుర్చీలో కూలబడ్డాడు మూర్తి.

"సరోజా నిలబడ్డావేం కూర్చో" అన్నాడు రామనాథం.

సరోజ కోపంగా "అక్కర్లేదులెండి ......" నిలబడే వుంది

"చెప్పాకే, నే కాదంటానా? పోనీలే ఏం విశేషం ఇవాళ?" అనునయింపుగా అడిగాడు రామనాథం.



మూర్తి తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు. రామనాథంలో ఇంత మంచితనం ఉందా అని మూర్తి ఆశ్చర్యపోయి గుడ్లప్పగిస్తూ చూస్తున్నాడు.

"ఇవ్వాళ మాయింట్లో వ్రతం అండీ" నాజూగ్గా మెడతిప్పుతూ అన్నది సరోజ.

"చెప్పావు కాదూ? సెలవు పెట్టకపోయావా? వెధవపన్లు రోజూ ఉండేవేగా" అన్నాడు రామనాథం.

"ఆ ఎందుకనీ......" అర్థోక్తిలో ఆగిపోయింది.

రామనాథం ఎగతాళిగా మూర్తివంక వోసారి చూసి "సరే వెళ్ళి పనిచూసుకో సరోజా." అన్నాడు.

మూర్తి తల దించేసుకున్నాడు.

సరోజ మూర్తి దగ్గరకొచ్చి నిలబడ్డది. తల వంచుకొనే మూర్తి "ఏమిటి?" అన్నాడు.

"పది రూపాయలూ అడిగారుగ" అంటూ ఇవ్వబోయింది.

"అక్కర్లేదు" అన్నాడు మూర్తి సరోజవంక కోపంగా చూస్తూ.

మూతి ముడుచుకుంటూ పోయింది సరోజ.

సరోజకూడా తనంటే అంత చులకన! ఊ! రామనాథం తనని ఏమీ అనలేదని తెలిసి కూడా తన దగ్గర మొదట్లో ఎంత కఠినంగా మాట్లాడింది సరోజ. డబ్బు అడగటం నిజంగా నాదే తప్పు.' అనుకున్నాడు మూర్తి.

"ఏమిటయ్యా ఆ ఫైలులో సత్యనారాయణ వ్రతం అని వ్రాశావు. నీకేమన్నా మతిపోతోందా, ఏం? ఊ జాగ్రత్త....... రేపటికల్లా టేబిల్ మీద ఉన్న కాగితాలన్నీ సర్ది చక్కగా ఉంచు. పనిలో జాప్యం వుండరాదు జాగ్రత్త. ముందుగానే చెబుతున్నా. ఆఫీసరుగారు రేపు నీపని తనిఖీ చేస్తారట. మరి ఆలోచించుకో." అంటూ రామనాథంగారు గొడుగు బట్టకు వెళ్తూ వెళ్తూ మూర్తి టైపు చేసిన కాగితాలకట్ట సత్యనారాయణవ్రతం అని వ్రాసిన ఫైలు అతడి టేబిల్‌మీద విసిరి కొట్టి వెళ్ళాడు.

"ఆయనకి ఒక్కతే కూతురు. ఈ లంచాలు తీసుకోటం అంతా ఆవిడ కోసరమే— అల్లుడు గారింట్లో సాయంకాలం వ్రతంట. అందుకే ఆయన మూడున్నరకే ఆఫీసు వదిలి వెళ్తున్నారు." ప్రక్క క్లర్కు చెవిలో వూదాడు. వెళ్తున్న రామనాథం వంక ముందున్న కాగితాల వంక ఆశ్చర్యంగా చూస్తున్న మూర్తిని చేతులో వూపుతూ.

సాయంకాలం గుమాస్తాలందరూ బయల్దేరుతున్నారిళ్లకు. మూర్తి తన టేబిల్‌మీద ఉన్న కొన్ని కాగితాలని ఒక కట్టలో సర్ది మరో ఫైలు కనపడక పోతే అలమారాలో వెతుకుతున్నాడు. సరోజ అక్కడి కొచ్చింది. మూర్తి అటు తిరిగి నిలబడి ఉన్నాడు. సరోజ నవ్వుకుంది. "పాపం పదిరూపాయలు అడిగాడు, వ్రతం చేసుకుందామని అడిగాడు. తనన్న మాటకి కోపం వచ్చి వద్దన్నాడు." అనుకుంటూ నిలబడి ఉంది సరోజ.

ప్రక్క గుమాస్తా వెళ్తూ వెళ్తూ "వస్తాను మూర్తి, ఆ కట్టలన్నీ ఇంటికే!— రాత్రి నిద్ర పోవాయేం?" అన్నాడు.



సత్యనారాయణ వ్రతం

"చేస్తారా. ఎప్పుడో హెచ్చుదు చెయ్యాల్సిందేగా."

"ఆ రెండు కట్టలూ ఇంటికి తీసుకెళ్తున్నా" అలవాటుతో ఫైలు వెతుకుతూనే అన్నాడు, మూర్తి వెనక్కి చూడకుండా.

సరోజ ఏదో చిన్నకాగితంతో పదిరూపాయలు చుట్టి, ఇంటికి తీసుకువెళ్ళే కాగితాల మీద పెట్టి వెళ్ళిపోయింది.

మూర్తి ఫైలు వెతికితెచ్చి సరోజ ఉత్తరం గమనించకుండా తొందరలో దానిమీదే ఆ తెచ్చిన కాగితాలు పడేసి కట్ట కట్టుకొని చంకన పెట్టు క్కుదిలాడు ఇంటికి.

కాఫీద్చుకుంటూ ఇంటి కొచ్చిన మూర్తి ఆ కాగితాల కట్టల్ని విసుగుతో మేజా బల్లమీద విసురుగా పడేసి బట్టలు మార్చుకోడానికి అవతల గదిలోకి వెళ్ళాడు.

"అదేమిటండీ అలా విసరికొట్టారూ?" అంటూ చిందరవందరగా పడ్డ కాగితాల్ని సర్దుతున్న మూర్తి భార్యకి, సరోజ ఉత్తరం, అందులో పెట్టిన పది రూపాయిలనోటు కనబడ్డాయి. పద్మ, సరోజ వ్రాసిన ఉత్తరాన్ని చదువుకున్నది.

"మూర్తిగారూ. అబ్బ మరీ అంత కోపం దేనికండీ. నేనేమన్నాననీ? రావటం కాస్త ఆలస్యం అయింది. నిజమే. ఏం చెయ్యను. ఇంటి దగ్గర మావాళ్ళు ఆపారు. ఇంతలో ఇంత అల్లరై పోతుందని అనుకోలేదు. ఆ పళ్ళకోతి విశాలాక్షి ఏదేదో చెప్పేసరికి నాకూ వళ్ళు తెలిలేదు. మన్నించరూ? ఇదిగో పదిరూపాయిలు తీసుకోండి మీరొద్దంటే నే నెంత బాధపడ్తానో తెలుసా? మళ్ళీ నా మొహాన కొట్టకండి ఏమనుకోవద్దూ!

మీ

"సరోజ."

"ఇళ్ళు కడిగించి ముగ్గులేయించావు. బాగానే వుంది కాని ఏంలాభం వ్రతం చేసుకోటానికి డబ్బు లేదు, పురోహితుడిక్కూడా చెప్పలేదు పద్మా— ఇవ్వాళ ఆఫీసులో తీరిక లేకపోయింది" అంటూ తడికాళ్ళు తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు మూర్తి.

"అవును పాపం తీరికెలా వుంటుంది ఆఫీసులో ప్రేమలేఖలు వ్రాసుకోడంతోనే సరిపోయె. ఇక ఇల్లు, వ్రతం, నేనూ జ్ఞాపకం ఉంటామా" మింగే కోపంతో చూసింది మూర్తిని పద్మ.

"ఏమిటి పద్మా నువ్వనేది?" ఆశ్చర్యపోతూ చూచాడు మూర్తి.

"వ్రతం చేస్తారట వ్రతం. సత్యనారాయణ వ్రతమా? సరోజవ్రతమా మీరు చేసేది?"

"సరోజవ్రతం ఏమిటి పద్మా" మళ్ళీ ఆశ్చర్య పోయాడు మూర్తి.

"చెప్పండి ఎన్నాళ్ళనుంచి ఈ భాగోతం! ఎవతది? ఆఫీసుకుపోయి మీరిదా చేసేది? దాని పదిరూపాయలు అడగాల్సిన అవసరం మీకే మొచ్చింది? ఈ ఉత్తరం ఏమిటి? దీనర్థం ఏమిటి?" అంటూ సరోజ ఉత్తరం పదిరూపాయిలనోటు మూర్తి ముందు పడేసింది పద్మ.

ఉత్తరం చూసుకున్న మూర్తి నిర్ఘాంతపోయాడు. ఉన్న విషయం చెప్పాలని మూర్తి ప్రయత్నించాడు. కాని పద్మ వినిపించుకునే ధోరణిలో లేదు.

"నన్నిరకంగా అన్యాయం చేస్తారనుకోలేదు. మధ్యన, నాపీడ ఎందుకు మీకూ, రేపే నా పుట్టింటికి పంపించెయ్యండి. చక్కగా ఆ సరోజా మీరూ కులకొచ్చు" పమిట చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ బర్రున ఏడ్చింది పద్మ.

ఆనాడు వ్రతం చేసుకుందామని సత్యనారాయణస్వామి వారి పెద్ద పటం బాగా తుడిచి బల్ల మీద గోడకానించింది పద్మ. తెల్లబోయిచూశాడు మూర్తి ఆపటం వంక.

మూర్తికి ఏం చెయ్యాలో బోధ పడలేదు. పద్మ చకచకా లేచి వెళ్ళి వంటింట్లో చాపేసుకు పడుకుంది అలిగి.

సరోజ ఇచ్చిన పదిరూపాయిలు, ఆ ఉత్తరమూ మర్నాడు తిరిగివ్వటానికి నిర్ణయించుకొని వాటిని వంకెనున్న చొక్కా జేబులో భద్రపరచాడు మూర్తి.

స్వామివారి పటానికి ఎదురుగ్గా కుర్చీలో కూర్చొని బల్లమీద ఉన్న ఫైల్సు వ్రాయటం ప్రారంభించాడు.

ఎదురింటిలో సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా జరుగుతున్నది. రామనాథంగారి గొంతు విని ఉలిక్కి పడ్డాడు మూర్తి "అతగాడి అల్లుడు తనకెదురింట్లోనే కాపురం ఉన్నాడా?!" అనుకొని వాకిట్లోకి లేచి వెళ్ళాడు.

ఎదురింట్లో రామనాథంగారు భార్యా సమేతులై అల్లుడూ కూతురుతో సహా పట్టు పీతాంబరాలు ధరించి పీటల మీద కూర్చొని వ్రతం చేస్తున్నారు. విద్యుద్దీప కాంతుల్తో అలంకరింపబడ్డ స్వామి మందిరం మెరిసిపోతున్నది.

"వ్రతం చేసుకుంటున్న ఇంటికి పిలవకపోయినా ఫరవాలేదు. వెళ్ళి దేవుణ్ణి దర్శించుకొని తీర్థ మైనా పుచ్చుకు రావాలన్నారు పెద్దలు. స్వామి ప్రసాదమహాత్మ్యం గొప్పది." అనుకొని మూర్తి

ఎదురింటిలోకి వెళ్ళి జనంతో కూర్చున్నాడు నెమ్మదిగా.

వ్రతసమాప్తి అయింది. అక్షింతలు వేసి నమస్కారం చేశాడు. ప్రసాదం తీసుకొని రాబో తున్న మూర్తిని రామనాథం చూడటం జరిగింది.

"మూర్తీ నువ్వు ఉండేది ఎక్కడా?" అన్నాడు రామనాథం.

"ఎదురింట్లో నండీ" సవినయంగా సమాధానం చెప్పాడు మూర్తి.

"మరి సత్యనారాయణ వ్రతం చేసుకుంటానని వ్వాళ అంటూ ఆఫీసులో అంత నీరసపడిపోయావు పని చేయకుండా?"

మూర్తి తల దించేసు కున్నాడు.

"ఇంత వచ్చి అబద్ధం చెబుతావయ్యా మూర్తీ! అందులో సత్యనారాయణస్వామి పేరు చెప్పి! ఛీ! ఏం బుద్ధయ్యా!" అంటూ తన పెద్దరికానికి తగినట్టుగా మందలించాడు మూర్తిని రామనాథం.

మూర్తికి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది. గబ గబా వచ్చి తలుపు తట్టాడు. మరిరెండుసార్లు తలుపు కొట్టింతరవాత గాని భార్య లేచివచ్చి తలుపు తెరవ లేదు

పన్మతన వంక చూడకుండా తల తిప్పేసుకొని వెళ్ళి పడుకుంది. గోడ గడియారం పదకొండు కొట్టింది.

'తాను సత్యనారాయణ వ్రతం చేసుకుంటానని ఆఫీసులో అబద్ధం చెప్పాట్ట! రామనాథం నలుగురిలో తనని మందలించాడు. ఇల్లాంటి అబద్ధాలు చెప్పరాదని బుద్ధి చెప్పాడు. అవును! తాను వ్రతం చెయ్యలేదుగా! అతి వైభవంగా బంధు మిత్రులతో సహా కూర్చొని స్వామి నలంకరించి పూజ చెయ్యలేదు. !

"నిజమే!" అనుకున్న మూర్తికి దుఃఖం పొర్లు కొచ్చింది.!

"అయితే పొద్దుట్నుంచీ తాను చేసిందేమిటి? ఆ ఒక్కనాడైనా అబద్ధం చెప్పకుండా ఉండాలన్న పట్టుదలతో ఇంటా బైటా అందరిచేత అవమానింప బడ్డాడే! తాను ఆనాడు చేసింది సత్యనారాయణ వ్రతం కాదా? అది సత్య వ్రతం అని లోకం ఎందుకర్థం చేసుకోదు? తనని పైగా వ్రతం పేరు చెప్పి అబద్ధమాడే వగాకోరుగా లోకం ఎందుకు చిత్రిస్తున్నది.?"

ఈ ప్రశ్నలకు సమాధానం దొరక్క బుర్రతిరిగి పోగా, టేబిల్ మీద తలవాల్చి పనీ రు కారుస్తూ పడిపోయిన మూర్తి వంక, తృప్తిగా చిరునవ్వుతో ఎదుటి పటంలో ఉన్న సత్యనారాయణస్వామి చూస్తున్నాడు.!

ఎందుకా చిరునవ్వు? ఎందుకాతృప్తి? ఎవ రింట్లో నిజంగా ఈనాడు సత్యనారాయణ వ్రతం జరిగింది.? ఎవరి మనస్సులో నిండుగా ఆ సత్యనారాయణమూర్తి నిలిచి ఉన్నాడు?

ఈ ప్రశ్నలకు సమాధానం మాత్రం అందరికీ తెలుసు. ●



సుప్రభాతం

(సీరియల్)

రంగధామ్

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలాకాలానికి అనుకోకుండా కలిశారు. సత్యమూర్తి ప్రకాశం సుగర్ ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా చేరాడు. ఆ చుట్టుప్రక్కల ప్రకాశానికి ఎక్కువ పలుకుబడి వున్నట్టు గ్రహించాడు సత్యమూర్తి. ప్రకాశం, రామదాసుకు సంబంధించిన జాడ తెలియని ఒక అమ్మాయికోసం వెదుకుతున్నాడు. ఆమెను వశపరచుకుంటే కావలసినంత ఆస్తి దక్కుతుంది. ఆ అమ్మాయి భానుమతి. దామోదరం భానుమతిని మంచిచేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. సత్యమూర్తి, భానుమతి పరస్పరం ఆకర్షించుకున్నారు. జగ్గారావు స్థాపించిన మహిళాభ్యుదయ సంస్థమీద మోజు కనబరచింది భానుమతి.

17

ఆమరునాడు భానుమతి రాలేకపోయింది గాని మూడోనాడు ఆయనే కారు వేసుకుని భానుమతి ఇంటికివెళ్ళి, ఆమెని ప్రత్యేకంగా తన యింటికి తీసుకు వచ్చారు. ఆయన ముఖ్యంగా మాట్లాడే విషయాలు, తాము స్థాపించబోయే మహిళాసంస్థ, అందులో భానుమతీ, మాలతీలు నిర్వహించవలసిన విషయాలు, అప్పుడప్పుడు దామోదరం మంచితనాన్ని పొగిడేవాడు. ఎప్పుడైనా అనంతరావుగారి ప్రసక్తివస్తే, ఆయన గురించి ఎంతో నిరసనగా మాట్లాడేవాడు. ఇవన్నీ భానుమతికి సహించరానివైనా, జగ్గారావుగారు చూపిస్తున్న అవ్యాజాభిమానమూ, వారికుటుంబం అంతా, ఔనర్జీతో సహా తనకిచ్చే గౌరవమర్యాదలూ, వారింటికి వచ్చే వివిధ వ్యక్తులతో పరిచయమూ ఆమెని ఆ యింటికి తరుచూవచ్చేట్లు చేశాయి. అలా తమకు పనున్న వ్యక్తులనాకర్షించడం వారికి బాగా తెలిసిన విద్యేమోననిపించేది.

దామోదరం మనియార్డరు విషయంతో అలా మాట్లాడడం మళ్ళీ ఆమెలోనిఅనుమానాలు రేపింది. ఒకవేళ దామోదరమే మనియార్డరు పంపుతున్నాడేమో? లేకపోతే అంత ధైర్యంగాఎందుకలా చెప్తాడు? అసలు తనను చూడగానే మనియార్డరు విషయం ఆమెకు తెలిసిపోయిందని తను అబద్ధమాడినందుకు సిగ్గుపడతాడేమో ననుకుంది. అలాటిది, అసలు అటువంటిభావమేలేకపోగా, ఆమెతిప్పించిన విషయం కూడా చర్చించాడు. అందువలన అతను, తనే మనియార్డరు పంపుతున్నానన్న విషయం రూఢిచేస్తున్నారు. పైగా, ఇన్నాళ్ళూ తనుఎంతో మంచివాడని నమ్ముతున్న అనంతరావుగారి గురించి వాళ్ళు చెప్పిన విషయాలు ఆశ్చర్యకరంగా వున్నాయి. అతని స్నేహితురాలొకమ్మాయికూడా, ఎప్పుడో ఒకసారి వెడ్గా మాట్లాడినట్లు భానుమతికి గుర్తుకువచ్చింది. అప్పట్లో తనా విషయం అంతగా పట్టించుకోలేదు. కాని ఇప్పుడు మళ్లీ ఆస్నేహితురాల్ని ఆవిషయం అడగాలనుకుంది.

వెంటనే ప్రత్యేకంగా ఆస్నేహితురాలింటికి వెళ్ళి, కొంచెంసేపు తక్కినవిషయాలు మాట్లాడి, చివరకు అనంతరావుగారి గురించి అడిగింది. "మునుపొకసారి అనంతరావుగురించి నువ్వేదో అన్నావు, ఏమిటది?" అని ఆత్రుతతో భానుమతి అడిగేసరికి, ఆమె "అదంతా ఒకకథలే, చాలాకాలంక్రితం జరిగింది. ఒకస్త్రీ ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆయనవద్ద చదువుకునేది. తన చావుకు అనంతరావుగారే కారణం అని ఉత్తరం రాసిందట. అందువల్ల ఆయన జైలుకెళ్ళవలసిన పరిస్థితి వచ్చిందనీ, ఎవరి సహాయంవల్లనో మళ్లీఆయన తప్పించుకోగలిగాడనిఅంటారు. ఏమైనా ఆయన బహుప్రమాదకరమైన వ్యక్తి. అయితే నువ్వు ఇప్పుడెందుకా విషయం అడుగుతున్నావు?" అంది మళ్లీ కనే ఆస్నేహితురాలు, భానుమతిని అదోలా చూస్తూ.

భానుమతి స్నేహితురాలికి ఏదో జవాబు చెప్పి ఇంటికి వచ్చేసింది కాని అనంతరావుగారి గురించి తను విన్నదానికి ఆమెకుచాలా విచారం కలిగింది. అంతేకాక వెంటనే మనియార్డరు ఎవరు పంపుతున్నారో తెలుసుకోవాలనుకుంది. దానికి రామవరం వెళ్లడం ఒకటే మార్గం, ఎంతకష్టమైనా సాధించి తీరాలనుకుంది.

* * *

రామవరం గ్రామమంతా ఎంతో ముచ్చటగా అలంకరించారు. దానికి కారణమేమంటే మంత్రిగారు వస్తున్నారు. ప్రకాశం చాలా ఏర్పాట్లు చేయించాడు. ఒక పెద్ద బహిరంగ సభ జరుగుతుంది. అందులో ఆచుట్టు ప్రక్కల గ్రామాలలోని ప్రజలందరూ వచ్చేందుకు ఏర్పాట్లు చెయ్యబడ్డాయి. మంత్రిగారికి ఘనస్వాగతమివ్వబడుతుంది. ఆ పూటకి ప్రకాశం ఇంట్లోనే విందు. ఆవిందు ఎలాజరగాలో, దామోదరం బదిరీ, రంగారావులకు పురమాయించసాగాడు. ఆ వూళ్ళోవున్న ప్రముఖులు చాలామంది, తమనా విందుకు పిలిపించుకోవాలని చాలా తాపత్రయపడసాగారు. మంత్రిగారితో పరిచయంకోసం అనేకమంది తహతహలాడి పోతున్నారు. వూరిజనమంతా మంత్రిగారిని చూడాలని ముచ్చటపడుతున్నారు. ఎవరినోట చూసినా మంత్రిగారి రాకను గురించే సంభాషణ.

నాయకులెవరైనా వస్తే ఏదోతమకొక మేలు జరగగలదని, ప్రజలాసిస్తారు. రోజురోజుకీ పెరిగిపోతున్న ధరలతో, జీవితం బరువైపోయి, సుఖాశాంతులు కరువైపోతున్నప్పుడు, దీనికి కారణం మనకు స్వతంత్రం రావడమేననీ, అంతకుముందు ఎంతో బాగుండేదని కొందరువిశ్వసించనారంభించారు. నాయకులంతా స్వార్థపరులు కావడంవల్ల, దేశం ఇలా అధోగతి పాలైందని వారివాదన. కాని, నాయకుల నెదుర్కొంటున్న క్లిష్ట సమస్యల గురించి ప్రజలకంతగా తెలియదు. దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న జనానికి, కనీసవసతులను కల్పించడంకోసం వారెంత బాధపడవలసివస్తోందో, సామాన్యులకు తెలియదు.

వూరంతా మంత్రిగారి రాకతో హడావుడిగావుంటే సత్యమూర్తి ఒక్కడూ ఆఫీసులో తనగదిలో కూర్చుని ఏదోతీవ్రంగా ఆలోచించసాగాడు. ఆరోజు ఆఫీసులో వాళ్ళు చాలామంది మంత్రిగారిని చూడటానికివెళ్ళిపోయారు. చాలాసీట్లు ఖాళీగా వున్నాయి. సత్యమూర్తి ఆలోచనకు ముఖ్యకారణం ఈమధ్య తన కిష్టంలేని పనులనేకం చెయ్యవలసివస్తోంది, అవి ప్రకాశం ఆదేశంమీదా దామోదరం సలహామీద జరుగుతున్నాయి. ఆ తప్పుపనులు చేస్తున్నప్పుడల్లా అతని హృదయం ఎదురుతిరుగుతోంది, అంతరాత్మ ఘోషిస్తోంది. విద్యుక్త ధర్మనిర్వహణ అనుకుని తను వాళ్ళు చెప్పిన పనులన్నీ ఇన్నాళ్ళూ చేస్తున్నాడు. కాని క్రమంగా, ఈదుర్వ్యాపారాలన్నిటికీ తోడ్పడేకన్నా, జీవితంగడుపుకోవడానికి మరొక పనేదైనాచేస్తేమంచి దనిపించింది. అతనుముఖ్యంగా గమనిస్తున్న దేమంటే ఈఫ్యాక్టరీలో 'వర్కర్ల'కు ఎంతో అన్యాయం జరుగుతోంది. ప్రకాశంపేరునుపయోగించుకొని, దామోదరం, అతని కొడుకైన గోపాలన్, బదిరీ, రంగారావు మొదలైన ప్రభృతులంతా ఎక్కడికక్కడ చేతికందిన డబ్బు స్వాహా చేస్తున్నారు. ఫ్యాక్టరీలో అప్పుద్యోగాలకూ, సిఫారసు చేస్తామనీ, అందరివద్దా వీళ్లు లంచాలు పుచ్చుకుంటారు. రైతులవద్ద లంచాలు పుచ్చుకుని, ఫ్యాక్టరీకివచ్చిన చెరుకును తప్పుడు తూకంతూచి, ఆడబ్బంతా కాజేస్తారు. కంపెనీకి కావలసిన సామానులు కొనడంతో కమీషన్ కొట్టేస్తారు. ఇలాంటివి అన్ని చోట్లా జరుగుతున్నా, ఇక్కడ మరీ దారుణంగా జరుగుతున్నాయి. కష్టపడి పనిచేసే పనివాళ్లకు జీతాలు తక్కువ. వాళ్లమీద, పనిరాకపోయినా ప్రకాశంగారి ఆశ్రితులై పని సంపాదించుకున్నవాళ్ళకు ఎక్కువ జీతాలూ అన్ని సౌకర్యాలూను. పనివాళ్ళ అజమాయిషీ చెయ్యడం మాత్రమే. ఇంకా 'సివిల్' పనులతో కంట్రాక్టులన్నీ ప్రకాశం గ్రూపు మనుషులవే. ఎవరిపేరో ఒకరి పేరు పెట్టి, ప్రకాశం, దామోదరం, పనులన్నీ చేయించేసి, డబ్బు తమ జేబులో వేసుకుంటారు. ఈఫ్యాక్టరీకి పెట్టుబడి చాలావరకూ, రైతులవద్దా, వర్తకులవద్దా, ప్రభుత్వంవద్దా సంపాదించినదే. ఈఫ్యాక్టరీ పేరుతో కొన్నిలక్షలు గడించాడు ప్రకాశం. దామోదరం మొదలైన వాళ్ళంతా బాగా బాగుపడ్డారు. అయినా, ఇప్పటికీ పనివాళ్ల కష్టసుఖాల్ని కనిపెట్టే మానవత్వం వికసించలేదు వాళ్ళలో. పనివారందరికీ సత్యమూర్తంటే చాలా అభిమానం. వాళ్ల కష్టసుఖాలన్నీ అతనితో చెప్పుకునేవారు. అతను తనకుతోచిన సహాయం చేస్తూండేవాడు, కొన్నాళ్ళక్రిందటివరకూ. కాని ఇప్పుడు దామోదరం చుట్టమొకడు, మద్రాసునుండి దిగబడ్డాడు. వాడిపేరు నాథన్ చూడటానికిపచ్చగా, పొడుగ్గా, విశాలమొహంతో, మంచివాడిలా కన్పిస్తాడు గాని, అతనువచ్చిన దగ్గర్నుంచి పనివాళ్ళ రక్తంపిండి పనిచెయ్యించటం ప్రారంభించాడు. వచ్చి ఆరు నెలలయిందో లేదోగాని, ఫ్యాక్టరీలో అందరికన్నా ఎక్కువ అధికారం చలాయించసాగాడు.

ఇన్నాళ్ళూ తను ఎప్పటికైనా ప్రకాశంలోని మంచితనాన్ని పైకి తీసుకురాగలననే నమ్మకం వుండేది సత్యమూర్తికి, నాథన్‌రాకతో ఆఆశ పోయింది. వాడు ప్రకాశాన్ని కీలుబొమ్మలా ఆడిస్తున్నాడు. దగాలూ మోసాలూ ఎలాచెయ్యాలో, కొత్త పద్ధతులు నేర్పుతున్నాడు. పాతవుద్యోగస్థుల్ని తీయించేసి మెల్లిగా తన వాళ్లని ఉద్యోగాల్లో ఇరికిస్తున్నాడు. ఇవన్నీ చూసిచూసి సత్యమూర్తికి విసుగెత్తింది. జీవితంలో

ఎన్నో ఆదర్శాలు సాధించాలని అనుకుంటూ, సత్యం కోసం ధర్మంకోసం ధారపొయ్యాలనుకుంటూ, చివరికి తను ఉద్యోగం అనే పేరుతో ఆదర్శాలకు తిలోదకా లిచ్చి బ్రతుకుతున్నాడు. కాని తనను తను మోసం చేసుకుని సాధించినదేమిటి, తనూ, తనతల్లీ బ్రతుకు తున్నారు గాని ఆ బ్రతుకులో ఎంత అశాంతి ననుభవి స్తున్నారో వర్ణనాతీతం. కాని, దానిని వదిలే శక్తి తనకులేదేమోననిపిస్తోంది. అనంతరావుగారు, సత్ప్ర వర్తన అనేది ఒక అసిధారావ్రతం లాంటిదన్నారు. హరిశ్చంద్రుడు సత్యంకోసం, రాముడు ఆడి తప్ప కుండా అన్నమాట నిలబెట్టు కోవడంకోసం, ధర్మ రాజు ధర్మంకోసం, ఎన్నికష్టాలు పడవలసి వచ్చిందీ వర్ణించిన పురాణాల్లో ఈవిషయం స్పష్టంగా రాసి వుంది. ఎన్నో ఆశలూ, మోహాలూ, సుఖాపేక్షలూ, మంచితనానికి అడ్డొస్తాయి. వాటిని నిర్జించటానికి ఎంతో ఆత్మశిక్షణా, ఆత్మనిగ్రహం, ఆత్మ త్యాగమూ కావాలి. సామాన్య ప్రజలకు జరిగే అన్యాయాలను ప్రతిఘటించాలంటే ఎంతోధైర్యంగా నిలబడగల శక్తి కావాలి. మహాపురుషుల జీవితాల్లో, కేవలం మంచిపనులు చెయ్యటమేకాదు. వాటినిర్వహణలో అడ్డొచ్చే కష్టాలనెదుర్కోగల శక్తే ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఏదిఏమైనా, తనిక ఈకలుషిత వాతా వరణంలో ఉండలేడు. ప్రకాశాన్ని సూటిగా కొన్ని ప్రశ్నలడిగి, తనదారిని తను చూచుకోవాలనుకున్నాడు.

మంత్రిగారువచ్చి, రాత్రిపదింటి దాకా మీటింగు జరిపి, తరువాత రైలెక్కి వెళ్లిపోయారు. ఆయన మాటలలో కొత్త విషయాలేమీలేక పోయినా ప్రజ లకు అవి ఎంతో ఉత్సాహాన్నిచ్చాయి. ప్రకాశం ఇంట్లో రాత్రిపూట సమాలోచనలు ప్రారంభమయ్యాయి. వచ్చే ఎలక్షనుల గురించి మంత్రిగారు మాట్లాడి వెళ్లారు. ప్రకాశాన్ని, ఆ ప్రాంతాలలో ఏకైక నాయ కుడిగా ప్రభుత్వం పరిగణిస్తోంది. వచ్చే ఎలక్షన్లలో తమపార్టీ తరఫున ఎవరెవర్ని నిలబెట్టాలో, ఆ ప్రాం తాలకు, జాబితా తయారుచేసే అవకాశం, ప్రకాశాని కిచ్చారు. ఎవర్నెవర్ని నిలబెట్టాలో ప్రకాశం ఆలో చిస్తూ, ఆరాత్రంతా నిద్రలేకుండా గడిపాడు.

సత్యమూర్తి కూడా ఆరాత్రి సరిగా నిద్రపోలేదు. రామవరం వదిలెయ్యాలని నిశ్చయించుకున్నాడు. అం దుకు నెలరోజులైనా వ్యవధి కావాలి. ఇక్కడితన పనులన్నీ పూర్తిచేసుకోవాలి. హఠాత్తుగా అతనికి రామదాసుగారు జ్ఞాపకమొచ్చారు. గతంఅంతా గుర్తు కు వచ్చింది. తన విద్యుక్త ధర్మాలలో ఒకటి భాను మతికి వీలైనంత సహాయం చెయ్యడం. ఆమరునాడే మనియార్డరు విషయం కనుక్కోదల్చాడు.

తెల్లవారిన వెంటనే నిద్రనుండి లేస్తూనే, సత్య మూర్తి ఆరోజు ఎలాగైనా పోస్టాఫీసులో గడిపి, భాను మతికి ప్రతినెలామనియార్డరు పంపుతున్నదెవరో కను క్కోవాలని నిశ్చయించాడు. మునుపు రెండుమూడు సార్లు ప్రయత్నించాడుగాని, పోస్టుమాస్టరుగారు చెప్పలేక పోయారు. భానుమతి ఎడ్రసుకు ప్రతినెలా మనియార్డర్లు వెళ్తున్నాయికాని, తాముగుర్తుగా జ్ఞాపకముంచుకోవలసిన వ్యక్తెవరూ పంపటంలేద న్నారు పోస్టుమాస్టరు.

ఆరోజు 14వ తేదీ. ప్రతినెలా ఆతేదీనే భానుమ తికి మనియార్డరు చేయబడుతుంది. సత్యమూర్తికి ఒక ఆలోచనకలిగింది. అసలు ఆరోజు పోస్టాఫీసువద్ద కాపలాకాస్తే, మనియార్డర్లు పుచ్చుకునేకాలం లోపల ఆ మనియార్డరు పంపేదెవరో బయట పడుతుంది. తన మామూలు పనులన్నీ నిర్వర్తించుకుని పోస్టాఫీ సుకు బయల్దేరాడు సత్యమూర్తి.

అది వానాకాలం. ఆకాశంలో మబ్బులు వేస్తు న్నాయి.గాని, వానకురవటంలేదు. ఎండ అట్టే లేక పోవడంవలన ప్రకృతి ఆహ్లాదకరంగా వుంది. రామ వరం మార్కెటు చిన్నది. స్టేషనుకు ప్రక్కనే మార్కెట్టు అదిదాటివెళ్తే పోస్టాఫీసు వస్తుంది. మార్కెట్టులో దుకాణాలన్నీ ఎప్పుడూ జనంతోకిక్కి రిసిపోతుంటాయి. చుట్టు ప్రక్కలపల్లెటూళ్లవాళ్లంతా



సరుకులు కొనుక్కోడానికి ఇక్కడికే వస్తారు. అందుకని బజార్లో రద్దీ ఎక్కువ. సత్యమూర్తి ఆలోచిస్తూ బజారువెంట నడవసాగాడు.

పోస్టాఫీసువైపు మలుపు తిరగగానే అతనికి తన కన్నా ముందుగా, కొద్దిగజాల దూరంలో ఒకస్త్రీ నడుస్తూండడం కన్పించింది. వెనుకనుంచి ఆమెను చూస్తుంటేనే గుర్తు పట్టగలననిపించింది. ముతక ఖద్దరుచీరా, తెల్లని శరీరఛాయా, సన్ననిఆకారమూ ఆమెను పట్టిస్తూనే వున్నాయి. ఆమె పోస్టాఫీసు లోకి వెళ్లింది. సత్యమూర్తి పోస్టాఫీసుకు వెళ్లేసరికి ఆమె లోపలికివెళ్ళి బయటకు వచ్చింది.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. ఆమె చిరు నవ్వుతో నమస్కరించింది. సత్యమూర్తి ప్రతినమ స్కారంచేసి, "నేననుకున్నట్లే జరిగింది. చివరికి విషయం తెలుసుకోవడానికి మీరే స్వయంగా వస్తా రనుకున్నాను. ఇన్నాళ్లూ ఇక్కడుండి ఈవిషయం కనుక్కోలేక పోయాను" అన్నాడు నొచ్చుకుంటున్న ట్లుగా. భానుమతి చిరునవ్వు నవ్వింది.

"ఫరవాలేదు. ఇప్పుడు కనుక్కుందాం." అంది.

"నేనూ అందుకోసమే వచ్చాను. మీరెప్పుడొ చ్చారు?"

"కొద్దిసేపటి క్రిందటే వచ్చాను,బస్సులో. వెం టనే పోస్టాఫీసులోకెళ్లి మాస్టారుగారితో మాట్లాడి బయటికివచ్చాను. వెంటనే మీరు కన్పించారు. కొంత ధైర్యం వచ్చింది" అంది భానుమతి.

"అయితే మాయింటికి వెళ్దాం పదండి. మీరు మాయింట్లోవుండండి. నేనుఇక్కడ కాపలాకాసి అసలువిషయం కనుక్కుని మీకు చెప్తాను."

"అబ్బే! నేనలాతృప్తి పొందలేను. నేను స్వయంగా నాకళ్లతో ఆమనియార్డరు పంపేవ్యక్తిని చూడాలి."

"అందుకు నేనూఒప్పుకుంటానుకాని ఇదివర్లో

చోటు అవడంవల్ల మీరెక్కువకాలం ఇక్కడవుంటే జనం విరగబడి చూడడం మొదలెట్టారేమోనని భయం. పట్టణాల్లో లాగా ఆడవాళ్లని అంతగా పట్టించుకపోవడం వీళ్లకింకా పట్టుబడలేదు. ఎలాగైనా ఈవిషయం తెలుసుకోవాలని నాకూవుంది."

"పరవాలేదులెండి, నాకు వాళ్ళు విరగబడి చూసినంతమాత్రాన తరిగేదేమీ లేదు. ఏమైనా ఒక్కక్షణం ఇక్కణ్ణుంచి కదలాలని లేదునాకు."

వాళ్లిద్దరూ పోస్టాఫీసు అరుగుమీద మాట్లాడుతూంటే, ఇద్దరు యువకులు కొద్ది దూరంలో నిల్చుని భానుమతివైపు తదేకదీక్షగా చూడటం మొదలెట్టారు. సత్యమూర్తికేమీ పాలు పోలేదు. భానుమతి తనెంతచెప్పినా వినేటట్లు లేదు. అతనికొక ఆలోచన తట్టింది. పోస్టుమాస్టరుగారి వద్దకు తిన్నగావెళ్లి, "అయ్యా, మీరొక్క సాయంచెయ్యాలి, ఆమెనా స్నేహితురాలు. ప్రతినెలా ఆమెపేర ఇక్కడినుండి మనియార్డరు వెళ్తోంది. అది ఎవరు పంపుతున్నారో కనుక్కోవాలని వచ్చింది. ఆడపిల్లకాబట్టి, కాస్త మీయింట్లో కూచోడానికి చోటిస్తారా?" అని అడిగాడు.

పోస్టుమాస్టరుగారు నడివయసులోవున్న మహమ్మదీయుడు. పేరు సులేమాన్. చామనచాయగా, సన్నగా వుంటాడు. నెరిసిన తలైనా, పైకిదువ్వబడి అందంగా వుంటుంది. నల్లఫ్రేము కళ్లద్దాలతో, చిరునవ్వునవ్వుతూ మాట్లాడే అతనిమొహం, చూసేవారిలోకూడా ఉత్సాహం రేపుతుంది.

"ఓ, తప్పకుండా" అని కూతుర్ని పిల్చి, భానుమతిని ఇంట్లోకి తీసుకువెళ్లమన్నాడు. పన్నెండేళ్ల వయసుగల అమ్మాయి ఆమెను పిల్చింది.

"ఏమిటిసంగతి?" అని సత్యమూర్తినడిగాడు సులేమాన్, భానుమతి, ఆ అమ్మాయివెంట ఇంట్లోకి వెళ్లాక.

"ఏమీలేదు. ఎవరో ఆమె శ్రేయోభిలాషులు ప్రతినెలా ఆమెపేర ఇక్కడినుంచి, చనిపోయిన ఆమె తండ్రిపేర పంపినట్లు పంపుతున్నారు. వారిగురించి తెలుసుకుందామని వచ్చింది."

"ఆమెదేవూరు?" అని పోస్టు మాస్టరడుగగా, సత్యమూర్తి భానుమతిపేరూ, ఆమె విశాఖపట్నం అడ్రసు వివరాలూ చెప్పాడు.

అదివినగానే, మనియార్డరు తీసుకునే గుమస్తా, తలెత్తి ఆశ్చర్యంగా సత్యమూర్తివైపుచూసి, "ఆ

సుప్రభాతం

మనియార్డరుకోసమే దామోదరంగారు ఎదురు చూస్తున్నారు. ఆమనియార్డరు కట్టే మనిషిరాగానే తనకుతెలియ జెయ్యమన్నారు, ఫోనులో. అంతే కాకుండా ఒకఅరగంట క్రితం మరొక క్రొత్త వ్యక్తికూడా వచ్చి, ఆమనియార్డరు కట్టే వాళ్లెవరైనా వచ్చారేమోనని అడిగారు." అన్నాడు. అతనొక పాతికేళ్ల యువకుడు.

"బలేగా వుందే.ఈ విషయం గురించి పెద్దపెద్ద వాళ్ళకే ఆసక్తిగా వుందన్నమాట. అయితే చాలా ముఖ్యమైన విషయం. అసలా మనియార్డరువెవరు పంపుతున్నారో నీకు గుర్తుందా?" అని పోస్టు మాస్టరుగారా గుమస్తా నడిగాడు.

అతను తనకంత గుర్తు లేదు గాని ఎవరో తనకు పూర్తిగా తెలియని వ్యక్తి పంపుతున్నాడన్నారు. పోస్టు మాస్టరుగారు ఇంటి లోపలికి వెళ్లారు. ఆయన కూచునే 'సీటు వెనకాలే, గుమ్మమూ దానికొక తెరావుంది. ఆయన వెనకాలయింట్లో వుంటున్నారు. ముందు హాలులో పోస్టాఫీసువుంది. ఇంట్లోకి వెళ్లి భార్యతో మాట్లాడుతున్న భానుమతిని చూసి, "మీరు బయటకు కనబడకుండా ఆతెర దగ్గర కుర్చీ వేస్తాను. అక్కడ కూర్చోవచ్చు. మనియార్డరు క్లర్కుతో చెప్పాను. మీకుకావలసిన మని యార్డరు రాగానే , మిమ్మల్ని పిలిచి చెప్తాడు" అని సాదరంగా చెప్పారు. భానుమతి చిరునవ్వుతో తన కృతజ్ఞత తెల్పుకుంది. అందుకాయన సత్యమూర్తి తనకు చాలా పరిచయస్థుడని అతని స్నేహితురాల్ని గౌరవించడం తనవిధి అని చెప్పాడు.

బయుట వరండాలో సత్యమూర్తి పచారు చెయ్యసాగాడు. దామోదరం పేరు విన్న దగ్గర్నుంచి అతని మనస్సు పరిపరివిధాల పోనారంభించింది. ఈవిషయంలో దామోదరం కలుగ జేసుకొనక ముందే అసలు విషయం తను తెలుసుకోవాలి. పైగాభానుమతి ఈవూరు వచ్చినట్లు వాళ్లెవరికీ తెలియకూడదు. తెలిస్తే చాలా ప్రమాదం . ఆమెను జాగ్రత్తగా మళ్లి విశాఖ పట్నం పంపే వరకూ తనకు మనశ్శాంతి వుండదు. వీళ్ళంతా దుర్మార్గులు. ఏం చేసినా చెయ్య గిరఃరు. పైగా ఇది వాళ్ల వూరు. అందుకని మరీ ప్రమాదం.

సులేమాన్ మళ్లీ లోపల్నుండి బయటికివచ్చి సత్యమూర్తితో "ఆమె ఆతెర వెనకాల కూర్చుంటుంది. ఆమె కందరూ కన్పిస్తారు. ఆమెఎవరికీ కన్పించదు." అన్నాడు.

"మంచి పని చేశారు. లేకపోతే మన వూరు వూరంతా ఆమెని చూడ్డానికి విరగ బడ్తారు." అన్నాడు సత్యమూర్తి.

ఇద్దరు ఒకరితరువాత ఒకరు మనియార్డరు కట్టడం కోసం వచ్చారు. బయట నున్న సత్యమూర్తీ, తెరవెనుక నున్న భానుమతీ ఆత్రుతగా చూశారు. కాని ఎవో ఇతర మనియార్డరులు. నిరాశతో సత్యమూర్తి పచారు చేస్తూ గడియారం వైపు చూశాడు. పదకొండున్నర అయింది.మరొక మూడు న్నరగంటల కాలంగడపాలి. పోస్టాఫీసుకు అనేకమంది వచ్చి పోతున్నారు. తమ కు కావలసిన వ్యక్తి ఎలా వుంటాడో!

ఎదైనా సంఘటన కోసం ఎదురు చూస్తున్నప్పుడు కాలం చాలా మెల్లిగా నడుస్తుంది. అది మన వూహో, లేక పోతే నిజంగా నిరీక్షణలో ఆ శక్తి వుందోగాని, అలాటి సమయాల్లో మానవుణ్ణి అచేతన మైన గడియారం మహా ఏడ్పిస్తుంది. ప్రతి నిముషమూ, ఉలుకులికి పడూ, ఇంకాఎంతసేపు! అని నిట్టూరుస్తూ మరొక అరగంట కాలం 'బయట వరండాలో సత్యమూర్తీ తెర వెనకాల భానుమతి గడిపారు. తమకి కావలసిన వ్యక్తి రాలేదు. కాని పర ధ్యానంగా. ఎటో చూస్తున్న సత్యమూర్తిని, "ఏమప్పా! ఇక్కడున్నావు?" అని దామోదరం పలకరించే సరికి అతను ఆశ్చర్యంతో తూలిపడ బోయాడు.

"అబ్బే! ఏంలేదండీ. ఒక స్నేహితుని దగ్గర్నుంచి టెలిగ్రాం రావాలి...... అందుకని".అన్నాడు సత్యమూర్తి గబుక్కున తన కప్పటి కప్పుడు తట్టిన అబద్ధం చెప్తూ. తెరవెనుక భానుమతి ఏం చెయ్యాలో తోచక, ముందు ఖంగారుపడ్డా, వెంటనే సరు కుని, కదలకుండా అలాగే కూచుంది.

"ఎవరప్పా ఆస్నేహితులు? మగా? ఆడా?"


"ఆడ కాదండి. మగేనండి."

సరే కాని , ఆఫీసులో నీపేర ఒక అర్జంటు వుత్తరం వచ్చింది. ఢిల్లీనుంచి అనుకుంటా. వెంటనే జవాబు రాయాలి. మేనేజరు నీకోసం కబురు పంపాడు. నువ్వెక్కడున్నావో తెలియ లేదు ఇక్క డుంటివి. వెంటనే పోయి అది చూడు."

అదివినగానే సత్యమూర్తి ఇరుకున పడ్డాడు. దామోదరం మాట వినాలని తనకు ఆర్తి లేకపోయిందేమీలేవు గాని మొదటి నుండి, అతని ఆజ్ఞలను పాటించడం తనకూ అందరితో పాటూ అలవాటయిపోయింది. "ఇక్కడ నే నొక ముఖ్యమైన టెలిగ్రా కోసం ఎదురు చూస్తున్నానే. అది రాగానే వెంటనే మరొక టెలిగ్రాము ఇవ్వాలి. ఎలా..?" అని మథన పడ సాగాడు.

"నాతో చెప్పిపో. నే చూసుకుంటా"అన్నాడు దామోదరం.

"అది కుదరదులెండి. సరే నేనే పోయివస్తా." అని సత్యమూర్తి ఒక్క అంగలో రోడ్డు మీదకు వచ్చి పడ్డాడు. దామోదరాన్ని తప్పించుకొని, బైటకు వచ్చి, ఏం చెయ్యాలా? అని ఆలోచించ దల్చుకున్నాడు. అక్కడొక సైకిలు అద్దెకుతీసుకుని



సుప్రభాతం

మైలు దూరంలో వున్న ఫ్యాక్టరీకి వెళ్ళి, ఉత్తరానికి జవాబు రాయించి మళ్ళీ పోస్టాఫీసుకి వచ్చాడు.

అందుకు అరగంట సేపు పట్టింది. దామోదరం పోస్టుమాష్టరు ప్రక్కనే కూర్చున్నాడు మాట్లాడుతూ. కొంపదీసి, తన సంగతీ భానుమతి సంగతీ, దామోదరంతో పోస్టు మాష్టరు చెప్పెయ్యడు కదా! మని యార్డరు గుమాస్తాని సంజ్ఞలతో ఏమయిందని? ప్రశ్నించాడు సత్యమూర్తి.

అతను తిరిగి సంజ్ఞలతో, ఏమీ జరుగలేదని తెలియ బర్చాడు. ఒకసారి గుమ్మాని కున్న తెర వైపు చూశాడు. తన కంటికి కన్పించక పోయినా తెరవెనుకలి, ఆతృతతో క్షణమొక యుగంగా గడుపుతున్న భానుమతి నూహించుకున్నాడు. దామోదరం ఇప్పుడప్పుడే కదిలేటట్టు లేడు. అతను కూడా, తనలాగే మని యార్డరు గురించే వచ్చి వుంటాడు.

ఒంటిగంటన్నర అయినా ఎక్కడా, తనకు కావలసిన వ్యక్తి జాడే లేదు. పోస్టుమాష్టరుగారు దామోదరంతో మాట్లాడుతూనే, తన ఆఫీసుపని తను చేసుకుంటున్నాడు. సత్యమూర్తికి పట్టుకున్న బాధల్లా, భానుమతి దామోదరం కంటబడి పిలిసి వస్తుందేమోనని. ఒకవేళ ఆమనియార్డరు పంపే వ్యక్తి వస్తే దామోదరం, అతనిని తనతో తీసుకువెళ్తాడేమో? తను అతనితో మాట్లాడవలసిన అవకాశం గాని, భానుమతి అతనిని చూడటం గాని పడదేమో? దామోదరం లేకపోతే తనకొంత వరకూ ఈరహస్యం బేధించి వుండేవాడు. కాని దామోదరం కదలడు. ఆ అవకాశం తను చెయ్యి జారిపోయినట్లే.

అసలు ఆవ్యక్తిని పోష్టాఫీసు ఆవరణలో ప్రవేశించకుండానే రోడ్డుమీదే కాసి పట్టుకుంటే? ఎందుకైనా మంచిదని కొంచెంసేపు రోడ్డుమీద పచార్లు చెయ్య నారంభించాడు. దామోదరం ఎప్పటికీ కదిలేటట్లు లేడు. తనకు కావలసిన వ్యక్తి జాడకూడా లేదు. సత్యమూర్తికి మరొక ఆలోచన తట్టింది. ఆతనిని మెల్లిగా బయటకి పిల్చి 'అయ్యా, ఆమనియార్డరు రాగానే వాపసు చేసి మెల్లిగా కన్నుగీటండి. దామోదరానికి తెలియకుండా దాచెయ్యండి. ఆవ్యక్తిని మెల్లిగా నేను పట్టుకుంటాను' అనిచెప్తే? కాని దామోదరం, మనియార్డరు ఫారం రాగానే తనే ముందు చదివేస్తున్నాడు. అందువల్ల అది ఎంతమాత్రం లాభం లేదు. అరగంటలో ఇటువంటి ఆలోచనలు ఎన్నో వచ్చాయి సత్యమూర్తికి. కానీ అన్నీ లాభం లేని లాగే కన్పించాయి.

బరువుగా భారంగా కదులుతూవున్న కాలం మెల్లిగా రెండు గంటలు దాటింది. అంతలో పెద్ద రొద చేసుకుంటూ బస్సు రావడం, అందులోంచి ప్రకాశం దిగడం జరిగింది. అతనితో పాటు మరొకిద్దరు పెద్దమనుషులు దిగారు. సత్యమూర్తిని చూసి "ఇక్కడున్నావేం?" అనిఅడిగాడు ప్రకాశం.


"ఒక ముఖ్యమైన టెలిగ్రాం కోసం వచ్చాను."

ఖద్దరు పంచే, ఖద్దరు లాల్చీ పైమీద పంచెతో ప్రకాశం ఎప్పుడూ లీవిగ దర్జాగా ఉంటాడు. అతనికి డబ్బు అధికారం పలుకుబడీ వున్నాయి. రామవరంలో అతనినొక ప్రభువులా చూస్తారు. తనతో వచ్చిన వాళ్ళకు "ఈ పోష్టాఫీసు బిల్డింగే నదే దీనిని పడగొట్టించి మళ్ళీ కట్టిద్దామని చూస్తున్నాను." అని దానిచుట్టూ తిరిగి వివరంగా అన్నీ బోధపర్చసాగాడు. తను ఏమేమి మార్పులు తేదల్చుకుంది. దామోదరం కూడా వచ్చి కలిసాడు అతన్ని

ఒక్క దామోదరం రావడం వల్లనే, తనఆశలన్నీ విరాళలయ్యాయని అనుకుంటున్న సత్యమూర్తి ప్రకాశం రావడంతో పూర్తిగా వ్యవహారం ఎదురు తిరిగినట్లయిందను కున్నాడు. ఇకనేం చెయ్యాలో తోచలేదు. తన కే ఇంత కంగారుగా వుంటే, తెరవెనుక వున్న భానుమతి ఎలా వుందో. తను వెళ్లి ఆమెను పలకరించడానికి కూడా అవకాశం లేదు. ప్రకాశం, పోష్టాఫీసులో, మరి మాష్ గారు వేయించిన కుర్చీలో కూచుని తీరిగ్గా పోష్టాఫీసు బిల్డింగులో తను తేదల్చుకున్న మార్పులు చర్చిస్తున్నాడు.

(సశేషం)

జలుబులను నివారించే మరో దివ్యమైన శక్తి



అనోలియం

ఇతర ఔషధాలకంటె బహుధా ప్రయోజనకరమైనది.

శీఘ్రగతిన విముక్తి
శరీరంలోకి వేగంగా ప్రవేశిస్తుంది.
బాధాకరం కాదు
ఎక్కువగా అంటదు.
మెత్తనిది
పసిపిల్లల అతి మెత్తని చర్మానికికూడా ఉపకరిస్తుంది.

అనోలియం ఎలా వాడాలి ?

1. గుండెమీద రాయటం
2. ముక్కుకు అటూ, యిటూ రాయటం
3. మెడమీద రాయటం
4. అనోలియంను వేడినీటిలో కరగించి దాని ఆవిరి పీల్చటం.

జలుబు చేసేవరకు ఆగకండి. నేడే అనోలియం కొనండి!


గోమంతక దర్శనం

'గోవా ప్రజాభిప్రాయం' నిర్ణయం దెబ్బకి మొహం వాచి చతికిలబడిన గాంధీ టోపీ మనిషికీ మహారాష్ట్ర నాయకుడు శ్రీ వై. బి. చవాన్ (ఆంతరంగిక శాఖ మంత్రి) కీ చాలా పోలికలు ఉన్నాయి! ఈ దృశ్యం చూపించే కార్టూన్‌పైన గోవా ప్రజలు, తమ ప్రాంతం మహారాష్ట్రలో విలీనం కావాలనే వాదాన్ని ఖచ్చితంగా తోసిపుచ్చారని చాటే పతాక శీర్షికా, చుట్టూ ఈ నిర్ణయాన్ని తమకి తోచినట్లు పొగడే మైసూరు రాజకీయ నాయకుల ప్రకటనలూ..............

జనవరి 20 బెంగుళూరులో స్థానిక వార్తాపత్రిక తియ్యగానే ఇదీ మాకు కనిపించింది...... బెంగుళూరు నుంచి ధార్వార్ వెళ్ళి అక్కడ 'గోవా రోడ్డు' ప్రవేశించేదాకా ఈ విషయం అందరి చర్చలలోనూ ప్రధానాంశం అయిపోయింది. ధార్వార్— గోవా రోడ్డు మీద కొంత దూరం తారు వేశారు కాని హఠాత్తుగా తారు పోయి రాళ్ళమయం అవడంతో మా ప్రయాణం వేగం తగ్గింది. ఎన్నో మైళ్ళు రాళ్ళ రోడ్డే కనిపించటం చూసి మాతో వస్తున్న ఒక కన్నడం స్నేహితుడు, "గోవా మహారాష్ట్రలో చేరనంది కాబట్టి మైసూరు ఇక మీద దీన్ని చురుగ్గా బాగు చేయిస్తుందేమో!" అన్నాడు..........

* * *

దారిలో ఒక చిన్న పల్లెటూరు. టీ షాపులో కోకో కోలా, పళ్ళ పానీయాల సీసాలు, బిస్కట్ల పొట్లాలు ప్రముఖంగా ప్రదర్శించారు. గోవా సరిహద్దు చేరకపోయినా ఇది గోవా ప్రభావమేనని తర్వాత తెలిసింది. గోవాలో ఎంత మారుమూల గ్రామంలో అయినా— మేము చూసినవి— టీ షాపు శుభ్రంగా కనిపిస్తుంది. కోకో కోలా సీసాల వరుసలూ, పెట్టెలూ చాలా ఉంటాయి.........



గోవా కెథెడ్రల్.

* * *

'పోండా' లో ఒక చిన్న 'కారు సామగ్రి' అంగడిలో ఏదో కొనటానికి ఆగాము.

"మద్రాసు నుంచి వస్తున్నారా? కార్లోనా?! వెయ్యి, పదిహేను వందల మైళ్ళుండదూ?" అని అడిగాడు అంగడి యజమాని. ఆరు వందల చిల్లర మించి ఉండదంటే "అంత దగ్గరా!" అని ఆశ్చర్యపోయాడు....... "మంగుళూరి నుంచే బొంబాయికి రోజూ బస్సులు వెడ్తాయి— వీళ్ళకసలు బొంబాయి తప్ప కనిపించదు." అన్నాడు కన్నడం స్నేహితుడు.

పోండాలో ఒక క్షవరశాలలో వర్దా, ప్రవ



కెథెడ్రెల్‌లో ఒక సెయింట్ విగ్రహం.

పర్దా వేసుకుని క్రాప్ చేస్తున్న మనిషి కులాసాగా సిగరెట్టు కాలుస్తున్నాడు......

* * *

"మీకే హోటల్ కావలిస్తే దాన్ని కుదురుస్తాను సార్! ఏది కావాలన్నా చెప్పండి, ఏర్పాటు చేస్తాను.' అన్నాడు అతను అరవంలో. తాగి ఉన్నాడేమో మాట జోరుగా వస్తోంది. ఇటూ అటూ ఊగుతున్నాడు పణాజీలో మా బండి పెద్ద హోటలు ముందు ఆగగానే వచ్చేశాడు. మాలో ఒకతను తమిళం మాట్లాడటం విని వెంటనే తనని పరిచయం చేసుకున్నాడు..

అది మంచి హోటలే కాని 'రిసెప్షన్' వద్ద వ్యక్తి "ఇవాళ నీటి వసతి సరిగాలేదు, మీకు గది ఇచ్చి మాత్రం లాభం ఏమిటి?" అని తనే ప్రభుత్వం నడిపే 'సర్క్యూట్ హౌస్'లో బస ఏర్పాటు చేశాడు టెలిఫోన్ చేసి. సర్క్యూట్ హౌస్ కొండమీద ఉంది. మేము అక్కడికి చేరేప్పటికే ఎనిమిది దాటింది.

రెండవ అంతస్తులో ఉన్న మా గదులలోకి సామాను పదిహేను ఇరవయి ఏళ్ల మధ్య వయసున్న అమ్మాయి తీసుకు వెడుతోంది. 'పెద్ద పెట్టెలు ఈ పిల్ల తీసుకు వెళ్ళటం మంచిదికాద'ని మేమే కొన్ని మోశాము. ఇది చూసిన హోటల్ గుమాస్తా తనూ ఒకటి తీసుకువచ్చేడు...


* * *

అయిదు బల్లలకి పదకొండు పన్నెండు మందికి మించి లేరు. రేడియో గ్రామ్‌లో స్పానిష్ రకం సంగీతం సన్నగానే వినిపిస్తోంది. "అందరిదీ ఒకటే బిల్లా, లేక ఎవరి బిల్లు వారికేనా?" అని అడిగాడు హెడ్ వెయిటర్. అది పాంజిమ్ (పణాజీ) లో కెల్లా మంచి 'రెస్టారెంట్'ట. భోజనం చక్కగా ఉంది. కిటికీ నుంచి 'సముద్రం' మీద మెల్లిగా కదులుతున్న 'ఖనిజం—పడవ'ల దీపాలు కనిపిస్తున్నాయి..

* * *

'వెల్హగోవా'లో మేము చూసిన కేథడ్రల్‌లు అన్నిటిలోనూ పెద్దది అది. ఆదివారం అయినప్పటికీ బయట ప్రశాంతంగా ఉంది. దూరంగా కొబ్బరి చెట్ల మధ్య సగం సగం కనిపిస్తోంది ఒక చిన్న తెల్లటి

(46 వ పేజీ చూడండి)



బోం జెసూస్ బసిలికా. సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ దేహం యిందులోనే ఉంచారు.

జాతీయ సమైక్యత

"—గోవా వారు తమ 'భూస్వామ్య, ప్రపంచాన్నిచూసి కలలుకంటూ ఉంటారు. ఇది వారికి మిగతా భారతదేశంకన్నా, ప్రపంచంకన్నా భిన్నంగా, మనోహరంగా కనిపిస్తూ ఉంటుంది."

దియోనిసిమో. ఎ. రిబెయిరో,
"గోవా, ది ప్రాబ్లెమ్స్ ఆఫ్ ట్రాన్సిషన్"లో.

*   *   *

జనవరి మధ్యలో గోవాలో జరిపిన ప్రజాభిప్రాయ సేకరణ 'మహారాష్ట్రవాదుల' వత్తిడివల్లనే జరిపారు అంటారు కొందరు.

పత్రికలలోపడే వార్తలనిబట్టి ఈ ఆరోపణలో కొంత నిజం ఉందని భావించినా తప్పులేదు. చివరికి ప్రజల నిర్ణయం మహారాష్ట్రలో గోవాని కలపాలనే వారికి ఎదురుతిరిగింది! (ఈ సందర్భంలో మైసూరు రాజకీయవేత్తలు తెలివిగా ప్రవర్తించారని అనవచ్చు!)

గోవా వైశాల్యం సుమారు 1430 చదరపు మైళ్ళు. జనాభా సుమారు 6,35,000. అంటే, భారతదేశంలో ఒకరాష్ట్రంలో భాగం అవాలా, అవగాదా అనే చర్చకి వస్తువు అయిన ఈ ప్రదేశం జనాభా ఆంధ్ర రాజధాని జనాభాలో సగం ఉందన్నమాట ! (కృష్ణాజిల్లా వైశాల్యం సుమారు 3360 చదరపుమైళ్ళు. జనాభా సుమారు 20,76,000.) ఒక చిన్నజిల్లాకన్నా చిన్నదయిన ఈ 'దేశా'న్ని భారతదేశం పోర్చుగీసు పరిపాలన నుంచి 1961 డిసెంబర్‌లో విడిపించింది.స్థూలంగా 'గోవా' అంటే డామన్, డియూలుపోగా మిగిలిన ప్రాంతం అనే అర్థంలోనూ వాడవచ్చు. అప్పటి నుంచి దీని భవిష్యత్తుని గురించి ఎన్నో వాద వివాదాలు జరుగుతూవచ్చాయి. 'గోవా సంస్కృతి' వేరే రకమయినది కాబట్టి ఈ విషయమయి ప్రత్యేకమయిన శ్రద్ధ అవసరం అనిమాత్రం ఎందరో అంగీకరిస్తున్నారు.

భారతదేశంలోవున్న వైవిధ్యం ప్రపంచంలో మరెక్కడా ఉండదు. జెట్ విమానాల పక్కనే ఎద్దుబళ్ళు కూడా పని చేస్తూవుంటాయి. ప్రతి నగరంలోనూ చాలామంది ఇంట్లో ఒకవిధంగా, బయట మరోకవిధంగా 'జీవిస్తూ' ఉంటారు—హోటళ్ళలో బల్లలమీద కత్తి, ఫోర్కు, చంచాలతో, ఇళ్ళలో నేలమీద, కంచాలలో చేతితో తింటారు. కాలేజీలలో ఆధునిక ఆంగ్ల సాహిత్యం చెప్పేవారు పిలకపెట్టుకొనవచ్చు. పరమాణు నిర్మాణాన్ని శోధించే వారు వర్జ్యాన్ని పాటించవచ్చు. పంజాబ్‌లో వస్త్రధారణ కేరళ వస్త్రధారణకి చాలా భిన్నంగా వుంటుంది. గాంధీటోపీ, ముతక ఖద్దరూ ధరించేవారు ఎయిర్ కండిషన్‌డ్ గదులలోగాని కూర్చోలేరు. ఇందులో అందరికీ తెలియని విషయం ఏమీలేదు. దక్షిణదేశం వారు మూలలనుంచి ఉత్తరదేశం మహానగరాలలో నివసించటానికి వెళ్ళేవారు తమ 'సంస్కృతి'కి పెద్ద ప్రమాదం రాబోతున్నదని ప్రచారం చేస్తున్నట్లు కనిపించదు.

పదహారవ శతాబ్దందాకా భారతదేశంలో ఒక భాగంగా ఉన్న గోవాకి మాత్రం నేడు వచ్చిన ప్రత్యేకమయిన కష్టం ఏమిటి? 1964 లో ఈ విషయమయి ఒక సమావేశం జరిపారు. ఇందులో ఎందరో మేధావులు పాల్గొన్నారు. ఈ మేధావులలో చాలామంది గోవాకి చెందిన వారవటంలో ఆశ్చర్యంలేదు. పై 'సమావేశంలో జరిగిన చర్చలనీ, ఇతర ప్రకటనలనీ పరిశీలిస్తే కొన్ని ముఖ్యాంశాలని గమనించవచ్చు.

1. మిగతా భారతదేశం కన్నా గోవా ప్రజల ఆదాయం అధికం. ఇక్కడ వ్యక్తిగత ఆదాయం సుమారు రు. 600—భారతదేశం మొత్తంమీద ఇది సుమారు 313 మాత్రమే. ('58—59' లెక్కలు.) ఇది తగ్గిపోతుందేమోనన్న భయం గోవాలో కొందరికి కలుగుతోందిట.

2. ఇక్కడ చదువు వచ్చిన వారి శాతం సుమారు 31 మాత్రమే అయినా (కేరళలో ఇది సుమారు 47. ఆంధ్రప్రదేశ్‌లో 21, మద్రాసులో 31) గోవాలో నిరక్షరాస్యం తక్కిన భారతదేశంలో కన్నా చాలా తక్కువ అనే అపోహ.

3. సంగీతం, భోజనం, పానీయాల విషయంలో పాశ్చాత్య పద్ధతులు బాగా అమలులో ఉండటం వల్ల ఇంకా 'పాత' పద్ధతులనే అవలంబించే వారికన్నా తాము ఎక్కువ అని గోవాలో ప్రచారంలో ఉన్న భావం.

4. పోర్చుగీసు పరిపాలన ఫలితంగా భారతదేశం గురించి గోవాలో చాలామందికి అధికంగా తెలియకపోవటం.

5. కొంకణీ భాషకి సంబంధించిన వివాదం.

6. హైందవ— క్రైస్తవ మతస్థుల మధ్య అనయికమత్య ధోరణి. ఒకవిధంగా భాషా సమస్యకీ దీనికీ చాలా సంబంధం ఉంది.

గోవాలో ఉన్నటువంటి ఆదాయం తక్కువ భారతదేశ భాగాలు కొన్నిటిలోనూ వుంది. కాని ఇది ఆ ప్రాంతాలలో ఇటువంటి 'సమస్య' అని పుట్టించటం లేదు. ఎన్ని తప్పులు చేసినా కేంద్ర ప్రభుత్వం గోవా ఐశ్వర్యాన్ని దోచుకోబోదుకదా! జనాభా తక్కువ కాబట్టి ఈ ప్రాంతంలో జరిగే పెట్టుబడి ఇక్కడివారికి మరింత మేలు చేకూరుస్తుంది.

ఇక చదువు విషయం. ఇక్కడ 'విద్యాభ్యాస సంఖ్యలు' కేరళలోకన్నా తక్కువేనని పైన పేర్కొనటం జరిగింది. గోవాలో విద్యా సంస్థల సంఖ్య కూడా జనాభా ప్రకారంచూస్తే భారతదేశంకన్నా తక్కువే. అంతేకాక లాటిన్, పోర్చుగీస్, సంగీతం—వీటికన్నా ఇంజనీరింగ్, ఫిసిక్స్, కెమిస్ట్రీల అభ్యాసమే నేటి పరిస్థితులకి అనుగుణంగా వుంటుంది!


నేడు భారతదేశంలో ఎందరో పాశ్చాత్య పద్ధతుల ప్రకారం జీవిస్తున్నారు. ఆంగ్లో—ఇండియన్లు, పార్శీలు తమ 'సంస్కృతి' దేశంలో భాగంగా ఉండటానికి అడ్డంగా ఉంటున్నదని వాదించగా మనం వినటంలేదు.

పోర్చుగీసు పరిపాలనకింద భారతదేశం వార్తాపత్రికలు అక్కడ అమ్మటం జరిగేది కాదు. ప్రస్తుతం ఈ విషయంలోనేకాక మరే విషయంలోనూ పెద్ద అడ్డంకులులేవు. క్రమంగా అఖిల భారతదేశం గురించి అపోహలు నశించిపోక మానవు. ఇంగ్లీషు విద్యాభ్యాసంవల్ల కలిగే లాభాలు గోవా జనం గుర్తించక మానరు.

నిర్మొహమాటంగా చెప్పాలంటే 'భాషా సమస్య'కీ మత విభేదాలకీ చాలా సంబంధం ఉంది. క్రైస్తవులు కొంకణిని, హైందవులు మహారాష్ట్రిని బలపరుస్తున్నారని స్థూలంగా చెప్పవచ్చు. కాని ప్రజాభిప్రాయ సేకరణవల్ల ఏర్పడిన నిర్ణయం ఈ సిద్ధాంతాన్ని కొంచెం తారుమారుచేసింది! 1962 లో 42,360 మంది విద్యార్థులు పాఠశాలలో 'బోధనా—భాషగా' మరాఠీని ఎన్నుకోగా, 2519 మంది మాత్రమే కొంకణిని ఎన్నుకున్నారుట! గోవాలో హైందవుల శాతం సుమారు 62, క్రైస్తవులది 36 కాబట్టి హైందవేతరులు సయితం మరాఠీని తీసుకుంటున్నారేమోననే అనుమానం కలుగుతుంది. అవసరంముందు అభిమానం ఎంతోకాలం తట్టుకోలేదు!

భారతదేశం ప్రాచీన సంస్కృతిని ప్రజానీకానికి అందజేసిన ఆధునిక మహాపండితులలో అధికులు పాశ్చాత్యులే—మాక్స్‌ముల్లర్, వింటర్‌నిట్జ్, మాక్‌డొనెల్, బ్రవున్, కాల్‌డ్‌వెల్ వీరందరికీ మనం శాశ్వతంగా కృతజ్ఞులంగా ఉండిపోవలసిందే! (అసలు పాశ్చాత్య దేశాలలో కూడా క్రైస్తవమతం పూర్వం చరిత్రని శాస్త్రీయంగా పరిశీలించటం అనేది పంతొమ్మిదవ శతాబ్దంలోనే కదా ప్రారంభం అయింది? ప్లాటో, ఆరిస్టాటిల్ మొదలయినవారు క్రైస్తవులు కారు!) గోవా మహారాష్ట్రతో కలవకపోవటంచేత అక్కడిజనం క్రైస్తవ ప్రభావాలకి లొంగిపోతారని కొందరు హైందవ మత దురభిమానులు చేసే ప్రచారం ఆ ప్రచారకులకి తమ మతంపట్ల ఎంత నమ్మకం ఉందోమాత్రం తెలుపుతుంది. కాని, గోవాలో 'సతి'కొన్ని శతాబ్దాల ముందే రద్దుకావటం, మరణశిక్ష అక్కడ అమలులో లేకపోవటం, పోర్చుగీసు పరిపాలన మనం బ్రిటిషువారివద్ద నేర్చుకున్న ప్రజాస్వామ్య పద్ధతులమీద నిర్మించబడిన పరిపాలన కన్నా ఉత్తమం అని వాదించటానికి ఆధారాలు కాజాలవు.

భారతదేశం అనే ఉపఖండంలో ఉన్నటువంటి వైవిధ్యంలో గోవాకి సురక్షితమయిన స్థానం ఉండకపోదు. పరిపాలకులు మాత్రం సంస్కరణలు అమలు పరిచేటప్పుడు సహనంతో, సానుభూతితో నడుచుకొనటం అవసరం. —ఎస్సార్



మంగేష్ దేవాలయం.

చర్చి...

"ఇది కెథ్రెడిల్ మాత్రమేకాక మ్యూజియం కూడాను" అన్నాడు అక్కడ బోర్డు చదివి మాలో ఒకడు. బయటికి ఎంత పెద్దదిగా కనిపించిందో లోపలికి వెళ్లగా మరింత పెద్దదిగా కనిపించింది. కిటికీలో నుంచి వచ్చి పడుతున్న ఉదయం ఎండ కాంతిలో ఒక తెల్లటి సెయింట్ విగ్రహం ధగధగలాడి పోతోంది.. సగం పాడుపడిపోయినట్లే ఉన్నా లోపలి మందిరం కేవలం దాని పరిమాణాల వల్ల మనస్సుకి హత్తుకు పోయేట్లు ఉంది..

"ఇక్కడ విజయనగరం శాసనాలు కూడా ఉన్నాయి.. ఇవి తెలుగు అక్షరాలు కావూ?.." "కావు, కన్నడం.." మ్యూజియంలో ప్రదర్శనం సంఖ్య తక్కువగా ఉన్నట్లనిపించింది...

*　　*　　*

(పాంజిమ్‌లో చిన్న 'ఉడిపి కేఫ్'లో పొద్దున టిఫిన్‌కి వెళ్లాము. అక్కడ కాఫీ, టీల బదులు ఎందరో సోడా మాత్రం తాగి వెళ్లిపోతున్నారు. పచ్చి మిరపకాయ బజ్జీలు అక్కడ ఉదయం ఫలహారాలలో ఒకటి!)

ఎదురుగా కనిపించే పెద్ద, ఎర్రటి చర్చి 'బోమ్ జీసస్'ది. చర్చి ముందు చిన్నచిన్న అంగళ్లల్లో కోకోకోలా, టీ, కేక్‌లూ, బిస్కట్లూ వగయిరా అమ్ముతున్నారు. ఒక అంగడిలో కొవ్వొత్తులు క్రాస్‌లూ మొదలయినవి, వీటికి ఎదురుగా చర్చి ఆవరణలోనే? కొంతదూరంలో ఒక 'రెస్టారెంట్, బార్'...

"మీరు ప్రవేశించేది దేవాలయం. మౌనం పాటించి మీ భక్తిని చూపండి.." అని ఒక చిన్న నోటీసు ఉంది. లోపల ఎవరూ లేరు. చాలా పెద్ద మందిరం. ఆల్టార్ అవతల బంగారు రంగు నగిషీల కళ శిల్పం, ద్వారం పక్కనే బల్లమీద ప్రశాంతంగా వెలుగుతున్న కొన్ని కొవ్వొత్తుల్ని, ఈ బల్ల పక్కనే

గోమంతక దర్శనం

(44-వ పేజీ తరువాయి)

వివిధ పరిమాణాలు కల కొవ్వొత్తుల కట్టలు, ఒక్కొక్క కట్ట పక్కనా 10, 25, 35..అని వాటి ధరలు సూచించే అట్టముక్కలు..

"ఇదే సెయింట్ ఫ్రాంసిస్ జ్సావియర్ బొటన వేలు." ఒకగాజు డోమ్ కింద చెక్క పెట్టెలో అమర్చి ఉంది. జాగ్రత్తగా పరిశీలిస్తేగాని గోరు కనిపించ లేదు.

"ఇక్కడొక బంగారు రోజాపువ్వు ఉంది. తప్పకుండా చూడు." అని బోమ్‌జేసస్ బాసిలికాలో మరొక ప్రాంతం నుంచి వచ్చి బొటనవేలు చూస్తున్న మమ్మల్ని ఉద్దేశించి చెప్పాడు మా మిత్రులలో ఒకడు. అప్పుడే ఒక పెట్టెకి తాళం వేసి అందులోని పువ్వుని చూసి వస్తున్న వారితో తిరిగి వచ్చేస్తున్నాడు అక్కడ పనిచేసే ఒక అబ్బాయి. మళ్లీ తెరవమని అడగగా చిరునవ్వుతో తాళం తీసి లోపలి గులాబీని చూపించాడు. తీసుకుంటాడో లేదో అని సందేహిస్తూనే ఇచ్చిన రూపాయిని స్వీకరించి, "థాంక్ యూ!" అన్నాడు...

సెయింట్ ఫ్రాంసిస్ కళేబరం పదిసంవత్సరాల కొకసారి మాత్రం ప్రదర్శిస్తారు. దాన్ని ఉంచిన వెండి పేటిక చిన్న వేదిక పైన ఉంది. పక్కనే బల్ల మీద రెండు నోట్‌బుక్‌లు ఉన్నాయి. ఒకటి 'ప్రార్థన'లకి, మరొకటి 'కోరికల'కి. చీటీలు చింపి అక్కడే పెట్టెలలో వెయ్యవచ్చు.— ఇంకా ముఖ్యమయిన కోరికలు కోరుకునేవారు అక్కడి ఫాదరీని చూడవచ్చు, అని ఒక కరపత్రం మీద...

*　　*　　*

'అదిగో మంగేష్ గుడి—" గుడికి వెళ్లాలంటే ఒక చిన్న గచ్చు వేసిన దారి మీదుగా నడిచి వెళ్లాలి. ఈ దారి ప్రవేశించే చోట కోకోకోలా, టీ వగైరా దొరికే అంగళ్ళు, వాటి పక్కనే ఎండిపోయిన చిప్పి కొబ్బరికాయలు అమ్మేవారు— "కొబ్బరికాయలకి ప్రసిద్ధి చెందిన గోవా!"

గుడి వైపుకి నడిచి వెడుతూ ఉంటే, చిన్నపిల్లలు కొందరు వెంటపడ్డారు. తుప్పుంచిన పూలమాలలు కొనమని గోల చేశారు..

గుడి కొంచెం ఎత్తు ప్రదేశంలో ఉంది. కింద చక్కటి ఆకు మడీ, కొబ్బరి చెట్లూ, కొలనూ— అందులో బట్టలు ఉతుకుతున్నారు. గుడి లోపలికి వెళ్లగానే ఒక వృద్ధుడు మాకు ఎదురయి తన పాదం వంక చూపాడు. చీము కారుతున్న పెద్ద పుండుని సూచించి ధర్మం చెయ్యమని సంజ్ఞలు చేశాడు...

గర్భగుడిలోనికి రమ్మని ఎర్ర పంచె కట్టుకున్న అర్చకుడు ఆహ్వానించాడు. తీర్థం పుచ్చుకున్న తర్వాత, "దక్షిణ లేవు, దక్షిణ లేవు... అని మాలో ఒకరికి మరీ మరీ చెప్పాడు. (అది కొంకణి అని కొందరు, మరాటీ అని మరికొందరు). వెళ్లేముందు అందరికీ పుష్పం ఇచ్చాడు...

*　　*　　*

మార్గాంవ్ అంతా నిశ్శబ్దంగా ఉంది. ("ఆదివారం, మీరేమీ చూడలేరు" అని చెప్పాడు టూరిస్టు ఆఫీసు అధికారి మాకు.) అబ్బె ఫరీయా వీధి ద్వారా ఊరు వదిలి వెళ్లిపోయాము. అంతదాకా ఎత్తుపల్లాలతో, కొబ్బరిచెట్ల తోపులతో పచ్చగా కనిపించే దృశ్యాలు పోయి చదునుగా మారిపోయింది భూభాగం. మళ్లీ 'కొర్తాలిమ్' చేరేదాకా వృక్షసంపద అంతగా చూడలేకపోయా మనిపించింది..

వాస్కోడాగామా జనాభా సుమారు ఆరువేలు. కాని అక్కడ పెద్దహోటలూ, ఎన్నో షాపులూ, కార్లూ తూర్పు ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలని పోలి ఉండేట్లు చేసింది. ("ఇక్కడ బాంకులలో ఏడు కోట్ల డిపాసిట్లు ఉన్నా"యని ఒకమిత్రుడు చెప్పాడు!)

"ఇక్కడ ఇంపోర్టెడ్ విస్కీసీసా 55 రూపాయలే!" సంతోషం, ఆశ్చర్యం, కొంత విచారం, ఎందుకంటే పాంజిమ్‌లో సీసాని 65కి కొనటం జరిగింది...

మార్మగోవా హార్బర్ ఎంతో అందమయినదని ప్రసిద్ధి. కొండ మీదకి వెళ్లే రోడ్డు వెంబడే ప్రయాణం చేస్తూ ఉండగా నీలంగా మెరిసిపోయే సముద్రంలో నల్లగా, ఎర్రగా, తెల్లగా కనిపించే ఓడల దృశ్యం ఇందులో అతిశయోక్తి ఏదీ లేదనిపించేట్లు చేసింది...

కొర్తాలిమ్ వద్ద బల్లకట్టు మీదకి కారు ఎక్కించి జువారీ నది అవతల తీరం చేరుకున్నాము. తిరిగి పాంజిమ్‌కి పోయే దారిలో ఒక చిన్న అంగడిలో టీ పుచ్చుకున్నాము. ఎంతో శుభ్రంగా కనిపించే 'వెయిటర్' అంత శుభ్రంగానూ కనిపించే ఆకుపచ్చ తెల్లటి కప్పు సాసర్లలో చిక్కటి టీ అందచేశాడు. ఒక కప్పు టీ అక్కడ 7 పైసలు..

*　　*　　*

సాయంత్రం పాణాజీ చేరుకునేసరికి మర్నాడు ప్రజాభిప్రాయ సేకరణ వల్ల చేసిన నిర్ణయం సందర్భంలో పెద్ద ఉత్సవాలు జరిపే ఏర్పాట్లు జరుగుతున్నాయి. 'విక్టరీ సెలెబ్రేషన్స్', 'విక్టరీ మీటింగ్' వంటి మాటలు లౌడ్ స్పీకర్‌లలో తరుచు వినిపిం

——>

గోవా సంగ్రహ చరిత్ర

గోవా చుట్టూ మూడువైపుల కొండలూ, ఒక వైపున సముద్రం ఉండటంచేత 15, 16 శతాబ్దాలలో నావిక—బలం అధికంగా కల పోర్చుగీసు వారికి తమ వలస ప్రాంతాన్ని రక్షించుకోవటం తేలిక అయింది. ఇదేగనక జరగక పోయినట్లయితే 'గోవా చరిత్ర'కి నేడు ఉన్నంత ప్రాముఖ్యత ఏర్పడేది కాదేమో! భారతదేశంలో వివిధ ప్రాంతాలని ఎన్నో రాజవంశాలు పరిపాలిస్తూ వచ్చాయి. సామంతులుగా ఉంటున్న అందరి రాజుల చరిత్రలూ మామూలు చరిత్ర పుస్తకాలలో వివరంగా ఇవ్వటం జరగదు. గోవా చరిత్రా కొంతదాకా ఇంతే!

మౌర్యులు

చాలా పాతకాలంలో గోవాని మౌర్యులని పేరు పెట్టుకున్నవారు పరిపాలించే వారుట. మగధ మౌర్యుల సామంతులుగా ఉండి ఆ పేరే పెట్టుకున్న వీరు మగధ సామ్రాజ్యం నశించిన తర్వాత వరుసగా శాతవాహనులు, ఆభీరులు మొదలయిన వారికి సామంతులుగా ఉండేవారు, మౌర్యుల తర్వాత 'బత్పుర' వంశంవారు, వారి తర్వాత 'గోమిన' వంశంవారు కదంబ, చాళుక్య సామ్రాజ్యాలకింద ఈ ప్రాంతాన్ని పరిపాలించినట్లు శ్రీ జార్జి ఎం. మొరేస్ రాశారు.

పశ్చిమ చాళుక్యుల పిదప రాష్ట్రకూటులు గోమిన వంశం వారిని తోసివేసి 'శిలహార' వంశం రాజులని గోవా ప్రాంతం సామంతులుగా నియమించాలని ప్రయత్నించి పదవశతాబ్దం చివరి భాగంలో కృతార్థులయ్యారు. అయితే త్వరలోనే కాదంబరాజు ఒకడు మళ్ళీ శిలహారులని తన సామంతరాజులుగా చేసుకున్నాడు.

కాదంబుల తర్వాత, 14 వ శతాబ్దంలో, బాహ్మనీ సుల్తాన్ అల్లావుద్దీన్ షా గోవాని జయించాడు. (కాని, 1467 లో మహమ్మద్ గవాన్ పూర్తిగా ఆక్రమించుకునే దాకా గోవా బాహ్మనీ రాజ్యానికి లొంగిపోలేదు.)

విజయనగరం

దక్షిణ భారతదేశంలో మహమ్మదీయ విస్తరణని అరికట్టిన విజయనగరసామ్రాజ్యం అధిపతులలో ఒకడయిన విరూపాక్షుడు 1472 లో ప్రయత్నించి విఫలుడయినప్పటికీ బుక్క రాజ కుమారుడు (హరిహరుని కొడుకు) గోవాని మహమ్మదీయ పరిపాలన నుంచి విడిపించాడు.


గోవా విజయనగర సామ్రాజ్యంలో ఒక శతాబ్దం పాటు ఉండి, 1472 లో మహమ్మద్ గవాన్‌కి లొంగిపోయింది. బాహ్మనీ సామ్రాజ్యం నశించిన తర్వాత బీజాపూర్ సుల్తాన్ (ఆదిల్‌షా) చేజిక్కింది.

పోర్చుగల్

ఈ కాలంలో పోర్చుగీసువారు వ్యాపారనిమిత్తమయి భారతదేశానికి రావటం మొదలుపెట్టారు. వీరి నాయకులలో ఒకడయిన ఆఫోంసో ఆల్‌బుకర్క్ విజయనగరం నావికదళాధిపతితో చేరి గోవాని వశపరుచుకున్నాడు. ఈ కాలంలోనే ఈహ్మాజంని గోవాలోని మహమ్మదీయులని వెళ్ళగొట్టమని ప్రోత్సహించాడని కూడా చదువుతాము— 20 వ శతాబ్దంలో, సుమారు 98 శాతం పోగా మిగిలిన వారితోనే గోవా మహమ్మదీయ జనాభా సంఖ్య

1571 దాకా గోవా కోసం యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి కాని ఆ తర్వాత పోర్చుగీసువారి అధికారం పూర్తిగా బలపడిపోయింది. నేటి గోవా 'ప్రత్యేక సంస్కృతి' పోర్చుగీసువారి పరిపాలన ఫలితమే అనవచ్చు. బెర్ట్రాంట్ రస్సెల్ చెప్పినట్లు పశ్చిమ యూరప్‌లో ఎన్నోదేశాలు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, విజ్ఞానం ఎన్నుకున్నప్పుడు, స్పెయిన్ వలె పోర్చుగల్ మత ప్రధానమయిన సూత్రాలనే ఎన్నుకుని వాటిని తోసివచ్చింది. క్రైస్తవమత విస్తీకరణ మాత్రమే తమ కర్తవ్యంగా భావించే సూత్రాలని స్వీకరించింది. 'ఇన్‌క్విసిషన్' పోర్చుగల్ నుంచి గోవాకి కూడావచ్చి అక్కడి క్రైస్తవేతరులని విపరీతంగా బాధపెట్టడం ప్రారంభించింది. 1544 సెయింట్ ఫ్రాంసిస్ జ్జేవియర్ అంతటి వాడే, "ఇండియన్లకి మనకి ఉన్నట్లే అనుభూతి ఉంటుంది. మనకి తగని అనుభవాలు వారికి కలిగేట్లు ఎందుకు చెయ్యాలి?" అని తోటి 'జెసూట్'కి రాశాడుట. హైందవ మతానికి సంబంధించిన అలవాట్లని బలవంతంగా పెకిలించి వెయ్యటానికి పోర్చుగీసు పరిపాలన ప్రయత్నించింది. దేవాలయాలని విధ్వంసించటం వాటి నిర్మాణాన్ని నిషేధించటం, భారతదేశానికి 'చెందిన' వస్త్రధారణని నిషేధించటం, దేశ భాషలలో విద్యాభ్యాసాన్ని అనుమతించకపోవటం వంటివి ఎన్నో అమలులోకి వచ్చాయి. 19 వ శతాబ్దం ప్రారంభంలో పోర్చుగల్‌లో ప్రజాస్వామిక విప్లవ చైతన్యం రావటంతో, ముఖ్యంగా మార్క్విస్ ఆఫ్ పోంబాల్ నాయకత్వం కింద పోర్చు

(64 వ పేజీ చూడండి)



మార్మగోవా హార్బర్ దృశ్యం.

ప్రజల నిర్ణయం

జనవరిలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ నిర్ణయాలు—

గోవా కేంద్ర పాలితంగానే ఉండాలని కోరిన వారి సంఖ్య- 172,191.

గోవా మహారాష్ట్రలో చేరాలని కోరిన వారి సంఖ్య- 138,170.

మొత్తం వోట్లు 388,392


చెల్లనివి ,, 7,272

చాయి. రాత్రి మా సర్క్యూట్ హౌస్ పక్కనుంచే సుమారు ఏభయి, అరవయి కార్లు ఒక ఊరేగింపులో వెళ్ళాయి... (శ్రీ బండోద్కర్ ఇల్లు సర్క్యూట్ హౌస్ దగ్గిరే అని విన్నాము .)

ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, గోవా ప్రాంతానికి చెందకపోయినా కొంకణి మాతృభాష కల ఒకరితో గోవాలో 'కాజు' (జీడి) నుంచి తయారు చేసే మద్యం గురించి చెప్పగా ఆయన, "కాజూ చొసురో, జీవాక బొరో! అంటారు, తెలుసా?" అని అడిగారు. ఈ కొంకణి సామెత అర్థం "కాజుసుర (మద్యం) జీవి (ఆరోగ్యాని)కి మంచిది"

*　　*　　*

"మా గోవా ప్రజలు కల్లాకపటం ఎరుగనివారు. తిండి కీ, తాగటానికీ ఉంటే మరేమీ అక్కర్లేదు మాకు" అని చెప్పాడు మాతో ఒక పెద్దమనిషి, పాంజిమ్‌లో... — ఎస్సార్.



ప్రేమ నగర్‌లో ఒకరోజు

పిల్లలమర్రి హనుమంతరావు

ప్రేమంటే నాకు తగని ఇష్టం, త్యాగం కనబడిన చోట చేతులెత్తి దణ్ణం పెడతాను. ఇక ప్రేమ త్యాగాలు కలిసి కట్టుగా వున్నాయంటే చెప్పేదేమున్నది? కారప్పొడిలో ఇడ్లీ నంచుకుని తిన్నంత ఇష్టం.

నా సంగతి తెలిసిన మిత్రుడీ మధ్య కనబడి, ప్రేమనగర్ కథా కమామిషు చెప్పాడు. "ఒకతూరి ప్రేమనగర్ చూచి రాకూడదూ?" అని సలహా ఇచ్చాడు.

మర్నాడే ఆఫీసుకి సెలవ చీటి రాసి, బొంబాయి వి.టి. స్టేషన్‌లో వారణాసి ఎక్స్‌ప్రెస్ ఎక్కి, సీదాగా కాశీ చేరాను.

కాశీలో కాలుపెట్టిన నాకు, విశ్వనాథుడు పట్ట లేదు. విశ్వవిద్యాలయమూ పట్టలేదు. గదోలియా, సెంటరులో నిల్చుని ప్రేమనగర్ గూర్చి వాకబు చేశాను. అక్కడ ఎవరికీ ప్రేమనగర్ భోగట్టా తెలిసి వచ్చు లేదు. ఆ పేరుగల వూరేదీ ఆ ప్రాంతాలలో లేదని గట్టిగా చెప్పారు.

ఏదిరా దారి, భగవంతుడా. ఎడ్రస్ తప్పు రాసుకు తెచ్చానా ఏమిటన్ని మిత్రుడిచ్చిన యడ్రస్ కాగితాన్ని చూశాను. అందులో "ప్రేమనగర్, అతి నిర్జన ప్రాంతం, గంగానది ఒడ్డు" అని రాసి వున్నది. గంగానది ఒడ్డు అంటే కాశి అని భ్రమించి పరిగెత్తుకుని వచ్చాను. గంగానది దేశంలో ఈ చివర నుంచి ఆ చివర దాకా వున్నది. ఈ ప్రేమనగర్ ఎక్కడున్నదని కనుక్కోగలను.

నా అవస్థని గమనించి ఒక భయ్యా సలహా ఇచ్చాడు. "బరానిలో ప్రేమనగర్ గూర్చి విన్నాను. అక్కడకు వెళ్ళి ఎన్‌క్వైర్ చేయండి."

అదే పదివేలనుకుని, బరానికి పయనమయ్యాను. చిన్నబండిలో ఒకరాత్రి ఒక పగలు ప్రయాణం చేసి బరాని చేరుకున్నాను.

బరాని స్టేషన్‌మాస్టరుని ప్రేమనగర్ ఎక్కడున్నదని అడిగాను. నా వంక వింతగా చూచాడు. "తెలుగువాండ్లా?" అని అరవయాస తెలుగులో సన్నడిగాడు. అవునన్నాను. "అదే అనుకున్నాను సుమీ" అన్నట్లు బుర్ర వూపి వెకిలి నవ్వునవ్వాడు. హేళన చేస్తూనే ప్రేమనగర్‌కి వెళ్ళే దోవ చెప్పాడు.

కార్లు పోయే రోడ్డున ప్రేమనగర్ పాతిక మైళ్ళు వుంటుందిట. స్వంత కార్లలో పోవుటయేకాని అక్కడి కెవరూ బాడిగ బండ్లు కట్టరుట. కాలినడకన ఆరు మైళ్ళు. గంగానది ఒడ్డున ఐదు మైళ్ళు పోయి కుడివైపు తిరిగి మైలుదూరం నడిచిన తర్వాత "అతి నిర్జన ప్రాంతం" అని బోర్డు వుంటుందిట. అప్పుడు ఎడమవైపుకి తిరిగి సుమారు రెండు వందల గజాలు నడిస్తే ప్రేమనగర్ వస్తుందిట.

చీకటి బడ్డది గనుక రేపు పొద్దున ప్రయాణం పెట్టుకుందామని నా కనిపించింది. "ఈ రాత్రి పడుకోవటానికి విశ్రాంతి గదులు లాటివి వున్నాయా?' అని అతనిని ప్రశ్నించాను.

ప్రేమనగర్ వెళ్లే యాత్రికులకు గదులివ్వటానికి రూల్సు ఒప్పుకోవని నిర్మొగమాటంగా స్పష్టం చేశాడు.

"ఎందుకో ఈ సమాజానికి ప్రేమంటే అంత ద్వేషమ"ని నిట్టూర్చాను. ఆ రాత్రి ప్లాటుఫారం మీదనే చలిలో గడిపాను.

ఉదయం బయలుదేరిన వాడిని తిండితిప్పలూ లేక శోష వచ్చే స్థితిలో మిట్టమధ్యాహ్నం ప్రేమనగర్ చేరాను.

ప్రేమనగర్ కొన్నివేల యకరముల ప్రదేశంలో వున్నది. చుట్టూతా గోడ కట్టారు. నాలుగు దిక్కులా నాలుగు గేట్లు—ఒకగేటు వద్దకు చేరాను.

వలయాకారంగా అమర్చబడిన 'ప్రేమనగర్' అనే అక్షరములు తమనే చూడమన్నట్లు నన్నాహ్వానిస్తున్నాయి. అంత హీన స్థితిలో కూడ 'ప్రేమ' చూడగానే నా మనస్సు పొంగిపోయింది. ఉత్సాహంగా గేటులో నుంచి లోపలకు పోబోయాను. అక్కడున్న గూర్ఖాలు నన్ను ఆపాడు. "లోపలకు పోవాలి" అన్నాను. గేటుకి ఆనుకున్న చిన్న కుటీరంలోకి తీసుక పోయారు.

గుమాస్తాలాటి ఆయన టేబుల్ వేసుకుని కూర్చుని వున్నాడు. (అక్కడ వారిని గుమాస్తాలని గాని, మేనేజర్లని గాని పిలువగూడదట. ఆ పేర్లంటేనే పరమ అసహ్యమని నాకు తరువాత తెలిసింది.) ప్రేమనగర్ చూడాలనే కోరికతో, బొంబాయి నుంచి అష్టకష్టముల కోర్చి ఇక్కడకు వచ్చానని నా కథ యావత్తూ చెప్పాను. ఆయన కథంతా విని ఒక పెద్ద ప్రింటెడ్ ఫారము నాకిచ్చి పూర్తి చేయమన్నాడు.

ఎండలో నడచి రావటం వలన నా కళ్ళు బైర్లు కమ్మి అక్షరాలు కెలికినట్లు కనబడ్డాయి. నన్ను చూచి జాలిపడి, "ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. నేనే పూర్తి చేస్తాను." అన్నాడాయన. కృతజ్ఞతా భావం నాలో పెల్లుబికింది. ఆయన ప్రశ్నించాడు.

"మొదటిది — మీరు అంగహీనులా, లేక మూకాంధ బధిరులా?"

నాకు కోపం వచ్చింది. "మీకు కనబడటం లేదటయ్యా."

"అధిక ప్రసంగం చేయకండి. ఈ కాగితంలో రాసిన ప్రశ్నలు చదువుతున్నాను. మీరు అవును లేక కాదు అని మాత్రమే చెప్పాలి. అంగహీనులా, మూకాంధ బధిరులా?"

"రెండూ కాదు."

"విద్యావంతులా, లేక విద్యాహీనులా?"

"చదువుట, రాయుట వచ్చును. డిగ్రీలు లేవు గనుక విద్యావంతుడిగా ఎన్నికకాదు."

"స్త్రీలా? పురుషులా?" "బాలురా? వృద్ధులా?"

"కలవారా? లేనివారా?" "దేశీయులా? విదేశీయులా?"

(చిన్నప్పు డాడుకున్న "కత్తి? కర్రా?" ఆట గుర్తుకి వచ్చింది.)

ఇట్లాంటి ప్రశ్నలు ఒకటనేమిటి? నానారకములైన అడ్డదిడ్డ ప్రశ్నలు వేశాడు. అన్నిటికీ ఓపికగా సమాధానాలు చెప్పాను.

"ఒక్క ఐదునిముషాలు బయటకు వెళ్ళి కూర్చోండి. రిజల్టు చెపుతాము" అన్నాడు.

ఐదు నిముషముల తర్వాత బయలుకు వచ్చాడు.

"మీ సమాధానాలకు మేము మార్కులు వేశాము. మీకున్న క్వాలిఫికేషన్లు—దేశీయులు, పురుషులు. తలిమ్నా ప్రశ్నలకు సున్నా మార్కులు. ఎందుకంటే మీరు ఏదీకాదు. అంటే మొత్తం నూటికి పది మార్కులు వచ్చాయి. ప్రేమనగర్‌లో ప్రవేశించాలంటే కనీసం ముప్పయి మార్కులన్నా రావాలి. సారి, మిస్టర్ రావు. మీకు ప్రేమనగర్‌లో ప్రవేశార్హతలేదు." అన్నాడు.

"సార్, సార్, మీరిట్లా మాట్లాడకండి. ఎంతో కష్టబడి ఇంతదూరం వచ్చాను. మీరు సహాయం చేయాలి. మీ కష్టాన్ని వుంచుకోను. ఋణమో, ఫణమో..." నా మాటలు పూర్తి కాలేదు. కోపంతో ఆయన కన్నులు జేవురించాయి.

"యూ, ఫూల్ గెటౌట్. ప్రేమనగర్‌లోనే లంచం ఇస్తావా? రాస్కెల్" కోపంతో ఆయన వూగిపోతున్నాడు. గూర్ఖాలు నన్ను బయటకు గెంటారు.

తోట ద్వారంపై వలయాకారంతో అమర్చబడిన 'ప్రేమనగర్' లోహాక్షరాలు నన్ను వెక్కిరిస్తున్నాయి.

నెమ్మదిగా, నీరసంగా అడుగులో అడుగు వేసుకుంటూ దూరంగా నడిచిపోతున్నాను. ఓటమిని ఒప్పుకొనుటకు నా మనస్సంగీకరించుట లేదు.. ఈ పరీక్ష గూర్చి తెలిసి వుంటే ముందుగానే ప్రిపేరై వుండే వాడిననుకున్నాను. దూరంగా చెట్టుకింద ఒక నీగ్రో యువతి సేద తీర్చుకుంటూ వుండటం నా కంటబడింది.

"ఏమండోయ్, ప్రేమనగర్‌కి దారి ఎటు?" అని నన్ను చూస్తూనే ఇంగ్లీషులో ప్రశ్నించింది. నా మెదడులో ఒక ఆలోచన మెరుపు వలె మెరిసింది.

"నేను ప్రేమనగర్‌ని చూపెట్టదను గాని, మీరు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ఆ సమాధానాలు బట్టి మీకు ప్రవేశార్హత లభిస్తుంది." అన్నాను.

"అడగండి. చెపుతాను."

ఆ గుమాస్తాలాటి ఆయన నన్నడిగిన ప్రశ్నలన్నిటినీ అడిగాను. ఆవిడ సమాధానాలు చెప్పింది.

"చూడండి మీ క్వాలిఫికేషన్ విదేశీయులు స్త్రీలు అంటే నూటికి పదిమార్కులు. మీరు ప్రేమనగర్‌లో ప్రవేశించుటకు వీలులేదు.

"ఎట్లాగండీ? ఇండియాలో ఇంత దూరం వచ్చింది ప్రేమనగర్ చూడటానికే గదా?" అన్నదావిడ విసుగ్గా.

"నేను గూడ ప్రేమనగర్ చూడటానికి బొంబాయి నుంచి వచ్చాను. పది మార్కులు రావటంతో బయటకు గెంటారు. మీకు కూడ అదే గతి పడుతుందని హెచ్చరిస్తున్నాను." అన్నాను మంచిగా.

"ఏమి చేయుట చెప్మా?" అన్నదావిడ.

"మీరు మరొక విధంగా భావించకపోతే ఒక ఉపాయం చెపుతాను. చూడండి. నీటిలోని కలువ భామకు నింగిలోని చందమామకు అనుబంధం, మంటిలోని పద్మ కన్నెకు మింటిలోని సూర్యభగవానునికి ప్రియబాంధవ్యం, వూరిలోని వుప్పురాయి అడవిలోని చెట్టుకాయి వెరసి ఆవకాయ. ఇదే ప్రకృతి రహస్యం. అవునంటారా? ఆ విధంగానే ఆఫ్రికాలో పుట్టి పెరిగిన మీరూ, ఇండియాలో వున్న నేను కలిసిన ఈ కలయికకు ఘనత వహించిన విధాత ఒక ప్రయోజనాన్ని ఆశించాడు. అవునంటారా? కాదంటారా?" అన్నాను.

ఆవిడ నవ్వింది. "ప్రతి విషయంలోనూ చక్కటి సంబంధాన్నీ, సమన్వయతనూ చూడటంలో మీకు మీరే సాటి వోలె వున్నారు. అసలు విషయమేమిటో త్వరగా చెప్పండి."

నేనాలోచించిన ప్లానంతా ఆవిడకు చెప్పాను. ప్రేమనగర్ దర్శన భాగ్యం కలిగితేనే చాలి అబద్ధం ఆడుటకు ఆవిడ అంగీకరించింది.

మేమిద్దరమూ తూర్పువైపున వున్న మరొక గేటు వద్దకు నడిచాము. ఆ గేటు దగ్గర వున్న ఇంకొక గుమాస్తాలాటి ఆయన మా ఇద్దరికీ చెరొక పదిమార్కులు ఇచ్చి తిరిగి పొమ్మన్నాడు.

"చూడండి, మీతో కొంచం పర్సనల్‌గా మాట్లాడాలి" అని పక్కకు పిలిచాను.

ఆయన నన్ను అనుమానంగా చూస్తూనే అనుసరించాడు.

"మేమిద్దరమూ అంతర్జాతీయ ప్రేమికులం. నిజం చెప్పాలంటే భగ్న ప్రేమికులం. జాతిమతాలు వేరగుట వలన కోరుకున్నటువంటి వివాహం చేసుకోలేని యువతీయువకులం. ఆఫ్రికా వెళ్ళాను. ఆమె ఇండియా వచ్చింది. ప్రపంచమంతటా కలిసి తిరిగాము. మాకెక్కడా శాంతి లేదు. ప్రేమనగర్‌లో శాంతి దొరుకుతుందనే ఆశతో ఇక్కడకు వచ్చాము. ఇప్పుడు మా ఆశలను అడియాసలు చేయుట మీకు తగునా?" అని కన్నులలో నీరు నింపుకుంటూ జాలిగా ఆయనను ప్రశ్నించాను.

"నన్ను క్షమించండి. మీలాటి వారు మా ప్రేమనగర్‌కి ప్రత్యేక అతిథులు. ఇప్పుడే కృష్ణమూర్తి గారికి ఫోన్ చేస్తాను." అని వినయంగా నాతో అని లోపల గదిలోకి వెడుతూ, "భగ్నప్రేమికులు, అందులో అంతర్జాతీయ భగ్నప్రేమికులంటే మాటలా మరి" అని ఆయన సన్నగా అనుకోవటం నేను వినబడింది.

పది నిముషములలో కుటీరం బయట కారు ఆగిన చప్పుడయింది. మేమందరమూ బయటకు వచ్చాము. కారులో నుంచి ఇరువది రెండు సంవత్సరముల ఆజానుబాహుడు, సుందర రూపుడైన యువకుడొకడు దిగాడు. అతని వెనుకగా సుందర రూపసి ఐన ఇరువది సంవత్సరముల యువతి వున్నది.

"వీరు కృష్ణమూర్తిగారు. ఇక్కడ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ లాటి ఆయన. ఈయన రావుగారు—ఫోన్‌లో వీరి గురించే నేను మాట్లాడింది" అని మా ఉభయులనీ ఆ గుమాస్తాలాటి ఆయన పరిచయం చేశాడు. ఇద్దరమూ కరచాలనము చేసుకున్నాము. కృష్ణమూర్తిగారు ఆ యువతిని నాకు పరిచయం చేశాడు. "ఈవిడ నా భార్య మోహినీదేవి. వెల్‌ఫేర్ ఆఫీసర్ లాటి ఆవిడ" నేను కూడ నీగ్రో యువతిని సాధ్యమైనంత మెలోడ్రమటిక్‌గా పరిచయం చేశాను.

"అవును, పాపం, వారు ఫోనులో చెప్పారు." అని సానుభూతిని ప్రకటించారు మోహినీదేవి, కృష్ణమూర్తి.

మా ఇద్దరికీ ఎయిర్ కండిషన్ అతిథిగృహంలో ప్రత్యేకంగా బస యేర్పాటు చేశారు. స్నానం చేసి, మృష్టాన్న భోజనము తిన్నాము. (పాపం ఆ నీగ్రో యువతికి ఆవకాయను చూస్తూనే వాంతి అయింది) కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాము.

సాయంకాలం ప్రత్యేకమైన కారులో మా ఇద్దరకు ప్రేమనగర్‌ని చూపెట్టారు.

ఆహా! ఆ వైభవం వర్ణించుటకు ఒక కావ్యం సరిపోదు. అంతా పెద్దతోట—ఒక చిన్నపట్టణం—పెద్ద పల్లెటూరు! అన్ని వైభోగాలు అందులోనే వున్నాయి. చిన్నచిన్న కుటీరాలు, పెద్దపెద్ద మేడలూ వున్నాయి.

అక్కడక్కడా చెరువులు, బావులు, గోతులు.

రకరకాల పశువులు, సింహాలు, పులులు, పిల్లులు ఎలుకలూ అన్నీ ఎక్కడికక్కడ అమర్చి పెట్టినట్లు స్వంత సఖ్యతగా వున్నాయి.

మరొక చోట పలురకాల పక్షులు, గరుత్మంతులూ, గద్దలూ, కాకులు, మిడతలూ—అది ఇది అని పేరేలా, అన్నీ వున్నాయి.

ఇక మనుష్యుల సంగతి. విద్యావంతులూ, విద్యాహీనులు, స్త్రీలు, పురుషులు—యువతీ, యువకులు బాలురూ, వృద్ధులూ కలవారు, లేనివారు— దేశీయులు, విదేశీయులు—అంగవికలులూ— మూకాంధ బధిరులు. ఒకరని యేమిటి? ఆ ప్రశ్నల పట్టీలో పేర్కొన్న వారందరూ ప్రేమనగర్‌లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. (మొదట అతినిర్జన ప్రశాంతప్రదేశమని చెప్పి అన్నీ వున్నాయి. అందరూ వున్నారు. ఏమిటీ గందరగోళమని పాఠకులకు సందేహం రాకూడదు మరి!) ఎక్కడికక్కడ సరళత సౌమ్యత ఆప్యాయత శాంతి ప్రేమ వగైరాలు వెల్లివిరుస్తున్నాయి.

నేను అమెరికా వెళ్ళలేదు. "డిస్నీలాండ్" చూడలేదు. కాని ప్రేమనగర్ ముందు డిస్నీలాండు తీసికట్టేనని నా మనస్సులో అనిపించింది. (ఇండియాలో పాత జమీందారులూ రాజులూ మహారాజులూ హోటళ్ళ వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తున్నారని విదేశాలలో అపఖ్యాతి వచ్చిందిట. వారికి జమీందారు భీరవర్మగారి ప్రేమనగర్ చూపితే ఎంత బాగుంటుంది!)

డ్రైవరు రోడ్డు పక్కగా కారు ఆపి మాతో అన్నాడు. "అటు దూరంగా చెట్టు నీడని కూర్చున్న ఆవిడ రాణి సాహెబావారు. జమీందారు తల్లిగారు. ఈ చరమదశలో తాపత్రయాలను వదుల్చుకుని శేషజీవితాన్ని ప్రశాంతంగా గడుపుదామని నిశ్చయించుకుని ఇక్కడకు వచ్చింది."

నేను అటు చూశాను. దూరంగా వృక్ష ఛాయన వాడత కుర్చీలో ఒక వృద్ధురాలు కూర్చుని వున్నది. అన్నిరకములైన పక్షులు ఆ చెట్టు కొమ్మల మీద కూర్చుని వివిధములైన శబ్దములను వీనులవిందుగా వినిపిస్తున్నాయి. అన్నిరకములైన పశువులు ఆతరు ఛాయనే తోకలాడిస్తూ ఆవిడ పక్కగా నిల్చున్నాయి.

ప్రేమనగర్‌లో ఒకరోజు

అంగవికలులూ, స్త్రీలు, పురుషులు... (ఇందాక లిస్టులో చెప్పిన జనాభా అంతా) ముచ్చటగా బారులు తీర్చి ఆవిడ ముందర కూర్చుని వున్నారు. అంతా కోలాహలంగా వున్నది. ఆవిడ ప్రశాంత జీవనానికి మనస్సులోనే అంజలి ఘటించాను. మమ్మల్నిద్దరినీ అక్కడ కూర్చోమని డ్రైవరు సంజ్ఞ చేశాడు. కూర్చున్నాము.

ఇంతలో భీరవర్మగారు కూడ అక్కడకు వచ్చాడు. పెద్ద కలకలం బయలుదేరింది. అతడిని చూస్తూనే ఎక్కడికక్కడే, ఎప్పటికప్పుడే, ఎవరికి వారే నిలబడి నమస్కారాలు చేశారు. నేను కూడ నిలబడి నమస్కారం చేస్తూనే పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాను. అతడంటే అందరికీ గౌరవమని నాకు అర్థమైంది.

ప్రేమ స్వరూపురాలు త్యాగలతాదేవి గారు కూడ వచ్చారు. ఆ క్షణంలోనే నా కన్నులు చరితార్థమై పోయాయి. ప్రేమలో త్యాగాన్ని త్యాగంలో ప్రేమను నేను దర్శించాను. ప్రేమత్యాగాలు ఒకదాని కొకటి నీరు పాలువలె, విడదీయుటకు వీలు లేకుండా కలసి పోయాయి. నా జన్మ ధన్యమైంది.

కృష్ణమూర్తి భీరవర్మకు నన్ను పరిచయం చేశాడు. నా సందేహములను కొన్ని ఆయన ముందు వ్యక్తపరిచాను. భీరవర్మ ఓపికగా గంటన్నర సేపు నాకు ప్రేమ సూక్ష్మాలను గూర్చి తెలియజేశారు. నా వంటి మందమతికి కూడ ఎక్కడికక్కడ విడమర్చి అర్థమయ్యేటట్లు చెప్పారు. వారు నన్ను చాలా అభిమానించారు. రాత్రి జరుగబోవు అంతరంగిక సమావేశంలో నన్ను రానిచ్చుటకు దయతో అనుమతిచ్చారు.

ఆరాత్రి ఒక త్యాగి యొక్క ఆత్మకథను వింటూ కూర్చున్నాను. అందువలన చాలా ఆలస్యంగా సమావేశానికి వెళ్ళాను.

వాతావరణం బాగా ఉద్రేకంగా వున్నది. సభాపతికి దగ్గరగా పాతిక సంవత్సరముల యువకుడొకడు నిలబడి వున్నాడు. అందరూ తీవ్రంగా అతని వంక చూస్తున్నారు. అంతటా భయంకరమైన నిశ్శబ్దం తాండవిస్తోంది.

నేనొక చోట సద్దుమణిగి కూర్చుని "ఏమిటి జరుగుతుంది?" అని పక్కవాడి చెవిలో రహస్యంగా అడిగాను. అతనొక మూకబధిరాంధుడు. వినబడదు. కనబడదు. (ఆ సభకి ఎందుకు వచ్చాడో తెలియదు.) మూడుకుర్చీల అవతల కూర్చున్నవాడు కొంచం నయం. కేవలం అంధుడు మాత్రమే. అతని దగ్గరగా జరిగి "ఏమిటి జరుగుతుంది?" అన్నాను.

"ఈ యువకుడు చాల పెద్దతప్పు చేశాడు."

"ఏమిటా తప్పు?" సమాధానంలేదు. మళ్ళీ అడిగాను.

"ఆడామగా కలిసి చేసే తప్పేనయ్యా" అన్నాడు విసుగ్గా.

నాకు కుతూహలం పెరిగిపోయింది. "మరి ఆవిడేది?" అన్నాను ఉత్సుకతతో.

"ఆవిడంటే ఇంకెవరనుకున్నావు? అతని భార్యే!"

నాకు మతిపోయింది. భార్యాభర్తలకూడ తప్పేనా? ఇదంతా ఏదో గమ్మత్తైన నాటకంలాగ నాకు తోచింది. మిగిలిన సభికులందరూ నా నోరు నొక్కేశారు. నా కుతూహలాన్ని భీరవర్మ గమనించి మౌనంగా వుండమని సంజ్ఞ చేశాడు.

ఆశ్రమ వాతావరణం కలుషితం చేసినందుకు ఆ యువక దంపతులను ప్రేమనగర్ విడిచి వెంటనే వెళ్ళిపోవాలని భీరవర్మ తీర్పు ఇచ్చాడు. సమావేశం పూర్తి అయిపోయింది.

నేను భీరవర్మ మిగిలిపోయాము.

"మిస్టర్ రావు. నీ వడుగదలుచుకున్న దేమిటో నాకు తెలుసు. నేనొకనాడు అన్నిరకములైన అనుభవాలను అనుభవించాను. సుఖాన్ని కొనుక్కున్నాను. నా అమృతమూర్తి నాకు మొదటిసారిగా ప్రేమ అనురాగం అన్నదేమిటో తెలియజేసింది. భౌతికమైన అల్పమైన కోరికలతో మాకు పని లేదు. రాగద్వేషాలను శాశ్వతంగా అధిగమించిన విరాగులం. మనసులనూ ప్రవర్తననూ స్వార్థంతో ముడిపెట్టి, సంకుచితులను కావించే సాంసారిక ధర్మానికే మేము అతీతులం. ఇదియే మా అతీత మానవ స్థితికి మూలకారణం. ఇదియే మా ఆదర్శం.

ఈ ఆదర్శంతోనే మానవసేవ, లోకకల్యాణం చేద్దామని ఈ ప్రేమనగర్‌ని నెలకొల్పాము. నెమ్మది నెమ్మదిగా సాధన చేసిన మీదట మేము సాధించిన ఈ అతీతమానవ స్థితిని ప్రతి ఒక్కరూ చేరగలరని మా ఉద్దేశం. అందుకే ప్రతిఒక్కరూ ఈ ప్రేమనగరులో వున్నంత కాలమూ సంకుచితులను కావించే సాంసారిక ధర్మానికి దూరంగా వుండాలని మా నియమం. ఈ నియమం కర్కశంగా నిర్దాక్షిణ్యంగా వున్నదని నాకు తెలుసు. కాని ప్రతివాడూ ఈ నియమాన్ని అనుసరించవలసిందే."

భీరవర్మ సుదీర్ఘమైన ఉపన్యాసాన్ని ముగించాడు. బొబోయ్ మనుష్యులు కాదు వీళ్ళు. 'ప్రేమ' 'త్యాగం' అనే పదాలను పట్టుకుని వేలాడుతున్న జీవచ్ఛవాలు! అన్నిరకములైన జంతువులనీ, పక్షులనీ సేకరించిన ట్లు, ఈ ప్రేమనగర్ అనే 'జూ'లో అన్ని రకములైన మనుష్యులను పట్టుకుని వచ్చి ప్రదర్శిస్తున్నాడీ భీరవర్మ! వారితో మెదులుతున్న ప్రతి క్షణం నాకు భయంకరంగా తోచింది.

మర్నాడు ఉదయమే ప్రేమనగర్‌కి 'గుడ్‌బై' కొట్టి, బొంబాయి బయలుదేరాను. బొంబాయి వి.టి. స్టేషన్‌లో (పౌరుషాభిమానాలు గల) లక్షలాది మామూలు మనుష్యులతో కలిసిపోవుటయే నాకు సుఖమనిపించింది. ●


దిన దినానికీ...
రెక్సోనావల్ల
మీ చర్మ సౌందర్యం అతి
మనోహరంగా పెంపొందుతుంది
రెక్సోనా వాడుటవల్ల మీ చర్మ సౌందర్యం ప్రతిరోజూ కొత్త సొంపుగా వుంటుంది. రెక్సోనాలో వే సౌందర్యకారియైన ప్రత్యేక నూనెల మిశ్రమం 'కేడిల్' వున్నది. రెక్సోనాయే మీ కెంతో ప్రీతియైన మనోల్లాసకరమగు పరిమళమును మీ శరీరంపై నిలిపియుంచుతుంది. రోజూ రెక్సోనా వాడండి.
Rexona
GOOD FOR YOUR SKIN
'కేడిల్'తో గూడిన
రెక్సోనా
మీ చర్మానికి
గుణకారి
లింటాస్-RX. 26-140 TE
హిందుస్తాన్ లీవర్ ఉత్పత్తి

సీరియల్

రామశాస్త్రి

వి. ఎస్. సుక్తాంకర్...

8

(జరిగిన కథ: మరాఠా సామ్రాజ్యం ప్రధాన న్యాయమూర్తి రామ్‌శాస్త్రి ప్రభావం 'వేఠ్ బిగార్' అనే బలవంతం బానిసత్వం పద్ధతి నిషేధం అయ్యేట్లు చూస్తాడు. నిషేధించిన తర్వాత శాసనాన్ని ఉల్లంఘించినందుకు బస్పెయిన్ సుబేదార్ విస్సాజీని విచారించి అతనికి శిక్ష విధిస్తాడు. ఇది రాజమాత గోపికాబాయికి కోపం తెప్పిస్తుంది. కాని పేష్వా మాధవరావుకి ప్రధాన న్యాయమూర్తి మాటపైన ఎక్కువ గౌరవం. విస్సాజీ విచారణ తర్వాత శ్యామా అనే బానిసపిల్లనీ, ఆమెని ఎత్తుకుపోయిన చంపాజీని విచారణకి పిలుస్తారు.)

శ్యామా, చంపాజీల పేర్లని పిలవగానే న్యాయస్థానాన్ని నిశ్శబ్దం ఆవరించింది. ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత ముఖవైఖరీ, ముద్దొయిలుగా నుంచున్న జంట సాహసగాథా చూపరుల మనస్సులకి హత్తుకు పోయాయి. వారి జాలిగాథ ప్రేక్షకులలో వారి పట్ల సానుభూతి కలిగేట్లు చేసింది.

న్యాయస్థానం నిర్వాహకుడు ఇలా వాదించటం మొదలు పెట్టాడు "శ్యామా మోర్‌భట్ ఆస్తిలో ఒక భాగం. తన ఇంట్లో దాసీపిల్లని అమ్మేందుకని మోర్‌భట్ శ్యామాని పూనా నగరంలోని బజారుకి తీసుకు వెళ్ళినప్పుడు చంపాజీ బలవంతంగా ఆమెని ఎత్తుకు వెళ్ళిపోయాడు. ఆమె కూడా అతనితో పారిపోవటానికి ఇష్టపడినట్లు స్పష్టం అయింది. రెండు రోజుల తర్వాత వారిద్దరూ వివాహం చేసుకున్నారు. ఇంతలో మోర్‌భట్ పూనా నగరంలో ఠాణాలో ఫిర్యాదు చెయ్యటంవల్ల రక్షకభటులు వారికోసం వెతకటం ప్రారంభించారు. వారిద్దరిని ఒక చిన్న గ్రామంలో ఉంటున్నట్లు తెలిసి పట్టుకుని నిర్బంధించారు. ఇప్పుడు మోర్‌భట్ న్యాయస్థానాధిపతులని ప్రార్థించేదేమంటే, తన ఆస్తిలో భాగం అయిన శ్యామాని తనకి తిరిగి ఇప్పించవలసినదనీ, దొంగతనం చేసిన చంపాజీకి తగిన శిక్ష విధించవలసినదనీ.... ...."

నిర్వాహకుని ప్రసంగం ముగిసిన తర్వాత మోర్‌భట్‌ని సాక్ష్యానికి పిలిచారు. అతను ప్రధాన న్యాయమూర్తికి అతివినయంగా వంగి నమస్కరించి తన ఫిర్యాదుని సవివరంగా మనవి చేసుకున్నాడు. శ్యామాని తనకి తిరిగి ఇప్పించటమేకాక అతి దుర్మార్గుడయిన చంపాజీకి వీలయినంత కఠిన శిక్ష విధించమని కోరుకున్నాడు. చంపాజీ వంటివారు సంఘానికే శత్రువు అన్నాడు.

ఆపైన శ్యామా చంపాజీలు తమ కథని చెప్పుకున్నారు, నిర్వాహకుడు వారిని పరీక్షించాడు. విచారణ పూర్తి అయింది— ఇక ప్రధాన న్యాయమూర్తి తన నిర్ణయం చెప్పటమే తరువాయి. న్యాయస్థానంలోని వారందరి కళ్ళూ రామ్‌శాస్త్రి మీదనే ఉన్నాయి. "ఈ జంటమీద ఎంత జాలివున్నా ప్రధాన న్యాయమూర్తి వారికి తగినశిక్ష వెయ్యకుండా వుంటాడా?" అనుకున్నారు ఎందరో.

"బానిసపిల్లని తిరిగి మోర్‌భట్‌కి ఇచ్చేస్తారు కాని ఈ శిలేదార్ పాపం మంచి వాడిలా కనిపిస్తున్నాడు. అతన్ని తేలిగ్గా వదిలెయ్యడూ?" అనుకున్నారు కొందరు.

"సుబేదార్‌నే వదిలిపెట్టని వాడు కేవలం ఒక శిలేదార్‌పట్ల అనుచితంగా ప్రవర్తిస్తాడా?" అని అనుకున్నారు మళ్ళీ.

— "అవునవును— ఈ బట్టుని వదిలిపెట్టడు! రాజమాత మాటలే లెక్కచెయ్యడే ఈ రామ్‌శాస్త్రి — కనీసం ఇరవయిసంవత్సరాల కఠినశిక్ష తప్పదు!"

సాధారణంగా విచారణ పూర్తి అయిన కొంతసేపటిలోనే తన నిర్ణయం చెప్పే రామ్‌శాస్త్రి చాలాసేపు మౌనంగా ఉండటం ప్రేక్షకుల ఆశ్చర్యం కలిగించింది. అతని తీర్పు ఎలా వుంటుందో అని ఎదురుచూసే వారి కుతూహలం బాగా అధికం అయింది.

"రామ్‌శాస్త్రి ఎంత గంభీరంగా ఉన్నాడో! పాపం ఆయన ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు..." అనిపించింది చూసేవారికి.

చివరికి రామ్‌శాస్త్రి దిగాలుపడిపోయి నుంచుని ఉన్న శ్యామా, చంపాజీల వైపు ఒకసారి చూసి, తర్వాత మోర్‌భట్‌ని ఉద్దేశించి ఇలా అన్నాడు: "మోర్‌భట్ పండిట్‌జీ! మీ ఫిర్యాదు చాలా న్యాయమయినదే— శ్యామా, చంపాజీలు నేరస్థులు కారని ఎవరూ అనలేరు! వారు చట్టాన్ని ఉల్లంఘించిన మాట నిజం. కాని, చంపాజీ బజారుకి వచ్చింది శ్యామాని ఎత్తుకు పోవటానికి కాదు కదా? మీరు ఈ బానిసపిల్లని ఒక మ్లేచ్ఛుడికి అమ్ముతారని తెలిసినప్పుడే సాహసించి ఆమెని తీసుకువెళ్ళిపోయాడు.

"అందువల్ల మిమ్మల్ని, వీరిపై జాలి తలచి, మీ ఆరోపణని ఉపసంహరించు కోవలసినదిగా కోరుతున్నాను! చంపాజీ నిజాయితీ కల వ్యక్తి. తనకి సాధ్యమయినంత త్వరలో ఈ బానిస పిల్లని విడిపించటానికి కావలసినంత మూల్యాన్ని చెల్లిస్తాడని నమ్మవచ్చు."

"ఈ సంఘటన అసలు జరగవలసినది కాదు. ఈ దీనుల మీద కరుణించి, వారి జీవితాలని ఆనందమయం చెయ్య గలిగిన శక్తి మీకు ఉన్నది! వెూస్టిన్ అనే ఆ మ్లేచ్ఛుడికి ఈ యువతిని అమ్మటంవల్ల వచ్చే మొహర్ల కన్నా ఎక్కువ ఫలమే లభిస్తుంది.

"పేష్వాసాహెబ్ వారి ప్రధాన న్యాయమూర్తిగ వీరిని శిక్షించటం నావిధి కాదనలేను! అందుకనే ఈ యువతీ యువకులను కరుణించి సానుభూతితో ప్రవర్తించవలసినదిగా మిమ్మల్ని కోరు కుంటున్నాను............

"ఈ యువతి తండ్రి దేశానికి ప్రాణాలు ధారపోసిన వీరుడు! భార్యా బిడ్డలని గురించి ఆలోచించకుండా మన మరాఠా సామ్రాజ్య సేవలో వీరమరణం పొందాడు! అనాథ అయిపోయిన ఈ పిల్ల తల్లి పొట్ట గడవటంకోసం కూతురిని అమ్ముకుంది. ఆమె న్యాయయుక్తత మనకేమి అర్థం అవుతుంది? దేశం కోసం అసువులు విడిచిన వీరుడికి ఇదా బహుమతి?

"మోర్‌భట్ పండిట్‌జీ, బానిసత్వం మానవుడు సృష్టించిన చట్టం ప్రకారం అనుటలో పుణ్యపుటికి భగవంతుని దృష్టిలో అది మహాపాపం అని గ్రహించాలి! దాస్యం మానవ సమాజానికే ద్రోహం...... మీరు పండితులు. ధర్మాధర్మాలని ఎరిగినవారు. మీ చేతులారా ఎన్నో వివాహాలు జరిపించివుంటారు. కళ్యాణ మంత్రాలు ఎంత పవిత్రమయినవో ఆలోచించండి! ఆ పవిత్రమయిన అటువంటి మంత్రాలతో జరిగిన వీరి వివాహబంధాన్ని తెంపటం భావ్యమేనా?

"మోర్‌భట్ పండిట్‌జీ! ఈ న్యాయస్థానం పైన మరొక న్యాయస్థానం ఉందని మీకు మనవి

చేస్తున్నాను! మన మందరమూ ఎప్పుడో ఒకప్పుడు ఆ న్యాయస్థానంలో విచారణకి నిలవ వలసినవారమే! ఆ దివ్య న్యాయస్థానంపేర ఈ దంపతులని కరుణించవలసినదిగా మరొకసారి ప్రార్థిస్తున్నాను ...."

రామ్‌శాస్త్రి ఉద్ఘాటన విన్న వారందరూ పులకితు లయ్యారు. మోరోభట్ రామ్‌శాస్త్రి పాదాలకి వంగి నమస్కరించాడు.

"ప్రధాన న్యాయమూర్తీ, నీ ఆజ్ఞని శిరసావహిస్తున్నాను! ఇదిగో తక్షణం నా ఆరోపణని ఉపసంహరించుకుంటున్నాను. అంతేకాదు, ఈ అమ్మాయి శ్యామా కోసం చంపాజీ నాకు ఏమీ ఇవ్వనక్కరలేదు! వారిద్దరూ సుఖంగా బ్రతకాలని ఆశీర్వదిస్తూ, అలా దీవించమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను."

— "రామ్‌శాస్త్రి ఈ న్యాయస్థానాన్ని దేవాలయంగా మార్చేశారు!"

— "రామ్‌శాస్త్రి న్యాయమూర్తి మాత్రమే కాదు, మనందరికీ గురుతుల్యులు!"

— "మరాఠా సామ్రాజ్యం నిజంగా రామరాజ్యం అయిపోయింది!"

పలికిన సంభ్రమాశ్చర్యాలకి అంతులేదు. న్యాయస్థానం రామ్‌శాస్త్రి ప్రశంసలతో నిండిపోయింది. ఈ వింతని ఇతరులకి చెప్పాలని ఆత్రపడేవారు బయటికి వచ్చేసి అక్కడ వేచి ఉన్నవారికి జరిగినదంతా చెప్పారు. ఇక ఆ ప్రదేశంలో బయలుదేరిన ఆనంద కోలాహలానికి అంతులేదు.

"హోషియార్! హోషియార్!" ఇంతలో ఈ అలజడిమీద వినిపించాయి రాజభవన ప్రతీహారుల హెచ్చరికలు. "హోషియార్!" దారినంతా ఆక్రమించిన జనం నిశ్శబ్దం అయిపోయి వారికి దారి కల్పించారు. ప్రతీహారుల వెనుక పేష్వావారి సతీమణి రమాబాయిసాహెబ్ పల్లకీ వచ్చింది. ఆమె దేవాలయానికి వెళ్లి తిరిగి వస్తోంది. దారిలో సందడిని గమనించి దాని కారణం ఏమిటని తన పరివారంలో వారిని అడిగింది. వారు జరిగినదంతా తెలుసుకుని ఆమెకి విన్నవించారు.

"రామ్‌శాస్త్రిగారినే కదిలించి వెయ్యగలిగిన ఈ జంట ఎవరు! ఏదీ వారిని నా ముందుకి తీసుకు రండి!" అని ఆజ్ఞాపించింది రమాబాయిసాహెబ్.

ఇంచుమించు తన వయస్సేకల శ్యామా ముగ్ధ సౌందర్యం పేష్వా సతీమణిని ఇట్టే ఆకర్షించింది. ఆమెపట్ల అనిర్వచనీయమయిన సానుభూతి కలిగింది, కొన్ని క్షణాలు ఆమె ముఖంవంకనే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయింది. చివరికి చిరునవ్వుతో, "శిలేదారినీబాయి! నువ్వు అంతఃపురంలో మా చెలికత్తెగా చేర్తావా? శిలేదార్‌ని కూడా పేష్వాసాహెబ్ వారి పరివారగణంలో వేయిస్తాము— మీరిద్దరూ కలిసే రాజభవనంలో ఉండిపోవచ్చు... ...." అన్నది నెమ్మదిగా.

ఆశ్చర్య చకిత అయిన శ్యామా నిరుత్తరురాలయి రమాబాయిసాహెబ్ పాదాలకి నమస్కరించింది.

— "అంతా భగవంతుడి కృప!"

— "వాళ్ల అదృష్టం అలా వుంది!"

అనుకున్నారు ఈ సంఘటనని చూసినవారు.

(సశేషం)





నా విదేశయాత్ర

జమునా రమణారావు



6

యారవాన్ (అర్మేనియన్!) వెళ్లే విమానం ఎక్కాము. రెండు గంటల ప్రయాణం తర్వాత మరో ఎయిర్‌పోర్టులో దిగి, వేరే ఫ్లైట్‌లో వెళ్లాం. ఏడున్నరకి యారవాన్ చేరాం. హోటల్‌కి వెళ్ల డానికి వ్యవధి లేనందున మమ్మల్ని నేరుగా సినిమా థియేటర్‌కే తీసుకు వెళ్లారు. అప్పటికే సినిమా జరుగుతూ వుంది. సినిమా మధ్యలోనే ఆపి, మమ్మ ల్ని స్టేజిపైకి ఆహ్వానించారు. మేము ప్రేక్ష కులకు పరిచయం చేయబడ్డాం. ఆ కార్యక్రమం ముగిశాక హోటల్ చేరాం. రాత్రి డిన్నర్‌లు, టోస్ట్‌లు పూర్తి కావటానికి పన్నెండు అయింది.

24వ తేదీ ఉదయం పదింటికల్లా సిద్ధమయ్యాం. మా బృందంలో కొందరు యింకా తయారు కానం దున— మేము మాత్రం అలా హోటల్ బయటకి వచ్చి రోడ్‌లో నించున్నాం. విశాలమయిన స్క్వేర్ మధ్య అందాల ఫౌంటెన్‌ని చూస్తూ, ఫోటోలు తీసుకోవడంలో నిమగ్నులమయి వున్నాం. మాచుట్టూ దడిలాగా నించున్న జనాన్ని అంతవరకు మేము గమనించలేదు. ఎంతో ఆశ్చర్యంగా, వింతగా, ఆనం దంగా మావైపు చూస్తూ— నలువైపులనుండి మమ్మల్ని చుట్టుముట్టిన జనాన్ని చూసి అద్భుతం అనిపించింది మాకు. ఎందుకంటే, ఇంతవరకు చాలాకొద్దిమంది మమ్మల్ని అలా చూశారు. కాని యీ విధంగా— అంటే, మనదేశంలో ముఖ్యంగా ఆంధ్రలో మేము శతదినోత్సవాలకు వెళ్లినపుడు ఎలా అభిమానులు మమ్మల్ని చూసేందుకువస్తారో, అలా గుంపులు గుంపులుగా చేరారు.

ఆ జనసమూహం వైపు చూసి మేము కూడా ఆనందంగా నవ్వాము. అందరు మమ్మల్ని చుట్టు కుని 'ఎవరమని' అడిగారు. చెప్పాం. భారతీయులం, అందులోనూ సినిమా తారలమని తెలిశాక వారి సంతోషం పట్ట శక్యం కాలేదు. కరతాళధ్వనులు చేశారు. వారు మమ్మల్ని 'రాజకపూర్ రాలేదా?' అని అడిగారు. వారికి మనదేశవాసుల గురించి తెలి సింది— జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధి, లాల్‌బహదూర్, రాజకపూర్, నర్గీస్‌లు. ఈ దేశంలో కూడ మనభారతీయులు— ముఖ్యంగా పరిశ్రమకు చెందిన ప్రసిద్ధకళాకారులు రాజకీయ వేత్తలతో సమానమైన హోదాలో గుర్తించబడటం— మాకు ఎంతో ఆనందం, గర్వం కలిగించాయి. వారి ప్రశ్న లకు సమాధానాలు చెప్పి, ఎదురుగా వున్న హోట ల్లోకి నడిచాం.

ఈ లోగా మావాళ్లందరూ తయారయ్యారు. అంతా కలసి సైట్‌సీయింగ్‌కి బయలుదేరాము. ఎప్పటిలాగానే కార్లలో వూర్లోని ముఖ్యమయిన ప్రదేశాలకు తిప్పి చూపించారు. ప్రతి కూడలి స్థలంలోను ప్రసిద్ధిచెందిన కవులు, చిత్రకారులు, యుద్ధవీరులు, దేశనాయకులు మొదలయిన వారి శిల్పాలతో అలంకరించి వుంటుంది.

ఆ రోజు అక్కడ 'సన్నీడే' ఎండ వచ్చింది సూర్యభగవానుని చూడగానే, వారికంటే మాకు ఎక్కువ ఆనందం కలిగింది. అప్పటికి వారం రోజుల నుంచి ఎండ అంటే ఏమిటో ఎరగం. అక్కడి వారు సూర్యభగవానుని చూస్తే సంతోషం పట్ట లేరు. ఆ దేశప్రజల్లో ప్రతివ్యక్తి, తన దేశంపట్ల ఎంతో శ్రద్ధాభక్తులు కనపరుస్తారు. కళాకారు లపై విపరీతమయిన ప్రేమ, అభిమానం చూపు తారు. వూరు చూశాక సినిమా పరిశ్రమకు సంబం ధించిన కళాకారులను కలుసుకున్నాం. వారి థియే టర్‌లో మాకు 'యారవాన్' డాక్యుమెంటరీ చిత్రం చూపించారు. అక్కడ మాకు స్టూడియో చూసే అవకాశం లేకపోయింది.

నాలుగింటికి 'ఛిల్డ్రన్స్ మ్యూజికల్ స్కూల్'కి తీసుకు వెళ్ళబడ్డాం. ఒకే యూనిఫామ్ ధరించిన చిన్న చిన్న పసిపిల్లలు ఎంతో ముద్దుగా మాకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం చెప్పారు. సంగీతంలో అభిలాష కలిగిన పిల్లలకోసం ప్రత్యేకంగా నిర్మించ బడింది ఆ స్కూలు. అంతా పదిహేను సంవత్స రాల లోపువారే. 300 మంది పిల్లలు వివిధరకాల వాయిద్యాలు నేర్చుకుంటున్నారు. ఒక గదిలో పది మంది పియానో వాయిస్తూంటే, మరో గదిలో ఫిడేలు— యింకో గదిలో వారి దేశపు వాయిద్యం ఇలా ఎన్నోగదుల్లో వారు నేర్చుకుంటూండగా చూశాము. వారి తరగతులన్నీ చూపించి, వారికోసం ప్రత్యేకించి కట్టబడిన స్టేజి థియేటర్‌కి తీసుకు వెళ్లారు.

మేము ఆ హాల్లోకి ప్రవేశిస్తూండగా ఎదురుగా వున్న ఒక చిన్న గదిలో 10 ఏళ్ల అందాల ముద్దు పాప చేతిలో ఒక చిన్న కాయితం పట్టుకుని, ఒక్కతే అక్కడ వో మూలనక్కి ఏమిటో చదువుకుంటూ నించున్నది. మాకు కుతూహలం రేకెత్తి ఏం చేస్తున్నా వని అడిగాము. సిగ్గుపడుతూ తల వంచుకుంది. ఎర్రగా కందిన ఆ లేతబుగ్గల్ని ముద్దు పెట్టు కున్నాను. ఎంతో అందమైన ముక్కు, చిలిపిగా నవ్వే కళ్లు, ముత్యాలలాంటి పలువరుస— 'ఎంత చక్కని పాప!' అనిపించింది. తను చదువుతున్న పేపరు స్టేజిలో తను మాట్లాడబోయే స్పీచ్‌ట! కంఠస్థం చేస్తూ వుందిట! థియేటర్‌లోనికి తీసుకువెళ్లి మమ్మల్ని ఆసీనుల్ని చేశారు.

విశాలమయిన స్టేజిలో ఒక పెద్ద పియానో పెట్టబడి ఉంది. స్టేజిలోకి ప్రవేశించే ద్వారం నుంచి ఆ చిన్నపిల్ల ఎంతో ధైర్యంగా, చిరునవ్వుతో, గంభీరంగా స్టేజిలోకి వచ్చి మాకు స్వాగత వచనాలు చెప్పింది. ఆ తర్వాత కార్యక్రమం ప్రకటించింది. ఆ కార్యక్రమం ఏమిటో మాకు అర్థం కాలేదు. ఏమిటా అని చూస్తూండగా— బుడుగు బుడుగు మంటూ ఐదేళ్ల బుల్లిపాప స్టేజిలోకి వచ్చి, పియానో ముందున్న చిన్న స్టూల్‌పై కూచున్నది. దానికి కాళ్లు అందటం లేదు. తిరిగి దిగి స్టేజిపై ఒక మూలగా ఉన్న లావాటి పుస్తకం తెచ్చుకొని స్టూల్‌మీద పెట్టింది. దాని మీద కూచుని తన లేత బుజ్జి చేతులతో పియానో వాయించింది. మాకు ఆ పసిపాప ప్రావీణ్యత ఆశ్చర్యం కలిగించింది. కరతాళధ్వనులు విపరీతంగా చేశాము.

ఆ పాప తర్వాత వరుసగా 7, 10, 12, 15 సంవత్సరాల మగపిల్లలు, ఆడపిల్లలు— వారి వారి సంగీత ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. ఆ పసి పిల్ల లకు కళలపట్ల ఉంటే ఆసక్తి, ధైర్యం, చురుకు తనం, అతిధులపట్ల మర్యాదగా ప్రవర్తించడం చూస్తే— శరీరం పులకరించి కళ్లల్లో నీళ్లు తిరి గాయి. అంత అద్భుతమయిన పిల్లలు ఉన్నారా దేశంలో........ నేను కూడ మన పాటలు పాడి విని పిద్దా మనుకున్నాను. కాని, అప్పటికే ఆరయింది. పిల్లలతో ఫోటోలు తీయించుకుని, వారి దగ్గర శలవు తీసుకుని తిన్నగా హోటల్ చేరాము. అప్పుడు లంచ్ తీసుకున్నాం. ఆ తర్వాత ప్రోగ్రామ్ ఏమీ లేనందున రెండు గంటలసేపు విశ్రాంతి తీసుకుని,

తొమ్మిదిన్నరకి డిన్నర్‌కి డైనింగ్ హాల్లోకి చేరాం. డిన్నర్‌లు, టోస్ట్‌లు పూర్తి అవటానికి పది అయింది.

25 వ తేదీ ఉదయం పదిన్నరకి యారవాన్ మిత్రుల దగ్గర శెలవు తీసుకుని 'బాకు' (అజర్ బైజాన్) ప్రయాణం అయ్యాము. ఇక్కణ్నించి 'బాకు' సరిగ్గా గంట ప్రయాణం. పదకొండు న్నరకి బాకు చేరాం. ఎయిర్‌పోర్ట్‌లో మూవీ కెమెరాతో కూడా మాకు ఘనమైన స్వాగతం చెప్పారు, అక్కడి ప్రజలూ— సినిమా ప్రముఖులూ...... అందరం కార్లలో బయలుదేరాం.

మేము చూసిన అయిదు నగరాల్లోకీ నాకు 'బాకు' బాగా నచ్చింది. చక్కని వ్యాపార కేంద్రం. ఇక్కడ నూనె బావులు ఎక్కువగా వున్నందున వ్యాపార కేంద్రం అయింది. దారి పొడుగునా ప్రతి చోట నూనె బావులు కనిపించాయి. దూరంనుంచి చూస్తే తాటిచెట్లు అనుకుంటాము. ఎయిర్ పోర్టు నుంచి మా హోటల్‌కి 10 మైళ్ల దాకా వుండచ్చు. వూర్లో ప్రవేశించాము. ఎంతో అందమైన నగరం. మాస్కోలో వున్నంత చలి యిక్కడ లేదు. ఓవర్‌కోట్సు లేకుండానే బయట తిరగగలిగాం. అక్కడక్కడ ఫౌంటెన్స్ ఆ పట్టణానికి మరెంత అందం చేకూర్చినవి.

ఒక పక్కన సముద్రతీరం, మరో పక్కన ఎత్తయిన కొండ శిఖరాలు, శిఖరాగ్రాన 150 అడుగుల ఎత్తున నల్లరాతితో చేయబడిన లెనిన్ విగ్రహం ఉంది. ఎత్తు పల్లాలతో కూడినప్రదేశం. పచ్చని చెట్లు. మన వూటీ, కొడైకెనాల్‌లా కనిపిస్తుంది మేము హోటల్ చేరిన క్షణానే రేడియో ఇంటర్‌వ్యూ జరిగింది. అది పూర్తి అయిన వెంటనే గదుల్లో చేరి త్వరగా స్నానాలు, బ్రేక్‌ఫాస్ట్ ముగించుకొని సైట్‌సీయింగ్‌కి బయలుదేరాం.

మా అందరికీ వారి గ్రామీణ జీవితాన్ని దర్శించాలని ఆకాంక్ష. ముఖ్యంగా మేము ముగ్గురం పల్లెటూరుల నుండి వచ్చినవాళ్లం గనుక, మాకు మరీ ఉత్సుకతగా ఉంది. రెండు, మూడు కార్లలో బయలుదేరాం! మమ్మల్ని చరిత్రాత్మకమైన శిధిలాల దగ్గరకు తీసుకు వెళ్లారు. అంతవరకూ మా వెనుక వున్న మా మంత్రిణి కారు కనిపించలేదు. ఎక్కడికి వెళ్లిందని అడిగాం. 'పల్లెటూర్లు చూడటానికని' చెప్పారు. మాతో చెప్పకుండా వెళ్లినందుకు అంతా బాధపడ్డాం.

తిరిగి హోటల్‌కు వచ్చేటప్పుడు కొంత మంది అజర్ బైజాన్ స్త్రీలు వారి సాంప్రదాయసిద్ధమైన ఉడుపులతో కనిపించారు. మన కాశ్మీర్ స్త్రీలలా పంజాబీ దుస్తులు ధరించి, సన్నటి పొడుగాటి జడలతో చూసేందుకు అందంగా ఉన్నారు. దుస్తుల విషయంలో కూడా ఆ దేశస్థులు చాలా ప్రగతి చెందారు. అందమైన ఫాషన్ గౌన్స్ వేస్తున్నారు. వారి సాంప్రదాయానికి సరిపడే ఉడుపులు ధరించటం అంతగా కనపడదు.

మాకు మరీ ఆశ్చర్యం కలిగించిన మరొక విషయం ఏమిటంటే — 'బాకు' లో బస్సుడ్రైవర్స్, ట్రక్ డ్రైవర్స్, ట్రామ్‌డ్రైవర్స్ అంతా ఆడవాళ్లే కావటం! ప్రతిపనిని స్త్రీలే చేస్తారు అక్కడ. రోడ్ పక్కన మంచుగడ్డల్ని వూడ్చి కుప్ప పెట్టే పని మొదలుకొని— పెద్ద పెద్ద ఉద్యోగాలవరకు ఆడవాళ్లే చేస్తున్నారు. ఎంతో సుకుమారంగా వుండవలసిన స్త్రీలు యింత మోటుపనులు చేయటం నాకు నచ్చలేదు. నాకు నచ్చినా, నచ్చకపోయినా ఆ దేశపు పద్ధతి అది. 'అన్ని పనులూ ఆడవాళ్లే చేస్తూంటే మరి మగవాళ్లు ఏం చేస్తూంటారు?' అని ప్రశ్న. ఈ సందేహాల్ని మాస్కో పత్రికా విలేఖరుల గోష్ఠిలో తీర్చుకున్నాం.

సైట్‌సీయింగ్ పూర్తికాగానే సినీ మాటోగ్రఫీ ప్రముఖుల్ని కలుసుకున్నాం. వారు మాకు అజర్ బైజాన్‌కు చెందిన రెండు చిత్రాలు చూపించారు. పసిపిల్లల మధ్య హెచ్చు తగ్గులు, కుల మత విభేదాలు, పేదరికం— వారి నిష్కల్మష స్నేహానికి యివేవీ అడ్డురావని తెలిపే యితివృత్తం యిది. ఇద్దరి పసి పాపల కథ. ఒక బీద, ఒక ధనవంతుల పాపల మధ్య స్నేహం, పెద్దవారి కుచ్ఛిత స్వభావం వల్ల వారి స్నేహానికి కలిగిన అడ్డంకులు, వారికి

సాయంత్రం ఆరున్నరకి ఫుట్‌బాల్ మేచ్ చూశాం. బాకు టీమ్, రష్యన్ టీముల మధ్య యీ పోటీ. విశాలమైన ఆ స్టేడియమ్‌లో దాదాపు లక్ష మంది ప్రేక్షకులు కూచుని చూడవచ్చు. ఈ ఫుట్‌బాల్ మేచ్ నాకెంతో ఆనందాన్ని కలిగించింది.

ఎనిమిదింటికి అందరం థియేటర్‌కి వెళ్లి స్టేజిమీద కనిపించి ప్రేక్షక సమూహంతో మేమూ 'ఆర్జూ' చిత్రం చూశాం. మిగతా ప్రదేశాల్లో మాకు యిలా ప్రజల మధ్య చూసే అవకాశం కలగలేదు. ఆ అవకాశం లభించింది. మన భారతీయ చిత్రాలని ఆ దేశపు ప్రజలు ఎంత బాగా 'ఎంజాయ్' చేయగలరూ అనేది ప్రత్యక్షంగా చూడగలిగాము. ప్రతి మాటను, ప్రతి భావాన్ని వారు పూర్తిగా అర్థం చేసుకుని అభినందించగలరు. చిత్రంలో నటీనటులు నవ్వినపుడు వారూ నవ్వుతూ వారు దుఃఖించినపుడు వారూ కన్నీళ్లు కార్చుతూ అనుభూతిని పొందగలరు. వారి 'రియాక్షన్' చూ!



విజయనిర్మల—జమున.

(ఫోటో: విస్వాణి స్టూడియో)


ఏర్పడ్డ కష్టాలు— వీటన్నిటికీ అతీతులయి ఒకరికొకరు ప్రాణాలు కూడ త్యాగం చేసేటటువంటి పసిపిల్లల మనస్తత్వంతో కూడిన ఎంతో చక్కని చిత్రం. మేమంతా వెక్కి వెక్కి ఏడ్చాము. ఇది చూస్తున్నంతసేపూ మన భారతీయ చిత్రం చూస్తున్నట్లే ఉంది. వారి సాంప్రదాయాలు, సంస్కృతి, సంగీతం, మన భారతీయ— సంస్కృతికి చాలా దగ్గరగా ఉన్నవి.

ఆ పసిపిల్లలు కూడా ఎంతో అందంగా వుండడమే కాక చాలా అద్భుతంగా నటించారు. ఈచిత్రం పూర్తికాగానే మరొకటి చూపించారు. అదీ మంచి యితివృత్తం. ఒక పల్లెటూరి పిల్ల పరుగులతో ప్రారంభం అవుతుంది. ఒక బస్తీ అతను ఆ పిల్లను పరుగు పందాలకు బస్తీ తీసుకురావటం— అక్కడ ఆ పిల్ల పల్లెటూరి చేష్టలు హాస్యంతో మిళితం చేసి ప్రేక్షకుల్ని నవ్వించేలా రూపొందించారు. ఈ చిత్రమూ మాకు బాగా నచ్చింది.

మన భారతీయుల మధ్య కూచుని వున్నట్లు అనిపించింది. మేము అమిత సంతోషాన్ని అనుభవించాం. సినిమా అవగానే బయటకు వస్తున్న మమ్మల్ని అందరూ చుట్టుముట్టి అభివందనాలతో ముంచెత్తారు. అక్కణ్ణించి హోటల్‌కి వచ్చేసరికి పదకొండు అయింది.


26 వ తేదీ ఉదయం మిత్రు లందరివద్దా శెలవు తీసుకుని మాస్కోకు బయలు దేరాం. 27 వ తేదీకి ఫిల్ము ఉత్సవం అయిపోతుంది. లెనిన్‌గ్రాడ్ ఎలా వెళ్లాలి అనే విషయంపై కాస్సేపు చర్చ జరిగింది. చివరకు మాస్కో వెళ్లి, అక్కణ్ణించి రైల్లో లెనిన్‌గ్రాడ్‌కి వెళ్ల నిశ్చయించారు. మాస్కో సాయంత్రం అయిదింటికి చేరాం. ఆ రాత్రే పన్నెండు గంటల రైల్లో లెనిన్‌గ్రాడ్ బయలు దేరాము.

(ఇంకావుంది)



ప్రతి సినిమాలోనూ హాస్యనటుడు హీరోనే ఆశ్రయిస్తాడు విలన్‌ను ఆశ్రయించడు ఎందుకు?

—శంచి శేషగిరి, అనంతపురం



విలనైతే జోక్స్ వేసినప్పుడు తంతాడని.

ప్రేమించి పెళ్లిచేసుకోవాలా? పెళ్లిచేసుకొని ప్రేమించాలా ?

శివాచారి, హైదరాబాద్

నిజంగా పెళ్లి చేసుకున్నాక ప్రేమించకా తప్పదు. నిజంగా ప్రేమించాక పెళ్ళాడక తప్పదు. ఏది ఏమైనా సంసారం బాగా చెయ్యండి.

హీరో హీరోయిన్లు చెట్లచుట్టూ చెట్టూ పట్టూ లేసుకుని పాడే పాటలపై మీ విమర్శ ఏమిటి?

ఆర్ కె అరిగె, కర్నూలు

మనం చెయ్యాలేనిపని వాళ్ళు చేస్తున్నందుకు చూసి ఆనందించడం.

లవ్ ఇన్ టోక్యో, లవ్ ఇన్ హాంకాంగ్, అని అన్ని దేశాల పేర్లూ మనవాళ్లు తీస్తారుగాని లవ్ ఇన్ బొంబాయి, లవ్ ఇన్ ఢిల్లీ అని తియ్యరేం? ఇండియా లవ్ అంత తీసిపోయిందా?

ఎం‌దేవ్, విశాఖపట్నం

మీ కడుపుమంట అర్థమయింది. కాని ఏం ప్రయోజనం!
"పొరుగింటి పుల్లగూర రుచి"

మద్రాసులో వాహినీ స్టూడియోకి దారేది అని అడిగితే ''నేరుగా పోండి'' అని తెలుగు మాట్లాడి తరువాత మరోభాష మాట్లాడుతారెందుకండీ? తెలుగువచ్చా? రాకా?

జి వి గురునాథరావు, విశాఖపట్నం

వచ్చీరాక

హ్హ హ్హ హ్హ హ్హ నవ్వలేక చస్తున్నానండి పద్మనాభం గారూ! హ్హ, యిదేమిటో గాని మిమ్మల్ని చూస్తేనే నవ్వొచ్చేస్తోందండి హ్హ మంటారు హ్హ..... హ్హ. హ్హ

— కె వి నూకేశ్వరరావు, అనకాపల్లి.



నవ్వకండి! నవ్వకండి! నవ్వితే ముత్యాలు రాలిపోతాయ్!

మీరూ ఒక గొప్ప మల్లయుద్ధ యోధుడూ యుద్ధంచేస్తే చూడాలని వుందండీ! నా కోరిక తీరుతుందం టారా ?

—వి. భాస్కరరావు, కానాల



తప్పకుండా తీరుస్తాను ప్రస్తుతానికి శ్రీసాంబు వేసిన ఈ కార్టూను చూచి ఆనందించండి.

ఏమీ అనుకోకండి, ముఖ్యంగా నటీనటులు ఆశించవలసింది డబ్బునా— లేక చిత్రం విడుదల అయింతర్వాత నిర్మాత భవిష్యత్తునా?

—గోగుల శ్రీనివాసరావు, తెనాలి.

మొదటిది అర్థం! రెండోది పరమార్థం- కనుక రెండూ ఆశించవలసిందే!

మానవుణ్ణి దేవుడు ఎందుకు పుట్టించాడు?

— పి అరుణాశామ్‌కుమార్, గుడివాడ.

మనిషిగా బ్రతకమని

మీరు నటించిన సినిమా మీరు చూస్తుంటే మీకు ఎలాంటి భావం కలుగుతుంది?

—చంద్రశేఖర అజాద్, పర్చిక్రాసింగ్.

నటించి మెప్పించవలసింది

యింకా చాలవుందని అనిపిస్తుంది.

బ్రాంది వగైరా కొంచెం తాగి ఎక్కువ తూలు తున్నట్టు నటిస్తారు. కాని, నిజంగా ఎక్కువ బ్రాంది తాగి నటిస్తే ఆ నటనలో ఎక్కువ వేడు రాలిటీ వుంటుంది. కాని ఎక్కువ మంది తక్కువ తాగుతారు. ఎందుకండీ?



తాగి ఎవ్వరు నటించరు-తాగ కుండా తాగినట్లు తమాషా చేయ డమే నటన.

కన్నెపిల్ల చిత్రంలో నాగేష్ అన్నట్టు జన్మదినాలకు కేక్‌నే ఎందుకు కోయాలి? ఇడ్లీ ఎందుకు కోయకూడదో సెలివిస్తారా?

ఎం రామలింగం, అనంతపురం.

తెల్లదొరలింకా మనల్ని విడిచి పోలేదు.

రేడియోలో పొదుపు చేయండి అని ప్రతీ సోమ వారం చెవులు చిల్లులు పడేట్లు చెపుతున్నారు. మీరేమో ఒకే ప్రశ్న ఒకే కార్డుమీద రాయ మంటున్నారు. రెండు గాని యింకా ఎక్కువగాని యిద్దరు ముగ్గురు స్నేహితులు ఒకే కార్డుమీద రాసి పంపకూడదా? ఎందుకూ?

—ఆర్. వి. యస్. రావు, శ్రీకాకుళం.

ఒకే కార్డుమీద అందరూ కలసి ప్రశ్నలు పంపండి. యింకా పొదుపు చేద్దామని-అడ్రసున్నచోట వ్రాసి పంపితే మద్రాసు చేరదు.

మీరు అందరినీ మీ హాస్యంతో కడుపుబ్బ నవ్విస్తారు. మరి అదేవిధంగా మిమ్మల్నెవరు నవ్విస్తారు?

—బొజ్జా వెంకటేశ్వరరావు, కాకినాడ.

చిరునవ్వులు చిందే చిన్నారి పాపలు.

ప్రతి చిత్రంలోను నాయిక నాయకు లకు విధిగా పెళ్లవుతుంది. ఎందుకో చెపుతారా?

యస్ సత్యనారాయణరావు, హైదరాబాద్.

పడే పాట్లన్నీ అందుకేగా!

అయినా పెళ్ళికాని చిత్రాలు చాల వున్నాయ్ దేవదాసు-అనార్కలీ లాంటివి.

మన ఆంధ్రదేశంలో పురుషులు లేకుండా అందరూ స్త్రీలే నటించిన నాటకాలు శభాష్ అని పించుకున్నాయి కదా, అటువంటప్పుడు పూర్తిగా నటీమణులతోనే (నటుడు లేకుండా) ఒక మంచి చిత్రాన్ని తీయడానికి ఇంతవరకూ ఎవరూ ప్రయ త్నించలేదు, ఎందుకు?

—కె. రామారావు, మద్రాసు.

ఏదైనా కథవుంటే పంపండి! బాగుంటే తీస్తారు. లేకుంటే మీ కథ మీకు పంపుతారు.

మన సినిమాల్లో సెక్స్ అప్పీలు ఎందుకు మహా శయా? పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు హాలీవుడ్‌ని చూసి మన హిందీ, తెలుగు, తమిళ చిత్రాల్లో సెక్స్‌ని ప్రదర్శిస్తున్నారెందుకు?

—ముత్యాల భాస్కర్, విజయవాడ.

సెక్స్‌కు హాలీవుడ్ యేమిటి? ఇండియా యేమిటి? అంతా ఒకటే? అసలు సెక్సే లేకపోతే హాల్లో జనంవుండరు. ఆపరేటర్లు, వాళ్ళ మేనేజర్లు చూసుకోవలసిందే!

హిందీ సినిమాతారలు క్రికెట్ క్రీడాకారులను పెళ్ళి చేసుకోబోవడంలోని ఆంతర్యం?


—నాలబంద చిట్టిబాబు, హైదరాబాద్.

"లవ్ యీజ్ బ్లయిండ్!"

నో క్రికెట్ - నో ఫుట్‌బాల్-నో టెన్నిస్.

ఈ మధ్య తెలుగు సినిమాల్లో ఏదో వంకతో తారలను నీట ముంచుతున్నారు, ఎందుకు?

—పి. యస్. ఆర్. చంద్రశేఖర్, అనకాపల్లి.



అబ్బా! ఛీ! సిగ్గేస్తుంది! పెద్ద తెలియనట్లు! దొంగా!

బహుమతిపొందిన ప్రశ్న

★ ప్రధానమంత్రి అయినప్పటినుండీ శ్రీమతి ఇందిరా గాంధి మెడలో రుద్రాక్షమాల ధరిస్తున్నారు ఎందుకు?

—జి. సత్యవతి, హైదరాబాద్.



దీక్ష, త్యాగం, ధర్మంతో ఆమె జీవితపరిమాణము హిమా లయ శిఖరాలనుకూడా మించింది. ప్రస్తుతం ఆపవిత్ర రుద్రాక్షమాల భారతనారి ఆధ్యాత్మిక చింతనకు చిహ్నం.

ప్రజలకు యింత సినిమాపిచ్చి ఎందుకండీ?

జి. మురళీ కృష్ణ, కొంకలూరు.

రసికులు గనక.

మనదేశంలో జీవించడానికి అనేక పనులుండగా (ఉద్యోగాలుండగా) మీరు సినిమారంగంలోకి ఎందుకు దిగారండీ?

—వి. వరలక్ష్మి, రఘూప్పే.

సినిమాలో నటించడం కూడా ఒక ఉద్యోగమే! కొన్నికోట్ల మందిని నవ్వించే భాగ్యముండగా అంతకంటె పెద్ద ఉద్యోగ మేముం టుందండీ?

సినిమాల్లో సెక్స్ లేకపోతే మన జీవితం ఎలా వుంటుంది?

—సి. రామమూర్తి, పాకాల.

ఉప్పులేని పప్పులా వుంటుంది.


పద్మనాభం

నటి బి. సరోజాదేవి వివాహం

ప్రసిద్ధ సినిమానటి బి. సరోజాదేవి వివాహం చేసుకోబోతున్నదనే వార్త పరిశ్రమఅంతా ఒక్కసారిగా వ్యాపించింది. నేను యీ నెల 11 వ తేదీ ఉదయం ఆమెను విజయా ప్రొడక్షన్స్‌వారి "ఉమా చండీ గౌరీశంకరులకథ" సెట్లో కలుసుకున్నాను. తన వివాహం విషయం నిజమేననీ, మార్చి 1 వ తేదీన బెంగుళూర్‌లోని ఉడ్‌లాండ్స్ హోటల్‌లో జరుగగలదనీ సరోజాదేవి తెలియజేశారు.

వరుడు శ్రీ శ్రీహర్ష విశేషాలు!

సరోజాదేవిని చేపట్టబోయే యువకుడు శ్రీ శ్రీహర్ష ఉన్నతకుటుంబంలో జన్మించినవారు. ఆయన తండ్రి ప్రధానోపాధ్యాయ పదవిని కొంతకాలం నిర్వహించి యిపుడు రిటైరయినారు. శ్రీ శ్రీహర్ష బి. యస్ సి, బి ఇ చదివి పట్టా పుచ్చుకున్నారు. ఫారిన్‌రిటర్న్‌డ్. పశ్చిమజర్మనీలో కొంతకాలం మెకా



సరోజాదేవి

నిక్‌గా పనిచేసి అయిదుమాసాల క్రితం భారతదేశం వచ్చారు. ప్రస్తుతం శ్రీ శ్రీహర్ష బెంగుళూరులోగల "భారత్ ఎలక్ట్రానిక్స్"లో సీనియర్ ఇంజనీరుగా ఉంటున్నారు. వరునికి ఒక తమ్ముడు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. ఒకమ్మాయిని మైసూరు మాజీమంత్రి శ్రీ అప్పాజీగౌడ్‌కు, మరొకఅమ్మాయిని బెంగుళూర్‌లోని కెంపగౌడ థియేటర్ యజమానికీ యిచ్చి పెళ్ళిచేశారు.

పెళ్ళయినా ఉద్యోగం చేస్తారు!

శ్రీ శ్రీహర్ష సరోజాదేవిని వివాహం చేసుకొన తరువాతకూడా యీ ఉద్యోగాన్ని నిర్వహిస్తారు. మార్చి మొదటితేదీన వీరి వివాహం బెంగుళూర్ ఉడ్‌లాండ్స్‌లో జరిగిన తర్వాత మార్చి 5వ మద్రాసు న్యూ ఉడ్‌లాండ్స్‌లో రిసెప్షన్ ఉంది.

పెళ్ళి చూపులు!

వరుణ్ణి సరోజాదేవి, సరోజాదేవిని శ్రీహర్ష చూసుకున్నారు. అంతమాత్రాన యిది ప్రేమవివాహంకాదు. పెద్దలు కుదిర్చిన సంబంధం. సరోజాదేవిని చూడటానికిరమ్మంటే వరుడు శ్రీ శ్రీహర్ష 'చూడనవసరంలేదనీ, తనకుసమ్మతమే' ననిఅన్నారట. 'వరుణ్ణి చూడమని సరోజాదేవికి చెప్పినప్పుడు కూడ అక్కర్లేదని, తనకు యిష్టమేననీ' చెప్పారుట. అయినా చూడమన్నారు పెద్దలు ఒకరినొకరును చూసుకున్నారు. సరోజాదేవి—తల్లితో వెళ్ళి చూసివచ్చారు.

"వరుడు శ్రీ శ్రీహర్షపై మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాను.

"నాకునచ్చారు చక్కనిభర్త నాకు లభించారని అనుకుంటున్నాను" అంటూ శ్రీమతి కానున్న సరోజాదేవి చెబుతున్నప్పుడు ఆమె బుగ్గలు కెంపులే అయినాయి. కన్నులందు క్రొత్తవెలుగు తొంగిచూలాడింది సిగ్గుతో చూపులు కిందికి వాలినవి.

"హనీమూన్ ఎక్కడికి వెళుతున్నారు?"

"ఫారిన్ వెళ్ళాలని అనుకుంటున్నాం. పాస్‌పోర్టుకు అప్లయ్ చేయటం జరిగింది."

"పెళ్ళిఅయినా సినిమాలో నటిస్తారా?"

"ఇంకా అదేమీ నిర్ణయించుకోలేదు."

"పెళ్ళిఅయ్యాక వరుడు శ్రీ శ్రీహర్ష మీ యింటికివచ్చి ఉంటారా?" అని అడిగిన నా మరో ప్రశ్నకు సరోజాదేవి సమాధానం యిస్తూ:

"ఆయన మాయింట్లోవుండరు. నేనువారింట్లో వారితో ఉంటాను. అంటే ఆయన ఎక్కడ వుంటే అక్కడ!" అన్నారు.

సుమారు వంద చిత్రాలలో నటించి—ధనమూ, కీర్తిప్రతిష్ఠలూ గడించుకున్న సరోజాదేవి యీ మాటలు వింటే—వివాహం పట్ల ఆమెకుగల పవిత్రభావం, భర్తపట్ల ఆమెకుగల గౌరవం, నమ్రత, ఉన్నత స్వభావం వ్యక్తం అవుతవి. వైవాహిక జీవితం సరోజాదేవికి మరింత ఆనందాన్ని చేకూర్చిపెట్టాలని ఆశిద్దాం. విజయావారి "ఉమాచండీ గౌరీశంకరుల కథ", జయంతిపిక్చర్స్‌వారి జానపదం, లలితాజ్యోతి ఫిలిమ్స్‌వారి "రహస్యం" వర్ణచిత్రం, ప్రస్తుతం ఆమె నటిస్తున్న తెలుగు చిత్రాలు.

—మోహన్‌కుమార్ ●



నటి సుకన్య

చిత్రలహరి

శ్రీ ప్రొడక్షన్స్ వారి కొత్త సాంఘిక చిత్రాన్ని యీ నెల 9 న వాహినీలోని మూడవ ఫ్లోర్‌లో ఆరంభించారు. ముహూర్తానికి శ్రీయుతులు వి. రాజేంద్రప్రసాద్, వి మధుసూదనరావు, పి. మల్లికార్జునరావు, ఆరుద్ర మున్నగు వారు హాజరయినారు. మొదటగా యీ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న శ్రీ వి. రామచంద్రరావు మెడలో టైగర్ ప్రొడక్షన్స్ నిర్మాతలు నెల్లూరి కాంతారావు పహిల్వాన్ యస్. హెచ్. హుసేన్, సంగీత దర్శకుడు టి. చలపతిరావు, రచయిత ఆరుద్ర పూల మాలలు వేసి. ఆయన తమ యీ తొలి



'గోపాలుడు—భూపాలుడు'లో జయలలిత.

ప్రయత్నంలో సఫలీకృతులు కావాలని ఆశీర్వదించారు. తొలి షాట్ వాణిశ్రీ మీద తీశారు. ఇందులో కథానాయకునిగా కృష్ణ నటిస్తున్నాడు. మిగిలిన ముఖ్య భూమికల్లో కాంచన, చంద్రమోహన్, సంధ్యారాణి, నాగయ్య, నాగభూషణం, రావి కొండలరావు, ఎం. వి. చలపతిరావు, జె. యస్. ఆర్. మూర్తి, బృందావన చౌదరి, కాకరాల ఉన్నారు. ఈ షెడ్యూలు యీనెల 22 వరకూ కొనసాగుతుంది. రచన: భమిడిపాటి రాధాకృష్ణ, సంగీతం: చలపతిరావు, కెమెరా: ఎస్. వెంకటరత్నం నిర్వహిస్తున్న యీ చిత్రానికి నిర్మాతలు: సుందర్‌లాల్ నహతా, డూండీ. కళాదర్శకుడు: యస్. కృష్ణారావు.

* * *

'సురేష్‌కంబైన్స్' అనేది కొత్త సంస్థ. సురేష్ ప్రొడక్షన్స్, సురేష్ పిక్చర్స్ సంస్థల అధినేత శ్రీ డి. రామానాయుడు యీ సంస్థకి నిర్మాతగా



తప్పక చూడండి!
మధు పిక్చర్స్
ఇద్దరు మొనగాళ్లు
దర్శకత్వం: బి. విఠలాచార్య నిర్మాత: మల్లిఖార్జునరావు
రచన: వీటూరి సంగీతం: కోదండపాణి కెమెరా: వరదరాజన్
నవయుగ



''నిశరాత్రి 12 గం. కు''లో మకన్య.

వ్యవహరిస్తారు. తమిళంలో విజయవంతంగా సాగిన "పూమాలై" చిత్రాన్ని— కొద్ది మార్పు చేర్పులతో తెలుగులో పునర్నిర్మిస్తున్నది సంస్థ. యన్. టి. రామారావు, కృష్ణ, పద్మనాభం, ప్రభాకరరెడ్డి, అంజలీదేవి, కృష్ణకుమారి, ఎల్. విజయలక్ష్మి, గీతాంజలి యింతవరకు ఎన్నుకోబడినారు. ఇంకా మరికొందరు ప్రముఖ నటీనటులు కూడ యిందులో నటించగలరని శ్రీ రామానాయుడు చెప్పారు. సంభాషణలు. సముద్రాల (జూనియర్), గీతాలు: ఆరుద్ర,

చిత్రలహరి

కొసరాజు, ఆత్రేయ, సి. నారాయణరెడ్డి, దాశరథి రాస్తున్నారు. సంగీతం: ఘంటసాల, కళ: రాజేంద్రకుమార్, కెమెరా: సి. నాగేశ్వరరావు, కూర్పు: మార్తాండ్. ఈ 22 న రెండు పాటలు, రికార్డు చేసి, మార్చి మొదటితేదీ నుంచి షూటింగ్ ప్రారంభిస్తారు. దర్శకుడు: కె. యస్. ప్రకాశరావు.

కె. యస్. ప్రకాశరావుగారు ''మోహినీ రుక్మాంగద'' చిత్రం తర్వాత మళ్లీ తెలుగులో ఒక చిత్రానికి



'అర్ధరాత్రి'లో భారతి, జగ్గయ్య.



''చిన్ని''లో దేవిక.

దర్శకత్వం వహించడం యిదే మొదటిసారి. ఈ మధ్యకాలంలో హరిశ్చంద్ర తమిళ చిత్రానికీ, బ్రతుకు తెరువు కన్నడ చిత్రానికీ దర్శకత్వం నెరపారు. సాంఘిక చిత్రాల నిర్మాణంలో ప్రకాశరావుగారిది అందెవేసిన చెయ్యి. దీక్ష, కన్నతల్లి— ఇందుకు ఉదహరణలుగా పేర్కొనవచ్చును. ఆయన మంచి



''గొల్లభామ''లో ఎల్. విజయలక్ష్మి.

దర్శకుడే గాక చక్కని నటుడు కూడ. ద్రోహి చిత్రం చూసిన వారికి ప్రకాశరావుగారు యింకా జ్ఞాపకం వుంటారు. ఆయన ప్రదర్శించిన నటన వారి గుండెల్లో నిలిచి వుంటుంది. నటుడుగా, దర్శకుడుగా, నిర్మాతగా విశేషమయిన అనుభవం గడించిన శ్రీ కె. యస్. ప్రకాశరావు మళ్లీ తెలుగు చిత్రాలకు దర్శకత్వం వహించబోవటం హర్షణీయం.

* * *

భద్రాచల సీతారాముల కల్యాణం, శ్రీశైల మల్లికార్జున స్వామి, తిరుపతి వేంకటేశ్వర మహాత్మ్యం, బెజవాడ కనకదుర్గమ్మ వంటి భక్తిరస ప్రధాన డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మించిన యస్. కల్యాణరావు అండ్ కంపెనీవారు యిటీవల "శ్రీ మధుర మీనాక్షి" డాక్యుమెంటరీని తయారు చేశారు. ఈ నెల 3 వ తేదీన యీ చిత్రానికి శ్రీమతి జమున, రేవతీ స్టూడియోలో వ్యాఖ్యానం చెప్పారు. సంగీతం: ఘంటసాల నిర్వహించారు. నిర్మాత, దర్శకుడు: యస్. దుర్గారావు.

* * *

శ్రీయుతులు సుందర్‌లాల్ నహతా, డూండీ గార్లు తమ "గూఢచారి 116" చిత్రాన్ని హిందీలో పునర్నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి తారలను ఎన్నిక చేసేందుకు యీ మధ్య డూండీ బొంబాయి వెళ్లి యీ నెల 10 న వచ్చారు. ఆ రోజు మధ్యాహ్నం ఆయనను వాహినీలో కలిశాము. బాబిటా, జితేంద్ర, సజ్జన్ ముఖ్యభూమికలు పోషించగలరనీ, ఇంత వరకూ మూడు పాటలు రికార్డ్ చేయటం జరిగిందనీ యీ చిత్రానికి "మిస్టర్ 111" అని పేరు పెట్టామనీ చెప్పారు. రికార్డ్ చేసిన మూడింటిలోను ఒకటి రఫీ, మరొకటి లతామంగేష్కర్, మూడోది లతా, ముఖేష్ పాడారు. మార్చి 3నుంచి కేరళ (అవుట్‌డోర్)లో యీ చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుంది. సంగీతం: లక్ష్మీకాంత్‌ప్యారేలాల్, కెమెరా, దర్శకత్వం: రవికాంత్.

* * *

ఈ మధ్య హెచ్. యం. వి. గ్రామఫోన్ కంపెనీ వారు శ్రీ తిరుపతి వెంకటేశ్వరునిపై శ్రీ పి. బి. కె. గారి రాసిన రెండు పాటలను రికార్డ్ చేశారు. భావము, భాష సమపాళ్లలో మేళవించి రసస్ఫూర్తితో హృదయాలను స్పందించేవిగా వుంటవి శ్రీ వారి గీతాలు. గతంలోకూడ కొన్ని రాశారు. 'జగదాధరణా! పావన చరణా! తిరుపతి వేంకటరమణా!', "శరణు శరణు ప్రభు వేంకటనాయక" అనే యీ రెండు పాటలకు శ్రీ ఎమ్. రంగారావు (వీణ) బాణీలు కట్టగా, నూతన నేపధ్యగాయనీ గాయకులు బి. వి. రమణకుమారి, డి. వెంకటరావు అత్యంత హృద్యముంగా పాడారు.

* * *

ఒక మనిషిని మరొక మనిషిలాగా తయారు చెయ్యడం కష్టం. అలా చెయ్యగలగటం అద్భుతమైన కళ. దీనికి ఎంతో నేర్పు కావాలి. ఎక్కువగా మనం హాలీవుడ్ చిత్రాలలో యీ విధమైన పద్ధతులు చూస్తూ వుంటాం. ఇటువంటి అద్భుత ప్రయోగాన్నొకదాన్ని యిటీవల మేకప్ ఆర్టిస్ట్ శ్రీ భద్రయ్య సాధించారు. విశ్వశాంతి పిక్చర్స్ వారి "కంచుకోట" చిత్రంలో ప్రభాకరరెడ్డిని ఉదయకుమార్‌లాగా మార్చగలిగారు 'మాస్క్' పద్ధతి ద్వారా. మనిషిని పోలిన మనిషిని సరియైన గుర్తులతో రూపొందించటం ఎంతటి కష్టసాధ్యమైన కార్యమో ఆ చిత్రం చూస్తే మీరే గ్రహిస్తారు.

* * *

ఈనెల 11 న యస్. వి. యస్. ఫిలిమ్స్ వారి కొత్త సాంఘికచిత్రం వీనస్ స్టూడియోలో ప్రారంభించారు. 12 గంటలకు శ్రీ యస్. త్రివిక్రమరావు పూజచేసి, కొబ్బరికాయ కొట్టారు. నిర్మాత శ్రీ ఎం. జగన్నాధరావు సోదరులు రామకృష్ణరావు క్లాప్ కొట్టారు. తొలిషాట్ ప్రధాన భూమిక నిర్వహిస్తున్న శ్రీ యస్. టి. రామారావు మీద తీశారు. దేవిక, యల్. విజయలక్ష్మి, రమణారెడ్డి, అల్లు రామలింగయ్య, రాజనాల, ఛాయాదేవి, సత్యనారాయణ యితర ముఖ్యపాత్రధారులు. రచన పినిసెట్టి, సంగీతం: టి. వి. రాజు, కెమెరా: యస్. యస్. లాల్, దర్శకత్వం: యస్. డి. లాల్, కలతోట నిర్వహిస్తున్నారు.

—మోహన్‌కుమార్



"రంగుల రాట్నం"లో రమణారెడ్డి, కాకరాల.



'కంచుకోట'లో దేవిక.



'వారప్రతిజ్ఞ' చిత్రంలో కె. ఆర్. విజయ, ఆనంద్.

పుస్తకాలు

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

పదవ సంపుటం. నాయకరాజుల యుగం. రచన శ్రీ ఆరుద్ర. క్రౌను 16+254 పుటలు. వెల: 5 రూ. ప్రకాశకులు యం. శేషాచలం అండ్ కంపెనీ మదరాసు, మచిలీపట్నం, సికింద్రాబాదు.

'కవుల జాబితాలతో' గ్రంథాల పట్టీలతో నింపి సాహిత్య చరిత్ర, వ్రాయకుండా 'కవులను గురించి కథలూ, కబుర్లూ, వాళ్ల జీవితాల్లోని ప్రధాన ఘట్టాలు, సాహిత్య విమర్శలు—వీటితో రసవంతంగా, ఆకర్షణీయంగా, ఆరుద్రగారు వాఙ్మయ చరిత్ర సంపుటాల్లో యిది పదవది. ఇందులోని పదమూడు ప్రకరణాలలోనూ మొదటి దానిలో క్రీ. శ. 1600 మొదలుకొని అర్ధశతాబ్దం దాకా దక్షిణదేశాన్ని పరిపాలించిన నాయకరాజులను గురించీ, వారి కాలంలో వెలువడిన వాఙ్మయాన్ని గురించీ విపులమైన సమీక్ష ఉన్నది తర్వాతి ప్రకరణాలలో రఘునాథుని ఆస్థానంలో పేరుపొందిన కవుల సాహిత్యరచన రసవంతంగా వివరించబడి ఉన్నది.

ద్విపద భారత కవిత్రయం అయిన బట్టేపాటి తిమ్మయ్య, ఆయన శిష్యుడు బాలసరస్వతి, సోమన్నల రచనా వైశిష్ట్యాన్నీ, కవితా చమత్కృతినీ, అనేక నూతనాంశాలనీ, విద్వద్విమర్శకుల అభిప్రాయాలనీ రచయిత చక్కగా వివరించారు ఇది రెండో ప్రకరణంలోని విషయం. మూడో ప్రకరణంలో ఎలకూచి బాలసరస్వతిని గురించీ అతని రచనలను గురించీ, సురభి మాధవరాయల చంద్రికా పరిణయాన్ని గురించీ చక్కగా విమర్శించారు. బాలసరస్వతి రచించిన రాఘవ పాండవీయాన్ని గురించి విపులంగా చర్చించడం నూతన విషయం. బాలసరస్వతి వ్యాఖ్యానించిన ఆంధ్ర శబ్దచింతామణి మాత్రాల కర్తృత్వాన్ని యిదమిత్థమని చెప్పకుండా అభిప్రాయ భేదాలు మాత్రం ఇందు పొందుపరచబడి నాయి. కాని, పీఠికలో మాత్రం శ్రీ తాపీవారు చింతామణి కర్తృత్వాన్ని నిశ్చయిస్తూ "ఆ రోజులలో అథర్వణకారికలు, 'అహోబల పండితీయము మొదలగు వాని మీద ఆంధ్రకవుల దృష్టి లగ్నమవుతూ ఉండేది. వాటిలో ఒక ప్రశస్త స్థానాన్ని ఆశించి బాలసరస్వతి మూల శ్లోకాలను వ్రాసి నన్నయ పేరు పెట్టాడనడం సత్యం" అని వ్రాశారు. ఇది వింతగా ఉన్నది. అథర్వణకారికలు చింతామణికి పరిశిష్ట గ్రంథం. అహోబల పండితీయం చింతామణికి వ్యాఖ్యానం. వాటిలో ప్రాశస్త్యాన్ని ఆశించి చింతామణిని రచించడం జరిగి వుండడం ఎన్నడూ, ఎలాగూ సంభవం కాదు.

రఘునాథ నాయకుడిని గురించి చెప్పే అయిదో ప్రకరణమే యీ సంపుటంలోని అన్ని ప్రకరణాల కన్నా పెద్దది. ఆయన చరిత్రను గురించీ, నల చరిత్ర ద్విపద, వాల్మీకి చరిత్ర, రామాయణం, మున్నగు వాటిని గురించి ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. ద్విపదకావ్యాన్ని రఘునాథ నాయకుడు ప్రబంధమని చెప్పడం గమనించతగ్గది అని శ్రీ ఆరుద్రగారు (పుట 62) అన్నారు. ప్రబంధమనే పదాన్ని గ్రంథసామాన్యానికి లేదా కావ్యానికి వర్తింపచెయ్యడం సంస్కృతంలో పరిపాటి, తెలుగులో కూడా ప్రబంధ లక్షణాలు లేని కావ్యాలు కొన్ని ప్రబంధాలుగా చెప్పబడుతూనే ఉన్నవి.

ఆరో ప్రకరణంలో చేమకూర వేంకటకవిని గురించి చెప్తున్నప్పుడు అతని వంశాన్ని గురించిన అభిప్రాయ భేదాలనూ, కారణాలనూ వివరించి తటస్థంగా ఉండడం రచయిత నిష్పాక్షికతకు నిదర్శనం. వెంకటకవి గ్రంథాల పౌర్వాపర్యాలను గురించీ, తార్కావ్యాలను గురించీ, చమత్కృతులను గురించి ఆరుద్రగారు చక్కగా వివరించారు. సారంగధర కంటె విజయ విలాసమే మేలైన రచన అని సమర్థించారు. అయితే 'తారసపుష్పమై' అనే ప్రసిద్ధ పద్యంలోని 'జాతి' అనే దానికి స్వభావం అనే అర్థం కాక, హాస్యోక్తి అనే అర్థాన్ని నిర్ణయించారు. అది యిప్పటి 'జోక్' అన్నారు. కాని ప్రతి పదంలోనూ హాస్యోక్తి కానవస్తున్నదా? అని ఆలోచించాలి. స్వభావ వర్ణన అనేదే సబబైన అర్థం. ఆయా వ్యక్తుల స్వభావాన్ని వర్ణించి అంటే అనుకరించి (ఇమిటేట్ చేసి) నవ్వించడమనేది అన్నికాలాలలోనూ కానవస్తున్నది. 'జాతి చెప్పిన నవ్వనోయంచు' (పుట 100) అని ఉదాహరించిన 'కువలయాశ్వ చరిత్ర పద్యంలోని 'జతి' కూడా స్వభావవర్ణన అనే అర్థానికి విరుద్ధం కాదు.

—అంగీరస

వీరబల్ కథలు

హాస్యప్రధానమైన వీరబల్ కథలు పిల్లలు ఎంతో ఉత్సాహంతో చదువుతారు ఈపుస్తకరచన, ముద్రణ పిల్లల్ని చదవమని పురికొల్పుతుంది. రచయిత్రి: శ్రీమతి అగస్త్యరాజు పద్మావతిదేవి, 47 పేజీల్లో ఏడుకథలున్న పుస్తకం వెల ఒకరూపాయి. ప్రతులకు పద్మశ్రీ అండ్ కో., చిత్తూరు.—సీతారాజు.

నీటి ముత్యాలు (నవల)

రచన: కుమారి గంటి వెంకటరమణ, 155 పేజీలు. వెల: రు. 3 లు. ప్రచురణ: నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్, విజయవాడ—2.

"ఫారిన్ నుంచి వచ్చాక చేసుకోనా? ముందే నీ మెడలో 'లైసెన్స్' పెట్టేయనా?—" ఇది కథానాయకుడు రాజా ప్రశ్న.

నాయిక అచల నవ్వింది.

"నేను మరెవర్నీ చేసుకోను. భయపడకండి. ఫారిన్ వెళ్లి వచ్చాక సందడిగా దర్జాగా చేసుకుందాం"—అచల సమాధానం.

పెద్ద చదువులకు అమెరికా వెళ్లాడు, డాక్టర్ రాజా. తిరిగివచ్చాడు. అచలను పెళ్లాడటానిక్కాదు, కాన్సర్‌తో బాధపడుతూ...

అచల ప్రేమ 'ట్రాజెడీ' అయింది.

—ఇదీ ఇతివృత్తం.

నవలలో ఒకానొక చోట అచల 'నేనైతే కామెడీకి రాను. ఒకవేళ నా జీవితంలో కూడా ట్రాజెడీ ఎదురైనా అలాగే 'యెండ్' అయినా ఇష్టంగా భరిస్తాను' అంటుంది. నవల సుఖాంతం కాదనటానికి ఇదొక సూచన.

రచనలో అసందర్భంగా కనబడే కొన్ని సందర్భాలు:

'దాహానికి నోరు ఎండిపోయింది' (పేజి 78).


'రాజా నన్ను ఇక్కడ వుంచాడు' (పేజి 79) —అచ్చు తప్పా?

'కంట్లోంచి ప్రవహించే నీళ్ళు' (పేజి 61)— 'కన్నీళ్లు' అంటే సరిపోదూ?—

'కాన్సరు వచ్చి యింతవరకూ ఎవరూ బాగుపడలేదు (145). నలభై ఆరో ప్రకరణలో శ్మశాన వర్ణన బాగా ఏడిపిస్తుంది.

47 ప్రకరణాలుగా విభజింపబడిన ఈ నవలలో కొత్తదనం, శిల్పం, ముందుకు దూసుకుపోయే శైలి, పాఠకుల్ని ఆకట్టగల భాష ఉంటే మరింత బాగుండేది.

—శివకుమారి



మిత్రలాభము

నాటకం. మిత్రలాభాన్ని ఇంతవరకు కథారూపం లోనే చదువుకుంటూ వచ్చాం. శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు సరళమైన భాషలో పిల్లలకు సయుక్తంగా వుండేట్లు నాటకంగా రాశారు. ప్రదర్శన మాటలలా వుంచి చదవడానికి బాగుంటుంది. 9 పేజీలపుస్తకం వెల రెండురూపాయిలు. ప్రతులకు: పద్మశ్రీ అండ్ కో., చిత్తూరు. —సికరాజు.

రచయిత్రి

సాంఘిక నవల శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మ రచన. క్రౌన్ ⅛ పైజున 395 పేజీలు. వెల రు. 5 లు. ప్రచురణ: ముప్పాళ సీతారామస్వామి పబ్లికేషన్స్, ఎన్.ఎ డి. (పోస్టు) విశాఖపట్నం—9.

"... రాసుకుంటోంది.

టేబుల్ లైట్ వెలుగులో— మొహమూ— మెడా మెరుస్తోన్న శిల్పంలా వున్నాయి .... కళ్ళు క్రిందికి వాలి తపోముద్రలో వున్నాయి. చేతిలో కలం అవిరామంగా వరుగెడుతోంది— రచయిత్రి వూహలతో పోటీపడుతూ."

అదుగో— ఆమే రచయిత్రి!— వేలాది పాఠకుల మన్నన అందుకున్న అభిమాన రచయిత్రి— అనూరాధ!— సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి రంగనాయకమ్మ తీర్చి దిద్దిన రచయిత్రి— అనూరాధ!!—

* * *

విజయకీ మోహన్‌కీ ఈడూ జోడూ బాగుంటుంది. చదువుకున్న విజయ తోడికోడలుగా వస్తుందని ఎంతో సంబరపడింది, రుక్మిణి.

మనసు పడ్డాడే గాని— విజయ చదువుకున్న పిల్ల అని జంకాడు, మోహన్.

రుక్మిణి పట్టు పట్టింది. విజయకి మూడు ముళ్ళు పడ్డాయి. రుక్మిణికి విజయ తోడికోడ లయింది.

* * *

"మీలో పువ్వులా విరిసిన సంస్కార హృదయం కన్పించింది నాకు" అన్నది, విజయ.

"నిజంగా నువ్వు పొరబడ్డావు" అన్నాడు, మోహన్.

మోహన్ అన్నది నిజం. విజయ అంచనా తప్పు.

* * *

ఉన్నట్టుండి, ఒకనాడు— పోస్టు!— మనియార్డరు!— పత్రికాఫీసు నించి!— రచయిత్రి అనూరాధకి!!—

సంతకం పెట్టి విజయ సొమ్ము తీసుకుంది. అందరికీ ఆశ్చర్యమే!— ఉక్కిరి బిక్కిరై, ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

విజయే అనూరాధ!—

సుప్రసిద్ధ రచయిత్రి అనూరాధే విజయ!— వేలాది పాఠకుల అభిమాన రచయిత్రి, ఆ కుటుంబంలో అందరికీ అభిమాన రచయిత్రి విజయే!—

అంతా అనూరాధని అభినందించేవారే, అభినందించినవారే!—

అయితే— విజయ అనూరాధగానే ఉంటూ వచ్చింది. అదే వచ్చిన చిక్కు.

"లలిత పత్రికమీద రాస్తోన్న మీ నవల చదవాలని నాకెంతో కుతూహలంగా వుంది. నవలమాత్రం తొందరగా పూర్తి చెయ్యి. ఎప్పుడు చదువుతానా అని కుతూహలంతో చూస్తున్నాను" అంటూ తన ఉత్కంఠ తెలిపింది రుక్మిణి.

అనూరాధకి కావలసింది ఈ ప్రోత్సాహమే.

విజయకి కావలసిందీపాటి మాటే.

కాని— అభ్యుదయ భావాలుగల అనూరాధ స్వేచ్ఛగా సంచరించలేక పోయింది, విజయగా— మోహన్ అర్ధాంగిగా ఆమెకు మునపటి స్వాతంత్ర్యం లేదు, కారణం?— ఆడదిగా పుట్టడం, ఒక మొగ వాడికి భార్య కావడం.

రాసే కలం రాయక మానుతుందా?— అనూరాధ ఆలోచించటం మానగలదా?— ఊహు — ఫలితం?— విజయ ఇరుకున పడింది!— తన అభిమాన రచయిత్రి అనూరాధ భారంగా తోచింది మోహన్‌కు.

జంట విడిపోయింది. విజయ పుట్టిల్లు చేరుకుంది, మోహన్ వైరాగ్యంలో పడ్డాడు.

చివరికి— సిగ్గు, పశ్చాత్తాపం, ఆవేదన, మానవత్వం, కన్నీళ్ళు— కలిసి విజయనూ మోహనునూ కలుపుతాయి.

ఎంత గొప్ప రచయిత్రి అయినా, జీవితంలో అడుగు పెట్టినప్పుడు స్త్రీ సహజమయిన బలహీనతలు గోచరిస్తాయి. అప్పుడు వాటిని సహించలేక పోవడం పురుషుడి లోపం. ఈ ఇద్దరి లోటుపాటు లనూ ఎంతో స్వభావసిద్ధంగా మలిచారు, రంగనాయకమ్మగారు.

ఏడేళ్ల ప్రాయపు సరోజనించి అత్తగారు నారాయణమ్మ వరకూ పాత్రలను చక్కగా నప్పించారు.

"కథానాయిక విజయను నేను ప్రత్యేకించి మెచ్చుకుంటున్నట్టు చెప్పాలి....... విజయ అభిప్రాయాల కంటె కూడా విజయ గొప్పది. రచయిత్రి విజయకంటె నారాయణమ్మగారి ఇంటి కోడలు గొప్పది." అన్నారు, వార్ల.

నిజానికి— నారాయణమ్మగారి కోడళ్లు— రుక్మిణి, విజయ— ఇద్దరూ గొప్పవాళ్లే. రచయిత్రిగా మాత్రమే విజయకి ప్రాధాన్యత. గృహిణిగా, ఇల్లాలుగా ఆమె వట్టి సున్న.

రుక్మిణి అలాకాదు. ఇంటికయినా పెద్ద కోడలు. ఇంటెడు చాకిరీ ఆవిడదే. ఇంటి మంచి చెడ్డా అన్నీ ఆవిడవే. అందుకే పట్టుబట్టి విజయను తోడికోడలుగా చేసుకుంది. విజయ గొప్ప రచయిత్రి అనే రహస్యం వెల్లడయినప్పుడు అందరి ఆనందమూ ఒక యెత్తు, రుక్మిణి సంతోషం ఒక్కటే ఒక ఎత్తు.

రచయిత్రి అనూరాధపై మోహన్‌కు గల అభిమానం, ఆసక్తి అసలైనవి కావు. ఆమె తన భార్యగా తెలుసుకోగానే పొంగిపోయాడు. పొంగి బోర్లా పడ్డాడు. అమృతం విషమైంది. అతని కంటికి విజయ రాక్షసిలా కనబడింది.

అందరికీ అభిమానురాలైన విజయ భర్తకి మాత్రం కాలేకపోయింది. అతని వింత తత్వం, మనోభావన ఆమె అర్థం చేసుకోలేదు. ఆమె చర్యలకు అతను రెచ్చిపోయాడు. ఇదే ఆమె లోపం, ఆమెలోని బలహీనత.

జీవితంలో సంఘటనల్ని కథలుగా చిత్రించవచ్చు. కాని— మానవ జీవితాలను బలిమిని మలచటం ఎవరితరం? ఇక్కడే పుళ్ళీ కర్మసిద్ధాంతం ఎదురవుతుంది.

చక్కటి సన్నివేశాలూ, చక్కని శైలి, యుక్తమైన పాత్ర చిత్రణ, మనసైన హాస్యం, ఒక్క పూపున కడకంటా చదివించే అక్షరశక్తి— ఇవి ఈ "రచయిత్రి" లో ప్రత్యేకతలు.

—శివప్రసాద్ మూర్తి

విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచార గ్రంథాలు

'ఏందులకి విద్యార్థి పోరాటాలు?' అనే పుస్తకంలో విద్యార్థి కల్లోలాలగురించి సమగ్రంగా చర్చించారు రచయిత శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డి. నవంబరు ఆదిగా ఇప్పటివరకు జరిగిన విద్యార్థి ఆందోళన వివరాలు ఇస్తూ, విద్యార్థుల మూల

పుస్తకాలు

సమస్యల్ని పరిశీలిస్తూ, విద్యార్థులు భవిష్యత్తులో యింకా పోరాటాలు సాగిస్తారు, సాధిస్తారు అనే నినాదంతో పుస్తకంలోవున్న 28 పేజీలు పూర్తవుతాయి. ఉడుకురక్తాన్ని ఉద్రేకపరచే ఈ పుస్తకం వెల 25 పైసలు.

2. లెనిన్ (జీవిత చరిత్ర) బుర్రకథను శ్రీ సుంకర సత్యనారాయణ రాశారు. లెనిన్ విప్లవ వీరుడు, మేధావి, 'బోల్షివిక్ పార్టీ అదర్శమూర్తీను. ఇది ఎన్నికల్లో పార్టీ గొప్పతనాన్ని చాటుకొనేందుకు పనికొస్తుంది. ముప్ఫయి పేజీల బుర్రకథ వెల 40 పైసలు.

3 అమరయోధులు (బుర్రకథ). మారంవల్లి అంజరు పోరాటంలో బలియైన వారిలో ఒకరు, అన్నే రామారావు. వీరి జీవితకథను, రాజకీయ ప్రవేశాన్ని, పోరాటాన్ని చిత్రించిన ఈ బుర్రకథ రచయిత శ్రీ సుంకర సత్యనారాయణ. ప్రదర్శనకు ప్రచారానికి అనుకూలమైనది. 24 పేజీల పుస్తకం వెల 40 పైసలు.

4. పదవికోసం (నాటిక). పేరులోనే నాటికలోని ఇతివృత్తం అర్థమైపోతూవుంది. సరయిన అదనులో ప్రచురింపబడింది గనుక ప్రచారం లభిస్తుంది. రచయిత 'మిత్రశ్రీ'. ఐదు పురుష పాత్రలు, 36 పేజీలుగల పుస్తకంవెల 75 పైసలు.

5. జంట పక్షులు (నాటిక). ఉన్న నాలుగు పాత్రలూ స్త్రీలవే. అంచేత ఆడవాళ్ళు నాటికను వేయడానికి ముందుకొస్తారు. సంభాషణలు హాస్యముగా వున్నాయి గనక వినసొంపుగానే వుంటుంది. ప్రదర్శనకు అనుకూలంగావున్న ఈ నాటిక రచయిత శ్రీ ధారా రాధాకృష్ణమూర్తి. రెండు రంగాలున్న 42 పేజీల పుస్తకం వెల 75 పైసలు.

—సికరాజు.

ఆవకాయ-అమరత్వం

శ్రీ పుచ్చా పూర్ణానందం కథలు, క్రౌన్ 1/8 పేజీలు 160 వెల: రు 2—50 ప్రచురణ. పౌరసాహితి, పవరుపేట, ఏలూరు. సోల్ డిస్ట్రిబ్యూటర్స్: నవోదయ పబ్లిషర్సు, ఏలూరు రోడ్, విజయవాడ—2

"ఎర్రసిరా సమయానికి అందుబాటులో లేక....... ఆవకాయ వూటలో ముంచి అర్జంటు ఆర్డర్లు వేసేవాడట...... ఆఫీసరు. ఆ ఆర్డర్లు మహా మంటగా వుండి లోక కంటకుడని కీర్తి సంపాదించినవట." —ఆవకాయ తత్వం.

"మొదటినుంచీ నా గడియారం స్వతంత్ర భావాలు గలది....... స్వరాజ్యం వచ్చింది లగాయతు యెవరినీ లెక్కచేయటము లేదు. దాని త్రోవ దానిది...... అంధత్వం కరుడు గట్టి దానిలో వైరాయించింది......" —ఒక అల్లుడు.

"తద్దినం..... బుతువుకు ఒక్కమారుగానైనా.. సంవత్సరములో అరు పర్యాయములైనా పెట్టించే లాగు చూడాలి. విశేషమేమిటంటే పెండ్లిలో కూడా తద్దినానికి చేసినన్ని...... చేయరు.

—సఫ్రీమేళం.

* * *

కడుపుబ్బ నవ్వించే ఈ సంపుటిలో పన్నెండు కథలున్నాయి సంపుటిపేరు 'ఆవకాయ— అమరత్వం' అయినా, ఆవకాయను ఆఖరునే వడ్డించారు— నోరూరించటానికి కాబోలు.

మౌనంగా చదువుకున్నా నవ్వాపుకోలేని సందర్భాలు—'కొంపాన్వేషణ', 'లోకయ్య మామ', 'సఫ్రీ మేళం', 'నా రిస్టుక్లాక్', 'ఒక వూరిలో', 'బట్టతలలు'—కథలలో కొల్లలు.

'ఈడూ— జోడూ'లో లైట్ హ్యూమరు, 'కొండమీద విడాకులు'లో సస్పెన్సు చక్కగా వుంది. ఇక— తక్కిన కథలు 'సుహృదయుడు', 'అనుమానం', 'మూడో నేత్రం'.

'అడ్వకేటుగా తెల్సు కాని ఆయన (పూర్ణానందం) మణికట్టులో యింత పటుత్వమైన కవిత్వమున్నదని తెలియదు సుమా' అన్నార్ట వేదాన్త కవిగారు. నిజమే. భమిడిపాటి వారి బాణీ పుణికి పుచ్చుకుని ఈ కథలతో పాఠకుల్ని పకపక నవ్విస్తున్నారు, రచయిత. పుచ్చావారి ఈ కథలు తెలుగువారికి పూర్ణానందం, ఆవకాయతో పెట్టిన విందు. ఆవకాయ రంగులో ఉన్న అట్ట మీది బొమ్మ కూడా నోరూరించటానికి దోహదం చేస్తూంది.

—శివశంకరమూర్తి.

గోవా సంగ్రహ చరిత్ర

(47 వ పేజీ తరువాయి)

గల్‌తోబాటు గోవాలోనూ మార్పులు వచ్చాయి.

1845 లో బొంబాయి గ్రాంట్ మెడికల్ కాలేజీలో చేరిన మొదటి ఎనిమిది మంది విద్యార్థులలో సగం మంది గోవా వారే. వీరిలో ఇద్దరు హైందవులు వున్నారు. బొంబాయి విశ్వవిద్యాలయం మొదటి భారతీయ ఉపాధ్యక్షుడు, తెలంగ్ గోవా నుంచి వచ్చిన వ్యక్తి.

అయితే ప్రజాస్వామ్యం సాంప్రదాయాలు ఎక్కువకాలం నిలవలేదు. 1926 లో పోర్చుగల్‌లో మిలిటరీ విప్లవం వచ్చింది. 1933 లో సాలజార్ పోర్చుగల్‌నియంత అయ్యాడు.

ఈయన నిరంకుశ పరిపాలన స్వాతంత్రోద్యమాన్ని మరింత తీవ్రంచేసినా గోవాలో అంతకి ముందు స్వతంత్ర చైతన్యం లేకపోలేదు. 1654లో ఒక కాథలిక్ ఫాదరీయే పోర్చుగీసువారికి ఎదురు తిరిగాడుట! 1787 లో మరొక మతాధికారుల విప్లవం జరిగింది. 1852 సతారా రాణి, దీపాజీ, ఒక ఉద్యమాన్ని లేవదీశాడు. 1895, 1912 లలో మరి రెండుసార్లు ప్రజలు విదేశ పరిపాలకులకి ఎదురు తిరిగారు................

20 వ శతాబ్దంలో మహాత్మాగాంధీ నెలకొల్పిన శాంతియుతమయిన సహాయ నిరాకరణ ఉద్యమం గోవాలోని స్వాతంత్రోద్యమాన్ని కూడా మార్చివేసింది. 1928 లో 'గోవా నేషనల్ కాంగ్రెస్' స్థాపించటం జరిగింది. కాని సాలజార్ నిరంకుశ ధోరణిని ఈ పద్ధతి మార్చలేక పోయింది.

స్వాతంత్ర్యం

1961 లో భారత సైన్యాలు గోవాని ఆక్రమించి 400 సంవత్సరాల పోర్చుగీసు పరిపాలనని అంతం చేశాయి. 1962 లో పౌర పరిపాలన ప్రారంభం అయింది............

సమైక్యత

ఆర్. జి. భండార్కర్ కొంకణీ ఒకరకం మరాఠీ అన్నా ఇతర పండితులు ఈ అభిప్రాయముతో ఏకీభవించటం లేదు 16 వ శతాబ్దందాకా కొంకణీని కన్నడ లిపిలోనే రాసేవారని శ్రీ జార్జి మొరేస్ ఒకచోట రాశారు బీజాపూర్ సుల్తానుల పరిపాలనవల్ల మరాఠీ భాష, లిపి— వాటికి ప్రాముఖ్యత వచ్చినదని ఆయన అంటారు అయితే కొంకణీ కన్నడ భాషకి దగ్గిర అనికూడా అనలేము. కీ. శే. కొశాంబి ఇది మగధ ప్రాంతంలో ఒకప్పుడు వాడుకలో ఉన్న ప్రాకృతంనుంచి వచ్చి వుండవచ్చునని అన్నారు. కొంకణి మొదటిసారిగా విన్నవారికి ఈ సిద్ధాంతంలో నిజం వుందేమో అనిపిస్తుంది— కొంకణికి బెంగాలీకి పోలికలు గోచరిస్తాయి.

[ఈ వ్యాసాలు రాయటానికి గోవా రచయిత శ్రీ వి. ఎస్ సుక్తాంకర్ ఎంతో తోడ్పడ్డారు. వారికి రచయిత కృతజ్ఞతలు]

—ఎస్సార్.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

